సమావేశము – IX
వాల్యూము – I
నెం. 7

వెల : రూ. 27–00
22 మార్చి, 2018
గురువారం,
(శక సం. 1940,
చైత్ర శు. 5)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


| | | |
|---|---|---|
| I. ప్రశ్నోత్తరాలు | ... | 1 |
| II. సభా కార్యక్రమం : | ... | 21 |
| 1. ప్రత్యేక ప్రస్తావనలు | | |
| 2. పిటిషన్స్ | | |
| 3. గౌడ కులాల సంక్షేమం గురించి ప్రభుత్వ ప్రకటన | | |
| III. సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు | ... | 23 |
| IV. లఘు చర్చ – కె.సి.ఆర్.కిట్స్ | ... | 23 |

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎస్. దుర్గాప్రసాద్ |
| | | శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ బి. కమలాకర్ |
| | | శ్రీమతి అలివేలు |
| | | శ్రీ ఎమ్. కృపాకర్ రావు |
| | | శ్రీమతి బి. ప్రమీల |
| | | శ్రీమతి యస్. నాగమణి |
| | | శ్రీ డి. శ్రీనివాసులు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ కె. భాస్కర శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (తొమ్మిదవ సమావేశము – ఏడవ రోజు)

## గురువారం, మార్చి 22, 2018

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

**మిస్టర్ ఛైర్మన్:–** గౌరవ సభ్యులందరికీ నమస్కారం, సభకి స్వాగతం. ఇప్పుడు క్వశ్చన్ అవర్ టేకప్ చేద్దాం. ప్రశ్న నెం.2708.

### గొర్రెల పెంపకం కొరకు మేత దిగుమతి

ప్రశ్న నెం.2708(51)

శ్రీ కర్నె ప్రభాకర్, ఎం.ఎల్.సి.,:– గౌరవనీయులైన పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో గొర్రెల పెంపకాన్ని భారీ ఎత్తున అభివృద్ధి చేస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి;

ఇ) ఈ విషయంలో పొరుగు రాష్ట్రాల నుండి పశు గ్రాసాన్ని దిగుమతి చేసుకునేందుకు ప్రతిపాదన ఏదైనా ఉందా?

**గౌరవనీయులైన పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ తలసాని శ్రీనివాసయాదవ్):–** అ) అవునండీ.

ఆ) వివరణను సభా సమక్షంలో ఉంచడమయింది.

పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల సంఖ్య (13-03-2018 తేదీ నాటికి)

| వరుస నెం. | జిల్లా పేరు | 2017-18 సంవత్సరానికి లక్ష్యం | పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల మొత్తం ప్రగతి | సాధించిన విజయం శాతం |
|---|---|---|---|---|
| 1 | కామారెడ్డి | 8640 | 8350 | 96.64 |
| 2 | కెబి ఆసిఫాబాద్ | 2215 | 2137 | 96.48 |
| 3 | కొత్తగూడెం | 5524 | 5140 | 93.05 |
| 4 | వరంగల్-యు | 5653 | 5218 | 92.30 |
| 5 | జగిత్యాల | 10557 | 9739 | 92.25 |
| 6 | మంచిర్యాల | 5833 | 5373 | 92.11 |
| 7 | సిరిసిల్ల | 8153 | 7376 | 90.47 |
| 8 | గద్వాల్ | 10827 | 9753 | 90.08 |
| 9 | నిజామాబాద్ | 9631 | 8385 | 87.06 |
| 10 | మహబూబాబాద్ | 11886 | 10235 | 86.11 |
| 11 | అదిలాబాద్ | 4323 | 3687 | 85.29 |
| 12 | భూపాలపల్లి | 9687 | 8037 | 82.97 |
| 13 | సంగారెడ్డి | 15551 | 12618 | 81.14 |
| 14 | వికారాబాద్ | 10954 | 8467 | 77.30 |
| 15 | జనగాం | 10750 | 8190 | 76.19 |
| 16 | మేడ్చల్ | 3075 | 2250 | 73.17 |
| 17 | పెద్దపల్లి | 10563 | 7684 | 72.74 |
| 18 | వరంగల్-గ్రామీణ | 12560 | 8989 | 71.57 |
| 19 | మెదక్ | 10142 | 7149 | 70.49 |
| 20 | వనపర్తి | 11844 | 8286 | 69.96 |
| 21 | సిద్ధిపేట | 16824 | 10845 | 64.46 |
| 22 | యాదాద్రి | 16000 | 10167 | 63.54 |
| 23 | నాగర్‌కర్నూలు | 19253 | 11237 | 58.36 |
| 24 | ఖమ్మం | 16324 | 9233 | 56.56 |
| 25 | నల్గొండ | 32350 | 16655 | 51.48 |
| 26 | నిర్మల్ | 7148 | 3565 | 49.87 |
| 27 | కరీంనగర్ | 13519 | 6627 | 49.02 |
| 28 | మహబూబ్‌నగర్ | 27075 | 12617 | 46.60 |
| 29 | సూర్యాపేట్ | 17732 | 7285 | 41.08 |
| 30 | రంగారెడ్డి | 20927 | 7055 | 33.71 |
| | మొత్తం | 365520 | 242349 | 66.30 |

**శాసనపరిషత్తు సభ్యులు శ్రీ కర్నె ప్రభాకర్ గారు ఇచ్చిన ఎల్.సి.క్యూ నెం. 2708 లోని (బి) ప్రశ్నకు సమాధానంగా వివరణ**

- ప్రాథమిక గొర్రె కాపరుల మొత్తం సహకార సంఘాలు : 7,925
- గొర్రె కాపరుల సహకార సంఘాలలో నమోదైన మొత్తం సభ్యులు : 7,61,895
- గ్రామ సభల్లో గుర్తించిన మొత్తం లబ్ధిదారులు : 7,20,416
- 2017-18 సంవత్సర లక్ష్యం : 365520, 2018-19 సంవత్సర లక్ష్యం : 354896
- యూనిట్లను ఏర్పాటు చేయడమనేది నిరంతర ప్రక్రియ. మొత్తం లక్ష్యాన్ని సాధించేవరకు కొనసాగించడమవుతుంది.
- గొర్రెలను తప్పనిసరిగా తెలంగాణ రాష్ట్రం వెలుపల నుండి కొనుగోలు చేయవలసివుంటుంది.

గొర్రెల రకం,యూనిట్ సైజ్, వ్యయం :

| | |
|---|---|
| గొర్రెల రకం :- | గొర్రెల రకాలు అంటే నెల్లూరు బ్రౌన్, జోడిపి, దెక్కన్ మరియు మద్రాస్ ఎరుపు |
| యూనిట్ సైజ్ :- | 20 ఆడ గొర్రెలు మరియు 1 మగ గొర్రె |
| యూనిట్ వెల :- | రూ.1,25,000/- (ఆడగొర్రెలు, మగ గొర్రె, వ్యయంతో పాటు రవాణా, బీమా లాజిస్టిక్ పై సంబంధిత వ్యయం.) |
| సబ్సిడీ (75%) :- | రూ. 93,750/-. |
| లబ్ధిదారుని విరాళం (25%) :- | రూ. 31,250/- |

ఇ) లేదండీ.

**శ్రీ కర్నె ప్రభాకర్ (నామినేటెడ్):–** అధ్యక్షా, మన రాష్ట్రంలో దాదాపు 2,42,349 గొర్రెలను పంచడం జరిగిందని గౌరవ మంత్రి గారు అంకెలు ఇచ్చారు. బహుశా ఇచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు వాటి యొక్క ఉత్పత్తి రెండింతలు అయినట్లు నేను భావిస్తున్నాను. అంటే 4 లక్షల పైచిలుకు ఉన్నట్లుగా భావించవచ్చు. నేను అడిగిన (ఇ) అనే ప్రశ్నకు మంత్రి గారు లేదండీ అని సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున గొర్రెలు ఉన్నటువంటి పరిస్థితుల్లో వాటికి దాణా, పశుగ్రాసం ఉండవలసిన అవసరముంది. పక్క రాష్ట్రాల నుండి తెచ్చుకోవడం లేదని అంటున్నారు, బాగానే ఉంది.

ఇప్పుడు మన దగ్గర ఉన్నటువంటి 4 లక్షల గొర్రెలతోపాటు, ఇంకా భవిష్యత్తులో ఇచ్చేటటువంటి గొర్రెలకు ప్రభుత్వ భూమిని వాడుకుంటారా? లేకపోతే ప్రైవేటు భూములలో పశుగ్రాసం పెంచడానికి అక్కడ ఉన్న రైతులను ఎంకరేజ్ చేస్తారా? వాటికి పశుగ్రాసం అందించడానికి ఏ విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు? ఆ గొర్రెలకు సంబంధించిన ఏ ఏ రకాలైన పశుగ్రాసం/మేతని అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం నుండి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి (నామినేటెడ్):–** అధ్యక్షా, మన రాష్ట్రంలో యాదవులు, గొల్లకురుమలు వ్యవసాయ కుటుంబాల వారు కాబట్టి వాళ్లను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గొర్రెలను పంచడం జరుగుతోంది. నేను చెప్పేది ఏమిటంటే, గ్రేజింగ్ ల్యాండ్స్ తక్కువై పోయాయి కాబట్టి గొర్రెలను ఇంటెన్సివ్, సెమి ఇంటెన్సివ్ పద్ధతిలో పెంచాల్సిన పరిస్థితి వస్తుంది. అప్పుడు ఫాడర్ గాని, దాణా గాని పూర్తిగా కొనాల్సి వచ్చినప్పుడు కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ కూడా పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి సైలోజ్, ఫీడ్ అండ్ ఫాడర్, కాన్సెన్ట్రేట్స్ కొరకు ఏమైన సబ్సిడీ ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసే అవకాశం ఉందా అనేది ఒకటి.

రెండు – వివిధ రాష్ట్రాల నుండి గొర్రెలను తీసుకొచ్చేటప్పుడు కొత్త కొత్త రోగాలు వస్తుంటాయి. ఉదాహరణకు అనంతపూర్‌లో ఆంత్రాక్స్ డిసీజ్ ఉన్నది. అటువంటి గొర్రెలు ఇక్కడికి వచ్చినప్పుడు ఆ వ్యాధిని నివారించే విధంగా ఏమైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నదా?

మూడు – మన నేటివ్ బ్రీడ్ దక్కన్ బ్రీడ్. వివిధ రాష్ట్రాల నుంచి వివిధ టైప్ ఆఫ్ బ్రీడ్‌ని కొనుక్కొని వస్తే, మన బ్రీడ్

ఉండే అవకాశం లేదు. కాబట్టి, బ్రీడ్‌ని బతికించుకునే విధంగా ఏమైనా ఆలోచన చేస్తున్నారా? నాలుగు – గొర్రెలు రీసైక్లింగ్ అవుతున్నాయని వార్తా పత్రికల్లో ఫొటోలతో సహా చూస్తున్నాము. దీనిని అరికట్టడానికి మనం ఎటువంటి ప్రయత్నాలు చేస్తున్నాము?

ఐదు – ఇవ్వాళ యాదవ సంఘాలలో ఉన్న మెంబర్స్ అందరికీ గొర్రెలను ఇవ్వాలనే ఒక పాయింట్ ఈ పథకంలో ఉంది. నేను చెప్పేది ఏమిటంటే, ఉద్యోగం చేసే వాళ్లైనా, గ్రామాలలోనే ఉండే వారికి మాత్రమే ఇస్తే బాగుంటుంది. బయటి ప్రాంతాలలో ఉద్యోగం చేసే వాళ్లు, గ్రామాలలో ఉండని వాళ్లకి ఇస్తే బహుశా రీసైక్లింగ్ జరగడానికి అవకాశం ఎక్కువగా ఉంది కాబట్టి వాళ్లకి ఇవ్వాల్సిన అవసరం లేదనేది నా ఉద్దేశం. అటువంటిది ఏమైనా ఆలోచిస్తున్నారా తెలుపవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

**శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు (శాసనసభ నియోజక వర్గం):–** అధ్యక్షా, ఈ యొక్క గొర్రెల పంపిణీ పథకం చాలా మంచి పథకం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రిగారు, గౌరవ మంత్రివర్యులు శ్రీ తలసాని శ్రీనివాస యాదవ్ గారు గొర్రెల పెంపకం విషయంలో పెద్ద ఎత్తున జాగ్రత్తలు తీసుకొని ల్యాటరీ ద్వారా ఒక క్రమ పద్ధతితో ఇవ్వాళ సెలక్షన్ చేయడం జరిగింది. పెద్ద ఎత్తున గొర్రెలు మన గ్రామాలకు చేరుకుంటున్నాయి. ఇంతకు ముందు గౌరవ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి గారు చెప్పినట్లు, లారీలలో గొర్రెలను తీసుకొచ్చేటప్పుడు ఎగుడు, దిగుడు వల్ల ఇబ్బంది ఎదురై, అవి కొన్ని రోజులకు సిక్ అయ్యే పరిస్థితి వచ్చినవి.

గౌరవ ముఖ్యమంత్రి గారు సిద్దిపేటలో ఈ గొర్రెల పెంపకం పథకాన్ని ప్రారంభించినప్పుడు గౌరవ మంత్రి శ్రీ హరీష్ రావు గారు కూడా అక్కడే ఉన్నారు. ఈ గొర్రెలకు జబ్బులు వచ్చినప్పుడు గాని, దెబ్బలు తగిలినప్పుడు గాని ఎలాంటి మెడిసిన్ ఇస్తే బాగుంటుందని ఆరోజు మేము ప్రదర్శనశాలలో చూడడం జరిగింది. ఇవ్వాళ గ్రామాలకు వచ్చిన గొర్రెలకు సంతానం కలిగి పెద్ద ఎత్తున ఉత్పత్తి అవుతున్నాయి. ఇంకా ఈ ప్రాసెస్ జరుగుతూ ఉంది కాబట్టి అవి ఆరోగ్యకరంగా ఉండే విధంగా మందులు సరఫరా చేస్తే బాగుంటుందని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ (శాసనసభ నియోజక వర్గం):–** అధ్యక్షా, మన ప్రభుత్వం ఇప్పటికే 60 లక్షల గొర్రెలను పంచడం జరిగింది. దీంట్లో 25 శాతం పైన నిరుద్యోగులైన యువకులకు ప్రభుత్వం కేటాయించడం జరిగింది. గతంలో పడావు భూములలో ఈ గొర్రెలు మేతకు పోయేవి. తమరి ద్వారా నేను మంత్రిగారిని కోరేది ఏమిటంటే, ఈ నిరుద్యోగ యువకులకు వారి ఇంటి దగ్గరే షెడ్లు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఏమైనా ఆలోచన చేస్తుందా? వారు అడవులలోకి వెళ్లి గొర్రెలను మేపుకొని పోయేటటువంటి పరిస్థితి కొద్దిగా ఉంది. ఇప్పటికే ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. ద్వారా కొంత ఈ షెడ్ల పథకం ఉంది. కాబట్టి అటువంటి నిరుద్యోగులకు వారి ఇంటి దగ్గరే ఆ గొర్రెలకు మేత వేసి మేపుకోవడానికి ఆ షెడ్ల ద్వారా ఉపయోగంలోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం ఏమైనా ఆలోచన చేస్తున్నదా? తెలుపవలసిందిగా మీ ద్వారా అడుగుతున్నాను.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ కర్నె ప్రభాకర్ గారు, శ్రీ శ్రీనివాస్ రెడ్డి గారు, శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు గారు, శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ గారు చాలా విషయాలను మా దృష్టికి తీసుకురావడం జరిగింది. ప్రధానంగా ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం గురించి గతంలో చెప్పాను, మళ్లీ చెబుతున్నాను. ఇవ్వాళ ఒక్క గొర్రెలను మాత్రం ఇచ్చేసి మా పని అయిపోయిందనే కాన్సెప్ట్ కాకుండా, వీటికి కావలసిన మందులు, పశుగ్రాసం ఇవ్వడం జరుగుతోంది.

ఇంతకు ముందు గొర్రెలు అడవులలోకి వెళ్లాలంటే చాలా అవరోధాలు ఉండేవి. ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి గారు అటవీ శాఖ, ఉద్యాన శాఖ మరియు పశు సంవర్ధక శాఖా అధికారులతో ప్రగతి భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసి, వేసవి కాలం మొదలైంది కాబట్టి ఏప్రిల్ నుండి జూన్ నెల వరకు మనం వాటికి కావలసిన జాగ్రత్తలు తీసుకోవడానికి, అడవులలో వాటి మేతకు కావలసిన గడ్డిని పెంచి, అక్కడ వాటిని వదిలి వేస్తే మేత మేసే విధంగా వారికి స్పష్టమైన ఆదేశాలివ్వడం జరిగింది. ఈ విధంగా ఒక్కపైన ఈ ప్రాసెస్ చేసుకుంటూ మనం ముందుకు వెళుతున్నాం.

ఇంతకు ముందు 1.28 కోట్ల గొర్రెలు మన రాష్ట్రంలో ఉన్నాయి. దేశంలో మనం రెండవ స్థానంలో ఉన్నాం. అయితే మనకు 52 లక్షల చిల్లర గొర్రెలు అదనంగా వచ్చాయి. ఇప్పటికే 16 లక్షల పిల్లలు పుట్టడం జరిగింది. గడిచిన ఆరు మాసాల నుండి వీటికి కావలసిన వ్యాక్సినేషన్, మెడిసిన్ మరియు పశుగ్రాసం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకొని ఎక్కడా ఏ ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో మా శాఖ జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. అయితే వేసవి కాలంలో కొంత ఇబ్బంది ఎదురవుతుందనే ముందు చూపుతో కొన్ని ప్రికాషన్స్ తీసుకొని ఇప్పటికే టెండర్ ప్రాసెస్ చేసి ప్రతి జిల్లాల్లో కూడా పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచే విధంగా కార్యక్రమాలు చేయడం జరిగింది.

అలాగే 75 శాతం సబ్సిడీ మీద గడ్డి విత్తనాలు కూడా ఇవ్వడం జరిగింది. ఒక ఎకరం, రెండు ఎకరాలు, ఐదు ఎకరాలు ఉన్న గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీ మీద ఇచ్చి, మీ యొక్క పొలంలోనే జీవాలకోసం కొంత గడ్డి పెంచుకోవాలని చెప్పడం జరిగింది. ఇంతకుముందు గౌరవ సభ్యులు శ్రీ శ్రీనివాస్ రెడ్డి గారు రీసైక్లింగ్ గురించి మాట్లాడారు. మొదట్లో కొంత జరిగిన మాట వాస్తవమే అయినప్పటికీ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అన్ని జిల్లాల్లోని కలెక్టర్లతో అక్కడ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, కమర్షియల్ ట్యాక్స్, ట్రాన్స్‌పోర్ట్ మరియు పోలీసుల సహకారంతో ఫాడర్ చెక్‌పోస్ట్‌లన్నీ బలోపేతం చేయడం జరిగింది. పూర్తిస్థాయిలో వాళ్ల మీద చర్యలు తీసుకోవడమే కాకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది. ఈ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఊహించని కార్యక్రమాలు, ఎవరూ కూడా కలలో కూడా ఊహించనటువంటి కార్యక్రమాలు ఈరోజు మన ప్రభుత్వం చేస్తున్నది.

ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలైతే, ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి బడుగు బలహీన వర్గాలు, వెనకబడిన తరగతులలో ప్రధానమైన గొల్ల, కురుమలకు కెసిఆర్ గారు ముఖ్యమంత్రి అయిన తర్వాతనే స్వాతంత్ర్యం వచ్చింది అధ్యక్షా. గతంలో ప్రభుత్వాలు ఇవ్వాలంటే ఇబ్బంది పడుతుండేది. ఈరోజు ఎన్‌సిడిసి ద్వారా లోన్ తీసుకువచ్చి రూ.5,000 కోట్లు వీటి కోసం కేటాయించడం జరిగింది. భవిష్యత్తులో రూ.10,000 కోట్లు అయినా వీటి కోసం నేను ఇస్తానని ధైర్యంగా ఈ కుటుంబాలలో ఒక దేవుడి మాదిరిగా నిలిచారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. పేదవాడి ఆకలి తీర్చిన వ్యక్తే ముఖ్యమంత్రి అయితే తప్పకుండా ఆ రాష్ట్రం బంగారంగా ఉంటుంది, పాడి పంటలతో కళకళలాడుతూ ఉంటుంది.

ఇంతకుముందు గౌరవ సభ్యులు శ్రీ శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, వేరే రాష్ట్రాల నుండి తెచ్చే గొర్రెల గురించి చెప్పారు. అయితే మన రాష్ట్రానికి అనుగుణంగా ఉన్నటువంటి గొర్రెలను అన్ని రాష్ట్రాల నుండి తెచ్చుకోవలసిన అవసరముంది. మా వెటర్నరీ డాక్టర్లతో మెడికల్‌గా గొర్రెలను చెకప్ చేసిన తరువాతనే మనం కొనుగోలు చేయడం జరుగుతుంది. అలాగే ఇక్కడ ఉన్న వాతావరణానికి ఇబ్బంది పడి సుమారు 28,000 చిల్లర గొర్రెలు చనిపోయిన మాట వాస్తవం. అయితే వాటిని కొనుగోలు చేసినప్పుడే ఇన్సూరెన్స్ చేయించాం. అందువల్ల ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదు. జిల్లా కలెక్టరేట్‌లో డబ్బులు కూడా డిపాజిట్ చేయడం జరిగింది.

రెండు – మనం గడ్డి విత్తనం ఇచ్చేటప్పుడు రూ.450–ల విలువగల ఒక కిట్ ఉంటుంది. అది కూడా జిల్లా కలెక్టరేట్‌లో మా యొక్క శాఖలో ఆ కార్యక్రమాలన్నీ మొదటే ఆర్గనైజ్ చేసుకోవడం జరిగింది. కాబట్టి రాష్ట్రంలో పాడిపంటలతో, వ్యవసాయానికి అనుబంధంగా ఉన్నటువంటి పరిశ్రమ ఇది. పాడి విషయంలో ఆవులు, గొర్రెలు మాత్రమే కాకుండా అన్ని జీవాల కోసం చాలా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతోంది.

మూడు – మన రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశం మేరకు మన ఆరోగ్య శాఖ మంత్రి గారి ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖలో ఎన్నో మార్పులు రావడం జరిగింది. ఈ దేశంలో మనుషులకే డాక్టర్లు గతిలేరు. అదృష్టం ఏమిటంటే, ఈరోజు 100 సంచార పశు వైద్యశాలలను ప్రతి నియోజక వర్గానికి ఒకటి చొప్పున ఇవ్వడం జరిగింది. దాంట్లో డాక్టర్‌తోపాటు మెడిసిన్, ప్యారావెట్ తీసుకొని ఆ గ్రామాలలో ఉన్న సంతల దగ్గరికే వెళ్లి మెడిసిన్ ఇస్తున్నటువంటి దాఖలాలు ఈ దేశంలో ఎక్కడా లేవు అధ్యక్షా. వీటికి 100 సంచార పశు వైద్యశాలలు సరిపోవడం లేదని భవిష్యత్తులో ఇంకా పెంచుకునే విధంగా ప్రయత్నం జరుగుతుందని నేను ఈ సభ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. కాబట్టి, మన రాష్ట్రంలో ఉన్నటువంటి కుటుంబాలు ఎక్కడా కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది.

గతంలో ఉన్నటువంటి ప్రభుత్వాలు ఏదో రెండు రోజుల పబ్లిసిటీ కోసం ఏదో ఒక కార్యక్రమం ఏర్పాటు చేసేవారు. కానీ ఈరోజు గొర్రెలు ఇవ్వడమే కాకుండా, వాటికి కావలసిన మేత మరియు మందుల విషయంలో ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళుతోంది. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు పశు సంవర్ధక శాఖ మరియు మత్స్య శాఖలకు కలిపి బడ్జెట్‌లో రూ.5.00 కోట్లు కేటాయించేవారు. ఈరోజు చూసినట్లయితే మన రాష్ట్రంలో వ్యవసాయానికి, సాగునీటి పారుదలకు అంత ప్రాధాన్యం ఇస్తున్నటువంటి శాఖ ఇది అని, నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కాబట్టి గౌరవ శాసనమండలి సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాలకు వెళ్లి జరుగుతున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరుతున్నాను.

ప్రతి జిల్లాలో ఉన్నటువంటి పట్టణంలో గాని, గ్రామాల్లో గాని ఎక్కడికి వెళ్లినా మొదట గొర్రెలు అడ్డం వస్తాయి. వీళ్లకు ఆర్థికంగా కూడా పెద్ద సంపద. అంటే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయాలనే ఒక సంకల్పం తెలంగాణ ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి, పేదవాడి ఆకలి తెలిసిన వ్యక్తి కాబట్టే ఈరోజు ఉన్న కుటుంబాలు రాబోవు కాలంలో ఆర్థికంగా,

బలంగా వీళ్లు ఉంటారని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కాబట్టి గొర్రెల విషయంలో తప్పకుండా వేసవి కాలంలో గాని, మెడిసిన్ మరియు పశుగ్రాసం విషయంలో గాని లేకపోతే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గాని అన్ని జాగ్రత్తలు తీసుకొని ముందుకు వెళుతున్నామని ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను.

**వ్యవసాయ మార్కెటింగ్ శాఖ క్రింద గిడ్డంగులు**

ప్రశ్న నెం.2779(52)

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి మరియు శ్రీ పురాణం సతీష్ కుమార్, ఎం.ఎల్.సి.లుః- గౌరవనీయులైన సాగునీరు & మార్కెటింగు శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వ్యవసాయ మార్కెటింగు శాఖ క్రింద గోదాముల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

ఇ) దీని క్రింద అదనపు నిల్వ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయడానికి ఖర్చు చేసిన నిధుల పరిమాణం ఎంత?

**గౌరవనీయులైన సాగునీరు & మార్కెటింగు శాఖ మంత్రి (శ్రీ టి. హరీష్ రావు)ః-** అ) అవునండీ.

ఆ) రూ.1024.50 కోట్ల మొత్తంతో 18.30 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల 364 శాస్త్రీయ గోదాములను నిర్మిస్తున్నాము.

ఇ) ఇప్పటివరకు రూ.818.14 కోట్ల నిధులను ఖర్చు చేయడమయింది.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి (పట్టభద్రుల నియోజక వర్గం - వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ)ః-** అధ్యక్షా, చాలా సంతోషం. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ప్రజలకు ఉపయోగపడే విధంగా గోదాములను నిర్మించడం జరిగింది. ఈ మధ్యకాలంలో కొత్తగా కొన్ని మండలాలు ఏర్పడ్డాయి. మొదటిది - ఇంతకుముందు పాత మండలాలకు ప్లాన్ చేశారు కాని ఈ కొత్త మండలాల్లో కూడా గోదాములను నిర్మించడానికి ఏమైనా అవకాశం ఉన్నదా? రెండవది - ఈ విధంగా నిర్మించిన గోదాములను ఏయే ఉపయోగాల కోసం వాడుతున్నామో, తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

మూడవది - ఈ మధ్యకాలంలో మన వ్యవసాయ శాఖ ద్వారా అనేక సబ్సిడీలు ఇవ్వడం వల్ల పూలు, పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెరిగింది. వాళ్లు అవసరమనుకుంటే స్టోర్ చేసుకోవడానికి కావలసిన శీతల గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం వద్ద ఏవైన ప్రణాళికలున్నాయా తెలియజేయవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

నాలుగు - మిర్చి ధరల్లో కూడా ఎక్కువగా హెచ్చు, తగ్గులు వస్తున్నాయి. ఇవ్వాళ రూ.12,000/- ఉంటే రేపు రూ.8,000/- ఉంటుంది. అటువంటప్పుడు ఈ గోదాముల కంటే శీతల గిడ్డంగులే అవసరముంటుంది. కాబట్టి ఈ గోదాముల నిర్మాణంతోపాటు శీతల గిడ్డంగుల నిర్మాణానికి ఏమైనా చర్యలు చేపట్టారా తెలియజేయవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పురాణం సతీష్ కుమార్ (స్థానిక సంస్థలు - ఆదిలాబాద్)ః-** ధన్యవాదాలు అధ్యక్షా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 4 లక్షల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థ్యం గల గోదాములు ఉండేవి. ఈనాడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో 18.30 లక్షల మెట్రిక్ టన్నుల గోదాములను నిర్మించి, దానికి అనుగుణంగా బడ్జెట్ కూడా కేటాయించడం జరిగింది. మొత్తం 364 గోదాములను కట్టే ప్రయత్నంలో దాదాపు 356 గోదాములను పూర్తి చేసి, ఈరోజు రైతులకు అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషం. అందుకు గౌరవ మార్కెటింగ్ శాఖ మంత్రి శ్రీ హరీష్‌రావు గారికి ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నాను. ఈ గోదాముల నిర్మాణం వలన రైతులకు చాలా ఉపయోగకరంగా మారింది. గతంలో రైతులు పండించిన పంటను నిల్వ చేసుకునే స్థలం లేక, ఇండ్లల్లో జాగలు లేక కల్లాల మీదనే దళారులు గాని, కమిషన్ ఏజెంట్లు గాని, ట్రేడర్స్ గాని, వ్యాపారులు గాని వారు నిర్ణయించిన ధరకే అమ్ముకునే పరిస్థితి ఆరోజు రైతులకు ఉండేది.

10.20 ఉ.

ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటే కమీషన్ ఏజంట్ గాని, ట్రేడర్ గాని, వ్యాపారి గాని, రైతులకు మద్దతు ధర కల్పించని పరిస్థితులల్లో ఆ ధాన్యాన్ని తీసుకొచ్చి నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గోదాములను నిర్మించడం వలన ఈనాడు రైతులకు గిట్టుబాటు ధర తెచ్చే విధంగా గోదాముల నిర్మాణం దోహదపడుతుందని తెలియజేసుకుంటున్నాను. మిషన్ కాకతీయ ద్వారా మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నటువంటి వ్యవసాయ అనుకూల విధానాల వల్ల పంట దిగుబడి అసాధారణ రీతిలో పెరిగింది. కొత్త గోదాములను నిర్మించే ప్రతిపాదన ప్రభుత్వం దగ్గర ఏదైనా ఉన్నదా? అని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు:-** అధ్యక్షా, రాష్ట్ర వ్యాప్తంగా గోదాముల నిర్మాణ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం బ్రహ్మాండంగా చేపట్టింది. నా సొంత గ్రామం, మండలం కేంద్ర చౌరస్తా గ్రామమైన బచ్చన్న పేటలో చెక్‌పోస్ట్ ద్వారా పెద్ద ఎత్తున జనగామ మార్కెట్‌కు ఆదాయం వస్తోంది. గతంలో మేము ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఇక్కడ గోదాములను కట్టించలేదు. కానీ, గౌరవ ముఖ్యమంత్రిగారు వచ్చిన తరువాత పెద్ద ఎత్తున బచ్చన్న పేట మార్కెట్ యార్డ్ స్థలంలో గోదాములను నిర్మించడం జరిగింది. పెద్ద ఎత్తున ఇరిగేషన్ కార్యక్రమాలను చేపట్టడం వలన, జనగామ కరవు నియోజకవర్గానికి దేవాదుల నుండి నీళ్లు రావడం వలన మొన్నటి సారి బ్రహ్మాండంగా పంటలు పండి విపరీతంగా దిగుబడులు వచ్చాయి. బచ్చన్న పేట మండలంలో చేర్యాల మార్కెట్ యార్డ్ ఉన్నది. బచ్చన్న పేటనే సెపరేటు మార్కెట్ యార్డ్‌గా చేయాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ టి. హరీష్ రావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పినట్లుగా 164 మండలాలలో గిడ్డంగులు లేవు. వాటిని నిర్మించడమే ముఖ్యం కాదు, వినియోగంలోకి తేవడం కూడా అంత కంటే ముఖ్యం. రాష్ట్ర వ్యాప్తంగా 364 గిడ్డంగులను నిర్మించడం జరిగింది. మేము నాబార్డ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థకు రాష్ట్రంలో ఇంకా గిడ్డంగులను ఎక్కడ నిర్మించాలి? ఎంత సామర్థ్యం ఉన్న గిడ్డంగులను నిర్మించాలి? ఏ ప్రాంతంలో నిర్మించాలి వంటి విషయాలను పరిశీలించి ఒక రిపోర్టు ఇవ్వవలసిందిగా నాబార్డ్ సంస్థను కోరడం జరిగింది. ఆ రిపోర్టు వచ్చిన తరువాత దాని ఆధారంగా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇంకా గిడ్డంగుల అవసరం ఎక్కడ ఉంటే అక్కడ మరిన్ని గిడ్డంగులను నిర్మించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. వీటి నిర్మాణం వలన కేవలం పంటలకే కాదు, పంట ప్రారంభంలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ముందస్తుగా ఆయా మండలాల్లో, ఆయా నియోజకవర్గాల్లో పంటలను నిల్వ చేసుకోవడం వల్ల ఈ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుండి ఎరువుల కొరత, విత్తనాల కొరత అనే పదం లేకుండా పోయింది.

కాంగ్రెస్ హయాంలో ప్రతి సీజన్‌లో ఎరువులు కొనుక్కోవడానికి వచ్చిన రైతులను పోలీస్ స్టేషన్ల ముందు నిలబెట్టి లాఠీఛార్జీలు, ధర్నాలు చేయించినటువంటి సంఘటనలు మనకు ప్రతి నిత్యం కనపడేవి. ఈనాడు తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు ముందుచూపుతో గిడ్డంగులను నిర్మించడం వలన ఎక్కడ కూడా అలాంటి సమస్యలు రాష్ట్రంలో లేకుండా పోయాయి. ఎంత పంట పండినా కూడా సైంటిఫిక్‌గా గిడ్డంగులలో ప్రభుత్వం కొని నిల్వ చేసుకునే అవకాశం కలిగింది. వీటిని ప్రభుత్వ సంస్థలు సివిల్ సప్లై సంస్థ వడ్లను, మార్క్‌ఫెడ్ సంస్థ మొక్కజొన్నను, నాఫెడ్ సంస్థ కందులను, హాకా సంస్థ ఇతర పప్పు దినుసులను కొంటుంది. వారందరికీ కూడా ఈ గిడ్డంగులను నిర్మించి ఇవ్వడం జరుగుతోంది.

గతంలో ఈ గిడ్డంగులు లేకపోవడం దాదాపు రూ.3.50/-, రూ.4/- ల చొప్పున స్క్వేర్ ఫీట్‌ను అద్దెకు తీసుకొనేవారు. ఇప్పుడు ప్రభుత్వం నిర్మించి అద్దెకు ఇచ్చిన గిడ్డంగులు కాబట్టి, కేవలం రూ.2/- చొప్పున స్క్వేర్ ఫీట్‌ను అద్దెకు ఇవ్వడం జరుగుతోంది. ప్రాథమికంగా అధ్యయనం చేయడం వల్ల ఈ సంవత్సరం రూ.8 కోట్ల 4 లక్షలు సివిల్ సప్లైస్ సంస్థ, మార్క్‌ఫెడ్ సంస్థలకు ఆదా అయినది. అంటే ఇటు రైతులకు, ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా ఆదా జరుగుతోంది. ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యం కూడా ఇదే. దేశంలోని ఏ రాష్ట్రం కూడా ఈ విధంగా చేయలేదు. ఒక్క సంవత్సర కాలంలో దాదాపు రూ.1,000 కోట్లు ఖర్చు పెట్టి 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను రాష్ట్రంలో నిర్మించడం అనేది ఒక రికార్డుగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన 70 సంవత్సరాలలో గత ప్రభుత్వాలు కేవలం 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని కలిగిన గిడ్డంగులను ఈ రాష్ట్రంలో నిర్మిస్తే ఒకే ఒక సంవత్సరంలో 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను నిర్మించడం అనేది ఎంతో కృషితో కూడుకున్నది. రైతుల, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మన గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

**SHORTAGE OF CASH AT A.T.M. CENTRES**

LCQ No.2837(53)

Sri Syed Aminul Hasan Jafri, MLC:- Will the Minister for Finance & Planning be pleased to state:

a) whether it is a fact that there is acute shortage of currency notes at ATMs and Bank Branches in Telangana State ever since the demonetization was announced in November, 2016;

b) if so, the details thereof and the reasons therefor;

c) the steps taken by the State Government in this regard?

**SRI EATALA RAJENDER (HON'BLE MINISTER FOR FINANCE)**:- a) Yes Sir. It is ascertained from State Level Bankers Committee that there is acute shortage of currency.

b) As per Convener, SLBC for Telangana State, the following are main reasons for shortage of currency in ATMs/branches.

i) Inadequate supply of currency by RBI.

ii) Reduction in inflow of currency from public particularly ATM fit notes/ denominations. There is mismatch between cash receipts and cash payments and consequential shortage of cash in branches/ATMs.

iii) Requirement of higher denomination notes are more, currency supply was in lower denominations.

c) Government have already addressed the issue to the Governor, RBI and Government of India to supply adequate cash to meet the demand of people of Telangana State.

SYED AMINUL HASAN JAFRI (LOCAL BODIES - HYDERABAD):-

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): آپ نے یہ بتایا کہ "There is inadequate supply from Reserve Bank of India". نے کیا۔ وہ کونسا criteria استعمال کر رہا ہے۔ نئی کرنسی نوٹ issue کرنے کے criteria پر عمل کر رہا ہے؟ میری معلومات کے مطابق ریزرو بینک آف انڈیا ملک وریاست کی آبادی کے حساب سے نئی کرنسی نوٹس supply کر رہا ہے۔ مثلاً ملک کی جملہ آبادی میں سے 17% آبادی اتر پردیش میں ہے۔ تو 17% کرنسی نوٹوں کو supply کیا گیا ہے۔ اسی طرح ملک کی جملہ آبادی میں تلنگانہ کی آبادی کا تناسب 3% ہے تو 3% کے حساب سے نوٹ release ہو رہے ہیں؟ اگر ایسا ہے تو پھر یہاں پر نوٹوں کی قلت کیوں ہو رہی ہے؟ demonetization کے کچھ دن بعد اتر پردیش میں انتخابات بھی ہوئے تھے۔ وہاں پر نوٹوں کی کوئی قلت نہیں ہوئی۔ اس کی وجہ یہ ہے کہ بینک deposits کم ہے اور جو کرنسی نوٹ فراہم ہو رہی تھیں اور تلنگانہ میں بینک deposits ہیں اور مہاراشٹر اور دوسری 3 تا 4 ریاستوں کے بعد تلنگانہ کی عوام نے جو deposits بینکوں میں کئے تھے وہ بہت زیادہ ہیں، میں اور ایک چیز پوچھنا چاہتا ہوں کہ جب demonetization ہوا تھا تب تلنگانہ بالخصوص حیدرآباد میں کتنے demonetization نوٹس deposit کئے گئے؟ اور اس کے بعد نئی کرنسی نوٹس تلنگانہ میں کتنے آئے؟ اور بالخصوص حیدرآباد میں کتنے آئے؟

**శ్రీ ఈటెల రాజేందర్:–** అధ్యక్షా, పాత నోట్ల రద్దు తరువాత మన రాష్ట్రానికి వచ్చిన కరెన్సీ విలువ రూ.73,642 కోట్లు. పాత నోట్ల రద్దుకు ముందున్న కరెన్సీ నోట్ల విలువ కంటే కూడా మనకిచ్చిన కరెన్సీ విలువ 15 శాతం ఎక్కువ. గతంలో రూ.500 నోట్లు ఉండడం వలన ఎక్కువ కరెన్సీ నోట్లు చలామణిలో ఉండేవి. రూ.2000 నోట్లు వచ్చిన తరువాత ప్రత్యేకించి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో బయటికి పోయిన కరెన్సీ మళ్లీ బ్యాంకులకు రావడం లేదనే భావనను వ్యక్తం చేశారు. ఈ అంశానికి సంబంధించి దేశంలో కేంద్రం పార్షియాలిటీతో పనిచేస్తున్నది. మనలాంటి రాష్ట్రాలలో చాలా పెద్ద సమస్యగా ఉన్నది. ATM మిషన్స్ పనిచేయడం లేదు. బ్యాంకులల్లో కూడా కరెన్సీ లేదు. చాలా ఇబ్బందిగా ఉన్నది. మీరు చెప్పిన డిజిటల్ వ్యవహారాలు కూడా రోజురోజుకు తగ్గిపోతున్నాయని చెప్పి ముఖ్యమంత్రిగారు, నేను దేశ గౌరవ ప్రధానమంత్రిగారిని, ఆర్థిక మంత్రిగారిని కలిసి వివరించడం జరిగింది. మేము అడిగినప్పుడల్లా దాదాపు రూ.2,000 కోట్లు, రూ. 3,000 కోట్లు కొత్త కరెన్సీని ఇచ్చి కొంత ఆదుకున్న మాట వాస్తవం.

కానీ, ఈ రాష్ట్రంలో 8,701 ATM Branches, సుమారు 5,400 బ్యాంక్ బ్రాంచులు, మన రాష్ట్రంలో 45 బ్యాంకులు ఉన్నాయి. పాత నోట్ల రద్దు తరువాత డిజిటల్ వ్యవహారాలు అనే ఒక విప్లవాత్మకమైన చర్య జరిగిందో, జీఎస్టీ తరువాత బ్యాంకు ఖాతాలన్నీ ఆధార్‌తో లింకప్ చేయడం వలన, వీటి మీద income tax శాఖ వారు పెద్ద ఎత్తున నిఘా పెట్టడం వలన ప్రజలు భయాందోళనలకు గురైనారు. బ్యాంక్ వ్యవహారం జరిపితే ఆదాయ పన్ను వారికి తెలుస్తుంది. బ్యాంక్ వ్యవహారం జరిపితే జీఎస్టీ ట్యాక్స్ కట్టవలసి వస్తుంది. బ్యాంక్ వ్యవహారం జరిపితే నోటీసులు వస్తాయనే భయంతో చాలా మంది బ్యాంక్ ద్వారా, డిజిటల్ వ్యవహారాల ద్వారా కాకుండా క్యాష్ ద్వారా వ్యవహారాలు జరుపుతున్నారు. దాని వల్ల కొన్ని సమస్యలు వచ్చాయని ఆ విషయాలను కూడా కేంద్రానికి వివరించడం జరిగింది. అయ్యా, మీరు జీఎస్టీ తరువాత ఏదైతే ట్యాక్స్ బేస్ పెరుగుతుందని చెప్పారో, ట్యాక్స్ బ్యాలెన్స్ పెరుగుతుందని చెప్పారో, ట్రాన్స్‌ఫరెన్సీ పెరుగుతుందని చెప్పారో, ఎగవేత ఆగిపోతుందని చెప్పారో, అవన్నీ జరగకపోగా ఈనాడు జీఎస్టీ వచ్చిన తరువాత కూడా క్యాషా? బిల్లా, with or without ? అనే స్థాయికి వచ్చింది. ఈ లోపాన్ని కూడా సరిచేయమని కోరడం జరిగింది.

ఒకసారి క్యాష్ బయటికి వచ్చిన తరువాత జమ కాకపోవడానికి కొన్ని కారణాలను వారు చెప్పారు. ఈరోజు కూడా ఆర్‌బిఐ గవర్నర్‌తో మన ఆర్థిక శాఖ సెక్రటరీ గారితో సమావేశం జరుగుతోంది. ఈ సమస్యను కూడా ప్రస్తావించే ఆస్కారం ఉన్నది. ఉన్నంతలో తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రిగా అనేకసార్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగారిని కలిసి ఈ సమస్యను పరిష్కరించండి, ప్రజలు చాలా భయాందోళనలతో ఉన్నారని చెప్పడం జరిగింది. మొన్న వ్యవసాయ శాఖ మంత్రిగారు శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డిగారు, నేను ఢిల్లీకి వెళ్లి రైతాంగానికి రైతు పెట్టుబడి పథకాన్ని అమలు చేయబోతున్నాం. రైతులకు విత్తనాలు కొనుగోలు కోసం, కూలీ డబ్బులు ఇవ్వడానికో, ట్రాక్టర్ దున్నడానికి డబ్బులు ఇవ్వడానికో రైతులకు డబ్బు అవసరమవుతుంది. దానికోసం రూ.5,000 కోట్లను ఇవ్వమని అడగడం జరిగింది. ఈరోజు కూడా అదే డిమాండ్‌ను

కోరబోతున్నాం. ఉన్నంతలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వపరంగా మా శాయశక్తుల ప్రయత్నం చేస్తున్నాం. రాబోయే కాలంలో కొంత ఈ సమస్య పరిష్కారం అవుతుందనే విశ్వాసం ఉంది.

**మిస్టర్ ఛైర్మన్:–** ప్రశ్న నెం.2866(54) సభ్యుడి కోరిక మేరకు వాయిదా వేయడమైనది. ఇప్పుడు ప్రశ్న నెం.2671.

## సిద్ధిపేటలో మోడల్ రైతు బజారు

ప్రశ్న నెం.2671 (55)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఫారూక్ హుస్సేన్ మరియు వి. భూపాల్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు:– గౌరవనీయులైన సాగునీరు, మార్కెటింగు శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) సిద్ధిపేటలో ఆధునిక సదుపాయాలతో రైతు బజారును నిర్మించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

ఇ) రాష్ట్రంలోని ఇతర పట్టణాలలో కూడా సదరు ఆధునిక రైతు బజారును నిర్మించే ప్రతిపాదన ఏదైనా ఉందా;

ఈ) అయితే, అందుకు సంబంధించి తీసుకున్న చర్య ఏమిటి?

**గౌరవనీయులైన సాగునీరు, మార్కెటింగుశాఖ మంత్రి (శ్రీ. టి. హరీష్ రావు):–** అ) అవునండీ.

ఆ) మూడు అంతస్తుల భవనంలో ఆధునిక సదుపాయాలన్నింటితో రైతు బజారును నిర్మించడమయింది.

ఇ) అవునండీ.

ఈ) మహబూబ్‌నగర్, భువనగిరి, చేర్యాల, జోగిపేట, సిరిసిల్ల, మెదక్, జమ్మికుంట, హుజూరాబాద్ మొదలగు పట్టణాలలో అధునిక రైతు బజార్ల నిర్మాణము చేపట్టినాము.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయుల నియోజకవర్గం – మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్):–** అధ్యక్షా, రైతు మురిసిన, ప్రజలు మెచ్చిన షాపింగ్ మాల్ ఈనాటి మోడల్ రైతు బజార్. అందుకని ప్రతి పట్టణంలో మోడల్ రైతు బజార్ ఉండాలనే కాంక్ష ఉంటుంది. రానున్న రోజుల్లో 60 శాతం ప్రజలు అర్బనైజేషన్ అవుతారని మొన్న కేంద్ర అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రిగారు చెప్పారు. అందుకని ప్రతి పట్టణంలో ఈ మోడల్ రైతు బజార్లను కావాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు. కాబట్టి భవిష్యత్తులో ఈ మోడల్ రైతు బజార్ల వల్ల ఎంత మంది రైతులు, వినియోగదారులు ప్రయోజనం పొందుతున్నారు? మన రాష్ట్రంలో 90 శాతం మాంసాహారులు ఉన్నారు. కాబట్టి మాంసాహారులకు ఇదే మాదిరిగా అత్యాధునిక సౌకర్యాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో నాన్ వెజిటేరియన్ మార్కెట్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదా? అని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ వి. భూపాల్ రెడ్డి (స్థానిక సంస్థలు – మెదక్):–** అధ్యక్షా, సిద్దిపేటలో నేను కూడా మోడల్ రైతు బజార్లను చూడడం జరిగింది. వీటిని ఎక్కడైతే ప్రజలు ఎక్కువగా నివసిస్తారో ఆ ప్రాంతంలో నిర్మిస్తే బాగుంటుందనేది నా అభిప్రాయం. లక్ష, రెండు లక్షల జనాభా కలిగినటువంటి జహీరాబాద్, పటాన్‌చెరు, రామచంద్రాపురం వంటి ప్రాంతాలలో నిర్మిస్తే ప్రభుత్వం ఇంత మంచి కార్యక్రమం చేపడుతున్న విషయం ఎక్కువ మందికి తెలుస్తుంది. అదే విధంగా అంత మందికి సదుపాయాలను కూడా కల్పించడం జరుగుతుంది. గౌరవ మంత్రిగారు వారి ప్రాంతంలో కృషితో వీటిని అభివృద్ధి పరుస్తున్నారు. మేము వాటిని చూసి ఆశించి అడగడం జరుగుతుంది. మా ఆశయాన్ని కూడా తొందరగా నెరవేరుస్తారని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ పురాణం సతీష్ కుమార్:–** అధ్యక్షా, ప్రజ్ఞాపూర్ దగ్గర కట్టిన రైతు బజార్ చాలా బ్రహ్మాండంగా ఉంది. మంత్రిగారు నిత్యం అటువైపు వెళుతుంటే రోడ్డు ప్రక్కన కూర్చొని కూరగాయలు అమ్ముకుంటున్న రైతులను చూసి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మానవతా దృక్పథంతో రైతు బజార్‌ను కట్టించడం జరిగింది. అది ఆ ప్రాంతం వారికి ఉపయోగపడుతోంది. నాకు జరిగిన స్వీయ అనుభవాన్ని కూడా చెబుతాను. గతంలో నేను హైదరాబాదుకు వచ్చేటప్పుడు చందూరు నుండి కూరగాయలను కొనుక్కొని హైదరాబాదుకు వచ్చేవాడిని. ఇప్పుడు ఆ సమస్య తీరింది. ప్రజ్ఞాపూర్‌లోనే నా కారు ఆపుకొని కూరగాయలను కొనుక్కొని ఇంటికి వస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది. రైతు బజార్ల నిర్మాణం వలన పంట పండించిన రైతులకే కాకుండా నాణ్యమైన పంటలను కొనుగోలు చేసుకోవడానికి వినియోగదారులకు కూడా లాభం చేకూరుతుంది. ఇటువంటి మోడల్ రైతు బజార్లను ఒక్క ఆ ప్రాంతంలోనే కాకుండా వికేంద్రీకరణ జరిపి ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో, నియోజక హెడ్ క్వార్టర్లలో కట్టే ప్రతిపాదన ఏదన్నా ఉన్నదా? అని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ టి. హరీష్ రావు:–** అధ్యక్షా, సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, శ్రీ వి. భూపాల్ రెడ్డి, శ్రీ పురాణం సతీష్‌కుమార్

గార్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా గౌరవ ముఖ్యమంత్రిగారి ఆలోచన అది. కూరగాయలను నేల మీద పెట్టి అమ్మడం వల్ల అనేక రకాలైన క్రిములు దాని చుట్టూ ఉంటాయి. మన డైనింగ్ టేబుల్ కాన్సెప్ట్‌లో మూడు అడుగుల పైన పెట్టి కూరగాయలను అమ్మగలిగితే ఆ క్రిములు అంత ఎత్తుకు ఎగరవు కనుక, కూరగాయలు ఆ క్రిముల బారిన పడకుండా ఉండి ప్రజల ఆరోగ్యం బాగుంటుందనేది ఈ అంశంలోని ముఖ్యమైన ఆలోచన. అందుకని ముఖ్యమంత్రిగారి ఆలోచనను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా అనేక రైతు బజార్లను ఏర్పాటు చేయడానికి శాంక్షన్ చేయడం జరిగింది. ఆ కార్యక్రమం కూడా మొదలైంది. ఇందులో సభ్యులు గమనించవలసింది ఏమిటంటే రైతు బజార్లు కట్టడమే కాకుండా అవి వినియోగంలోకి రావాలంటే పట్టణ నడిబొడ్డున స్థలాన్ని ఇవ్వగలిగితే ప్రజలు వినియోగించుకుంటారు. వాటిని ఊరికి దూరంగా కడితే ఏమవుతుంది అంటే రైతు అక్కడికి కూరగాయాలు తేవడానికి కష్టం అవుతుంది. ప్రజలు కూడా అంత దూరం వెళ్లి కొనుగోలు చేయలేక ఆ రైతు బజార్లు కట్టి నిరుపయోగం అవుతాయి. నిరుపయోగంగా ఉన్న రైతు బజార్లు కొన్ని రాష్ట్రంలో ఉన్నాయి. అందువల్ల వాటిని బస్టాండ్ దగ్గర, లేదా పట్టణానికి మధ్యలో ఉన్నట్లైతే పట్టణ ప్రజలందరూ దానిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఆ విధంగా మీ పట్టణాల్లో, జిల్లా డివిజన్ కేంద్రాల్లో, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో మొదటి దశలో మేము చేయాలనుకుంటున్నాము. ఆ దిశగా మీరు మంచి స్థలాలు ఇచ్చినట్లైతే అన్ని చోట్ల రైతు బజార్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలియజేస్తున్నాను. సభ్యులు శ్రీ పురాణం సతీష్‌కుమార్‌గారు ప్రజ్ఞాపూర్ దగ్గర రైతు బజార్ గురించి చెప్పారు. ప్రతి రోజు రైతులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దుమ్ము, ధూళి, పొగలో రోడ్డు పైన 50 ఏండ్ల నుండి కూరగాయలను అమ్ముకుంటున్నారు.

10.40 ఉ. గత 50 ఏళ్లుగా రైతులు ఎండలో కూరగాయలు అమ్ముకుంటూ వస్తున్నారు. అనేక ప్రభుత్వాలు వచ్చాయి. మంత్రులు ఆ దారి మీద నుంచే వెళ్లారు తప్ప, ఏ ప్రభుత్వమూ, ఏ మంత్రిగారు కూడా వారి గురించి ఆలోచించలేదు. కాని ఈ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రిగారి నేతృత్వంలో ఆ వే-సైడ్ మార్కెట్ల నిర్మాణం మొదలు పెట్టాము. ప్రయోగాత్మకంగా ప్రజ్ఞాపూర్ దగ్గర, పాతూరులో మొదలు పెట్టాము. చాలా విజయవంతంగా, అద్భుతంగా నడుస్తున్నది. గౌరవ ఎమ్మెల్సీ సతీష్‌గారు చెప్పినట్లు అనేకమంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు చాలామంది అక్కడ కార్లు ఆపి, అక్కడ కూరగాయలు కొనుక్కుని వెళుతున్నారు. ప్రతి రోజూ దాదాపు 800 నుండి 1000 వరకు కార్లు అక్కడ ఆగి, కూరగాయలు కొనడం జరుగుతున్నది.

అది విజయవంతం అయింది కాబట్టి రామాయంపేట హైవే మీద మొన్ననే మరొకటి మంజూరు చేశాము. నిర్మాణ పనులు కూడా మొదలైనాయి. రోడ్ల పైన జాతీయ రహదారులు గాని, రాష్ట్రరహదారులు గాని ఎక్కడైతే కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయో, అక్కడ రోడ్డుని ఆనుకుని ఏదైనా స్థలం ఉన్నట్లయితే, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపండి. ఆ విధంగా వరంగల్ జిల్లా భూపాలపల్లి దగ్గర పరకాల ప్రాంతంలో ఒక స్థలం ఉందని గౌరవ స్పీకర్‌గారు, ఎమ్మెల్యే ధర్మారెడ్డి గారు మా దృష్టికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి ప్రతిపాదనలు తెప్పిస్తున్నాము. ఎవరన్నా దాతలు ముందుకు వచ్చి, మాకు స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లయితే సంతోషం. ప్రభుత్వ స్థలం ఉన్నట్లయితే ఇంకా తేలిగ్గా మనం దాన్ని మొదలుపెట్టుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ నుండి అటువంటి ప్రతిపాదనలు అందినా ప్రాధాన్యతా క్రమంలో వాటిని ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

## 2668 ఉత్తమ పోలీసు స్టేషను పురస్కారం

ప్రశ్న నెం.2668 (56)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎం.ఎస్. ప్రభాకర్ రావు మరియు మైనంపల్లి హనుమంత్ రావు, ఎం.ఎల్.సీ.లు:- గౌరవనీయులైన హోం శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) హైదరాబాదు పంజగుట్ట పోలీసు స్టేషన్ దేశంలో ఉత్తమ పోలీసు స్టేషన్లలో 2వ ర్యాంకును సాధించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఏ ప్రతిపదికన ఈ ట్రోఫీని ప్రదానం చేయడమయింది;

ఇ) పంజగుట్ట పోలీసు స్టేషన్ మాదిరిగా రాష్ట్రంలోని ఇతర పోలీసు స్టేషన్లను మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలేమిటి ?

**గౌరవనీయులైన హోం శాఖ మంత్రి (శ్రీ నాయిని నర్సింహా రెడ్డి)**:- అ) అవునండీ.

ఆ)ఈ క్రింది మూడు ప్రమాణాలను అనుసరించడ మయింది.

1. కార్యనిర్వాహక చర్య

2. పిఎస్ మౌలిక సదుపాయాలు & సిబ్బంది అందుబాటు

3. సిటిజన్ ఫీడ్ బ్యాక్.

ఇ) పోలీసు స్టేషన్లన్నిటికి తగినన్ని నిధులను కేటాయించి, సేవా ప్రమాణాలలో ఏకరూపత కలిగి ఉండడానికి అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణను ఇవ్వడమవుతున్నది.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ దేశానికే ఆదర్శంగా నిలిచి, రెండవ స్థానాన్ని పొందడం సంతోషకరం. తెలంగాణ పోలీసు వ్యవస్థ మొత్తం దేశానికే ఆదర్శంగా ఉందని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో గమనించడం జరిగింది. ఈ రోజు హైదరాబాద్‌లో నగరమంటే కొత్వాల్ వెంకట్రామ్ రెడ్డి గారు మనకు గుర్తుకు వస్తారు. కాని నేడు వారిని మైమరపించేటట్లుగా మా కొత్వాల్ నాయిని నర్సింహా రెడ్డి గారు పోలీసు వ్యవస్థను బ్రహ్మాండంగా నడిపిస్తున్నారు. దేశంలో పోలీసులు బ్రహ్మాండంగా ప్రజల సేవలు చేస్తున్నటువంటి నేపథ్యంలో Friendly Policeను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ రోజు దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో మన నగరంలోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు రెండవ స్థానం దక్కించుకోవడం చాలా సంతోషకరం. ఈ సందర్భంగా నేను మంత్రిగారిని కోరేది ఏమిటంటే ఈ సర్వే చేయడానికి పాటించిన ప్రమాణాలు ఏమిటి, ఏ ప్రమాణాల ప్రాతిపదికన ఈ సర్వే జరిగింది? మన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కంటే ఎక్కువగా, బ్రహ్మాండంగా నిర్వహింపబడుతున్న పోలీస్ స్టేషన్లు కూడా మన తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. కాని ఆ పోలీస్ స్టేషన్లకు ఆ ప్రమాణాలు లేకపోవచ్చు. కాని సేవలు చేయడంలో మాత్రం పోలీసులందరూ బాగానే పని చేస్తున్నారు. కాబట్టి ఆ ప్రమాణాలు ఏమిటి?

మన పంజాగుట్ట స్టేషన్‌కి రెండవ స్థానం వచ్చిందన్నారు. మరి మొదటి స్థానం ఎవరికి వచ్చింది? ఆ నెంబర్ 1కు నెంబర్ 2కి గల తేడా ఏమిటి? మన కేంద్ర హోం శాఖామాత్యులు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ గారే స్వయంగా తెలంగాణ పోలీస్ వ్యవస్థ నెంబర్ 1గా ఉందని ప్రశంసించారు. అయితే మనకు మొదటి ర్యాంకు ఎందుకు రాలేదు? వాటికి ఉన్నదేమిటి, మనకు లేనిది ఏమిటి? అనే దానికి కూడా మంత్రిగారు జవాబు చెప్పాలని కోరుకుంటున్నాను.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు (స్థానిక సంస్థలు – హైదరాబాద్):–** అధ్యక్షా, ఇటీవలి కాలంలో పోలీస్ స్టేషన్లలో చాలా మెరుగైన ఫలితాలు కనబడుతున్నాయి. వాటికి నిధులు బాగా ఇస్తున్నారు. కాని హైదరాబాద్ పోలీసు వ్యవస్థ గురించి చెప్పాలంటే దాదాపు 30 సంవత్సరాల నుండి కేవలం 60 పోలీసు స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. కొత్తగా ఒక్క పోలీస్ స్టేషన్ కూడా రాలేదు. జనాభా పెరుగుతున్నది. కొన్ని పోలీస్ స్టేషన్లపై చాలా ఒత్తిడి ఉంది. ఉదాహరణకు సంజీవ రెడ్డి నగర్ పోలీస్ స్టేషన్ ఉందంటే, దాని యొక్క ఏరియా ఎంత పెద్దదంటే కనీసం రెండు అడిషనల్ పోలీస్ స్టేషన్లు వచ్చే అవకాశం ఉంది. కాని సైబరాబాద్, రాచకొండ పరిధిలో మాత్రం ప్రతి సంవత్సరం పోలీస్ స్టేషన్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. దయచేసి మంత్రిగారిని నేను కోరేది ఏమిటంటే పెద్ద పోలీస్ స్టేషన్లను విభజించి, అదనంగా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏమైనా ఉందా తెలుపవలసిందిగా కోరుతున్నాను.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి:–** అధ్యక్షా, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పోలీస్ సిబ్బందికి మనం శిక్షణ ఏమైనా ఇస్తున్నామా? అలా చేసినట్లయితే మిగతా స్టేషన్లకు కూడా ఈ రకంగా పేరు రావడానికి ఆస్కారం ఉంటుంది కదా. ఒక్క స్టేషన్‌కి పేరు రాగానే గొప్పగా ఫీల్ కావడం కరెక్టు కాదని నా భావన. మరొక అంశం. హైదరాబాద్‌లో అంతా బాగానే ఉంది కాని, గ్రామీణ ప్రాంతాలకు పోయి చూస్తే, ఇంత మార్పు కనిపించడం లేదు. కాబట్టి అక్కడున్న సిబ్బందికి కూడా శిక్షణ ఇప్పించి, వాటిని కూడా సమానంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారా?

**శ్రీ నాయిని నర్సింహా రెడ్డి:–** అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం Best Policing విధానానికి సమాధానంగా– కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు ఢిల్లీలోని పోలీస్ స్టేషన్ల పని తీరుపై సమగ్ర సర్వే చేసి, ప్రతి సంవత్సరం గ్రేడింగ్, ర్యాంకింగ్ ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనికి గాను కేంద్ర ప్రభుత్వం బ్యూరో ఆఫ్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అనే సంస్థ A మరియు B అనే రెండు విభాగాలుగా సర్వే చేసింది.

పార్ట్–Aలో కొలమానంగా పోలీస్ స్టేషన్ పని తీరుపై మూల్యాంకన, దానిలో భాగంగా నేర నిరోధక చర్యలు, చురుకైన చర్యలు, సంఘ విద్రోహులపై చర్యలు, కేసుల పరిష్కారం, డిటెన్షన్ పనులు, మానిటరింగ్ పోలీసు, శాంతి భద్రతల నిర్వహణ విషయంలో పని తీరుని విశ్లేషిస్తారు.

పార్ట్–Bలో ఈ రెండు విభాగాలలో ఒకటి మౌలిక సదుపాయాల మూల్యాంకన మరియు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ విశ్లేషణ, మౌలిక సదుపాయాల మూల్యాంకనలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో ఉన్న పనులే కాకుండా, సిబ్బంది క్రమ శిక్షణ, రికార్డులు

భద్ర పరిచే పద్ధతి, బడ్జెటు మరియు కొనుగోలు వివరాల డిక్లరేషను మొదలగునవి కొలమానంగా తీసుకున్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ అంచనా వేయడంలో భాగంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారి నుండి, మార్కెట్‌లో ఉన్న సంస్థల నుండి మరియు నివాస ప్రాంతాలలో ఉండేవారి నుండి పోలీసు సేవల పట్ల స్పందించే తీరుపై ఫీడ్ బ్యాక్ తీసుకుని, విశ్లేషిస్తారు.

పార్ట్–Aలో 80 శాతం స్కోరు, పార్ట్–Bలో 20 శాతం స్కోరు ఉంటుంది. దీనిలో మొత్తం 59 పోలీసు స్టేషన్లను పరిగణనలోకి తీసుకున్నారు. ఒక్కొక్క రాష్ట్రం నుండి రెండు పోలీసు స్టేషన్ల చొప్పున దేశ వ్యాప్తంగా మొత్తం 59 పోలీస్ స్టేషన్లను తీసుకుని, సర్వే చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ A మరియు B లలో మొత్తం స్కోరు కలిపి, దేశంలో రెండవ ర్యాంకును సాధించింది. పార్ట్–Bలో మౌలిక సదుపాయాలు, క్రమ శిక్షణ, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ విషయంలో పంజాగుట్ట పి.ఎస్.కు 3వ ర్యాంకు రాగా, మొదటి ర్యాంకు సాధించిన తమిళనాడులో ఆర్.సి.పురం పోలీస్ స్టేషన్ 11వ ర్యాంకు పొందడం గమనార్హం. అంటే పోలీస్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాల కల్పన, క్రమశిక్షణ పాటించడం, ప్రజలకు సౌలభ్యం, సౌకర్యం అందించడం కోసం చేపట్టిన సంస్కరణలలో విజయం సాధించామని పేర్కొనవచ్చును. ఇదే విధంగా రాష్ట్రంలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లను తీర్చి దిద్దడానికి ప్రభుత్వం సంకల్పించింది.

పోలీసు శాఖను ఆధునీకరించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిన విషయం విదితమే. ప్రజలు బాధలలో ఉన్నప్పుడు సహాయం కొరకు పోలీస్ స్టేషన్‌కు వస్తారు. కాబట్టి పోలీసులు వారితో వ్యవహరిస్తున్న పద్ధతిలో, పోలీస్ స్టేషన్‌లో వారికి కల్పిస్తున్న కనీస వసతుల విషయంలో ప్రజలు సౌలభ్యంగా, సౌకర్యంగా ఉన్నట్లు ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి. ఈ కోణంలో కూడా ఆలోచించి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చింది. దీనిలో భాగంగానే అవసరమైన చోట మౌలిక వసతుల కల్పన, నూతన పోలీస్ స్టేషన్ల నిర్మాణం చేపట్టడం, మరమ్మతులు చేయడం జరుగుతున్నది. వాహనాలు, అవసరమైన సాంకేతిక పరిజ్ఞానము సమకూరుస్తున్నాము. సందర్శకులకు నూతన సౌకర్యాలు కల్పిస్తున్నాము.

హైదరాబాద్‌లో కొత్త పోలీస్ స్టేషన్ల భవనాల కొరకు రూ.40 కోట్లు కేటాయించినాము. మరమ్మతులకు రూ. 5 కోట్లు కేటాయించడం జరిగింది. ప్రతి పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నాము. హైదరాబాద్ సిటీలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు నెలకు 75 వేల రూపాయల చొప్పున నిర్వహణ కొరకు ఇస్తున్నాము. Friendly Police and Visible Policeకు ప్రాధాన్యం కల్పిస్తున్నాము. పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాము. Citizen Friendly Police కొరకు హైదరాబాద్‌లో రూ.10 కోట్లు కేటాయించాము.

డిజిపి కార్యాలయంలో Friendly Police అనే అంశం పైన ఆఫీసర్లతో ప్రతి రోజూ ట్రెనింగ్ ఇప్పిస్తున్నాము. హైదరాబాద్‌లో సిసిటివిల కొరకు రూ.140 కోట్లు కేటాయించాము. నేర నియంత్రణకు హైదరాబాద్ నగరానికి రూ.10 కోట్లు కేటాయించాము. హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా థర్డ్ పార్టీ ఫీడ్ బ్యాక్ విధానాన్ని ప్రవేశపెట్టి, పోలీసు స్టేషన్లకు ఫిర్యాదు ఇవ్వడానికి మరియు వివిధ పనులపై వచ్చిన వారి వద్ద నుండి పోలీసు స్టేషన్‌లో వారి అనుభవంపై సమగ్ర ఫీడ్ బ్యాక్‌ను తీసుకుంటాము. పోలీసు స్టేషన్‌లో వారికి ఏ విధమైన మర్యాదలు జరిగాయి, ఏ విధంగా రిసీవ్ చేసుకుంటున్నారు, మీ సమస్యలు పరిష్కారమవుతున్నాయా అనే విషయాల గురించి వచ్చిపోయే ప్రజల దగ్గర నుండి సమాచారం సేకరిస్తాము.

పంజాగుట్ట పోలీసు స్టేషన్ హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉంది. సిటీలో ఏ క్లాసు పోలీసు స్టేషన్‌గా పేరు పొందింది. ఈ పోలీసు స్టేషన్ పరిధిలో రాజ్ భవన్, సిఎం క్యాంప్ ఆఫీస్, జడ్జీలు, ఉన్నత ప్రభుత్వాధికారులు, ఇతర ప్రభుత్వ అధికారుల నివాసాలు ఉన్నాయి. అంతే కాకుండా ముఖ్య కట్టడాలు, వ్యాపార కేంద్రాలు, సంస్థలు ఉన్నాయి. ఈ పోలీసు స్టేషన్ పరిధిలో ఎల్లప్పుడు వివిఐపిల రాకపోకలు జరుగుతుంటాయి. అందుకు అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతున్నది. కాబట్టి, ఈ పోలీసు స్టేషన్ సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో భాగంగా శ్రమిస్తూ ఉంటారు. ఈ పోలీసు స్టేషన్ దేశంలో రెండవ ర్యాంకు పొంది, అందరికీ ఆదర్శంగా నిలిచినందుకు అక్కడ పనిచేసే అధికారులకు, సిబ్బందికి నా అభినందనలు మరియు మన కౌన్సిల్ తరఫునుండి కూడా అభినందనలు తెలపాలని తమకు విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ పోలీసు స్టేషన్ పరిధిలో క్రైమ్ రేటు 2014తో పోలిస్తే 2017లో 40 శాతం తగ్గింది. రోడ్డు ప్రమాదాలు 2015తో పోలిస్తే 2017లో 48 శాతం తగ్గించారు. ఈ పోలీసు స్టేషన్ పరిధిలో 383 సిసి కెమేరాలు ఇచ్చాము. 10,793 సిసి కెమేరాలు నేను సైతం అనే కార్యక్రమం క్రింద నగర పౌరులు, కాలనీ వాసులు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని మనవి చేస్తున్నాను.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, దేశంలో రెండవ ర్యాంకు సాధించిన మన పంజాగుట్ట పోలీసు స్టేషన్ యొక్క

ముందు వైపు అంతా ఆటోలు, ఇతర వాహనాలు ఎప్పుడు పార్క్ చేయబడి ఉంటాయి. దేశంలో అంత అత్యాధునికమైనటువంటి పోలీసు స్టేషన్‌గా పేరు గాంచినది కాబట్టి, మంత్రిగారిని నేను కోరేది ఏమిటంటే ఒకసారి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, ఆ ఆటోలను తొలగించి, పరిశుభ్రమైన వాతావరణం ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాను. డస్ట్ ఫ్రీ జోన్‌గా ఉండాలి, వాతావరణంలో స్వచ్ఛత ఉండాలి అని భావిస్తున్నాను. మనకు గర్వ కారణంగా ఉండేలా ఈ పంజాగుట్ట పోలీసు స్టేషన్‌ను తీర్చిదిద్దాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ నాయిని నర్సింహా రెడ్డి:–** అధ్యక్షా, పెద్దలు సుధాకర్ రెడ్డిగారు చెప్పినట్లు– ఆటోలు ఉన్నాయా, మరొకటి ఉందా అన్నది కాకుండా, ప్రజలకు సౌకర్యాలు లభిస్తున్నాయా, లేదా అన్నది ప్రధానం. కాబట్టి ఆటోలను అక్కడ నుండి తొలగించడం కాకుండా, వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి, అక్కడ పరిశుభ్రమైన వాతావరణం కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. హైదరాబాద్‌లో వాహనాల పార్కింగు కొరకు స్థలాలు దొరకడం లేదు. మన పంజాగుట్ట పి.ఎస్.కి బీహార్ ఉప ముఖ్యమంత్రిగారు వచ్చి, సందర్శించడం జరిగింది. అలాగే వివిధ రాష్ట్రాల నుండి ఐపిఎస్ అధికారులు కూడా వచ్చి, చూసి వెళుతున్నారు. హైదరాబాద్‌లో పోలీసు స్టేషన్ల పెంపుదలకు ప్రతిపాదన ప్రస్తుతం అయితే ఏమీ లేదు. కొత్త కమీషనరేట్‌లకు, జిల్లాలకు పోలీసు కార్యాలయాలకు, పోలీసు హౌసింగ్ బోర్డుకు రూ.200 కోట్లు కేటాయించడం జరిగిందని తెలియజేసు కుంటున్నాను.

## నకిలీ వైద్యుల మరియు డాక్టర్ల మెడికల్ ప్రాక్టీసు

ప్రశ్న నెం.2830 (57)

శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు, ఎం.ఎల్.సిః– గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో అర్హతలేని వైద్యులు, నకిలీ వైద్యుల వద్ద చికిత్స తీసుకోవడం ద్వారా కొంత మంది అమాయక ప్రజలు బలి అవుతున్న విషయం వాస్తవమేనా;

ఆ) జుట్టు మార్పిడి దుష్ప్రభావాలకు దారి తీసినందున డాక్టర్ ప్రాక్టీస్‌ను సస్పెన్షన్ చేసిన విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, అట్టి నకిలీ వైద్యులు, అర్హతలేని వైద్యుల, మెడిసన్ ప్రాక్టీస్ పట్ల తీసుకున్న చర్య ఏమిటి?

**గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (శ్రీ. సి. లక్ష్మా రెడ్డి):–** అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) డాక్టర్ ఇస్రతుల్లా ఖాన్ అనే ఎంబిబిఎస్ వైద్యుడు బంజారాహిల్స్‌లో అక్రమంగా "ఖాన్స్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ క్లినిక్" ను నడుపుతున్నట్లుగా కనుగొనడమయింది. తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రెండు సంవత్సరాల పాటు అతని రిజిస్ట్రేషన్ సస్పెన్షన్ చేస్తూ శిక్షను విధించింది.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు:–** అధ్యక్షా, ఈ నకిలీ డాక్టర్లతో వైద్యం చేయించుకుని, అమాయక ప్రజలు బలి అవుతున్నారా అన్న ప్రశ్నకు మంత్రిగారు అవునంటున్నారు. ఈ మధ్య కాలంలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ వారు మన తెలంగాణ రాష్ట్రం అంతా ఒక సర్వే నిర్వహించారు. ప్రతి పదివేల జనాభాకి 12 ఆర్ఎంపి డాక్టర్లు ఉన్నట్లు ఆ సర్వేలో తెలిసింది. దీనిని బట్టి ఎంత పెద్ద సంఖ్యలో ఈ ఆర్ఎంపి డాక్టర్లు ఉన్నారో మనకు తెలుస్తోంది. వారు క్వాలిఫైడ్ డాక్టర్లు కారు. చాలా మంది ఆర్ఎంపిలు కాంపౌండర్లు, వార్డు బాయ్‌లు, పది, పన్నెండు తరగతులు చదివిన వాళ్లుంటారు. లీగల్‌గా వాళ్లు ప్రాక్టీస్ చేయడానికి వీల్లేదు. వాళ్లు ఏ కోర్సు చదివి ఉండరు. కాబట్టి వాళ్లు ప్రాక్టీస్ చేయడం ఇల్లీగల్. ఒక కాంపౌండరు, ఒక వార్డు బాయ్, పదవ తరగతి చదివిన వ్యక్తి ఏ విధంగా రోగులకు చికిత్స చేస్తాడు? It is against the norms. ఇందులో రెండు వాదనలు ఉన్నాయి. ఒకటి వాళ్లకు సర్టిఫైడ్ కోర్సు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మరొక వైపు డాక్టర్లు ఏమంటున్నారంటే మేము ఇన్నేళ్లు, ఇంత కష్టపడి ఎంబిబిఎస్ సీటు సంపాదించి, ఐదు సంవత్సరాలు చదివి, ఇంటర్న్‌షిప్ చేసి, ఇంత డబ్బు ఖర్చు పెట్టి కోర్సు చేస్తే, మాతో పాటు వాళ్లకు డాక్టరేటు ఎట్లా ఇస్తారని వాళ్లు వ్యతిరేకిస్తున్నారు.

11.00 ఉ.

This has become a very serious issue. ఆర్ఎంపిలు లీగల్‌గా ప్రాక్టీసు చేయడానికి ప్రభుత్వం అనుమతించే ప్రతిపాదన ఏదైనా ఉందా? కొన్ని కేసులు నమోదు చేశామని మంత్రిగారు చెప్పారు. వీళ్ల మీద కేవలం పెట్టీ కేసులు పెడుతున్నారు, వంద రూపాయల చాలాన్ కట్టి మరుసటి రోజే మళ్లీ ప్రాక్టీసు మొదలు పెడుతున్నారు. వీళ్లు అమాయక ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారు. చిన్న వైద్యం చేస్తే ఓ.కె. అలాగాకుండా సెన్సిటివ్, కాంప్లికేటెడ్ ట్రీట్‌మెంట్లు కూడా చేస్తున్నారు. ఈవిధంగా చేసే వాళ్ల మీద పి.డి. యాక్ట్ క్రింద కేసులు నమోదు చేస్తారా? ఎందుకంటే ఈ ఆర్ఎంపిలు క్రానిక్

అండ్ క్రిమినల్ యాక్ట్ కి పాల్పడినపుడు వీళ్ల మీద పి.డి. యాక్ట్ ప్రయోగించడానికి ఇబ్బందేమిటి? మంత్రిగారు సూటిగా సమాధానం చెప్పాలని కోరుతున్నాను.

**శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి (ఉపాధ్యాయులు నియోజకవర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్):–** అధ్యక్షా, ఈ నకిలీ డాక్టర్లే కాదు, కార్పోరేటు హాస్పిటల్స్‌లో కూడా అదే విధంగా చేస్తున్నారు. ఒక ఆరు నెలల క్రితం నేను ప్రత్యక్షంగా చూశాను. హైదరాబాదుకు చెందిన నూర్జహాన్ అనే టీచర్ సంతాప సభకి నేను అటెండ్ కావడం జరిగింది. అమె గర్భసంచిలో చిన్న గడ్డ ఉందని చికిత్స కోసం బంజారాహిల్స్, రోడ్డు నెం12లో గల సెంచురీ హాస్పిటల్‌లో అడ్మిట్ అయింది. ఆమెకు సర్జరీ చేయడానికి ముందు అవసరమైన టెస్టులు చేయాలి. కానీ ఆ టెస్టులేమీ చేయకుండా ఓవర్ కాన్ఫిడెన్స్‌తో సర్జరీ చేశారు. సర్జరీ చేసిన ఐదు రోజులకే ఆమె కడుపులో ఉన్న పేగులు అల్లుకుని పోయాయి. వాటిని సరిజేయడానికి మళ్లీ సర్జరీ చేశారు. ముందు డిసీజ్‌ను గుర్తించకుండా, 15 రోజుల్లోనే ఆమెకు మూడు సర్జరీలు చేయడం జరిగింది. వాళ్లు చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి, అయ్యా, ఇక మేము ట్రీటుమెంటు చేయలేమని చెప్పి మూడోసారి గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్జన్‌తో కాకుండా ఆంకాలజీ సర్జన్‌తో సర్జరీ చేయించడం జరిగింది. నేను ఆ హాస్పిటల్ ఐదారు సార్లు వెళ్లాను. ఆ తర్వాత ఇక మాతో కాదని చెప్పి, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీకి షిఫ్ట్ చేయమని సజెస్టు చేశారు. ఆ సమయంలో ఆమె భర్తతో – నా ఇష్ట పూర్వకంగానే నా భార్యను డిస్చార్జ్ చేసుకొని వెళుతున్నాని రాయించుకొని, రూ.7 లక్షల చెక్కు తీసుకొని పంపించారు. ఆవిధంగా రాసిస్తేనే డిస్చార్జ్ చేస్తామని చెప్పారు. ఎలాగైనా తన భార్యను బతికించుకోవాలనే ఉద్దేశ్యంతో భర్త తన ఇష్టపూర్వకంగా డిస్చార్జ్ చేసుకొని వెళుతున్నానని రాతపూర్వకంగా అంగీకారం తెలిపాడు. ఆమెను ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీలో చేర్చిన తర్వాత కూడా బాగు కాకపోతే నిమ్స్‌కి షిఫ్ట్ చేయడం జరిగింది. నిమ్స్‌లో కొన్ని రోజులు ట్రీట్‌మెంటు చేసి డిస్చార్జ్ చేశారు. 15 రోజుల్లో మూడు సర్జరీలు చేయడం, దాంతో కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ వచ్చి కిడ్నీ మీద ఎఫెక్ట్ పడి ఆ తర్వాత ఆమె చనిపోవడం జరిగింది. ఈ విషయానికి సంబంధించి ఆనాటి హెల్త్ డిపార్టుమెంటు స్పెషల్ సి.ఎస్. రాజేశ్వర్ తివారీ గారికి నా లెటర్‌హెడ్ మీద లెటర్ రాసి, రిపోర్టులన్నీ దానికి ఎన్‌క్లోజ్ చేస్తూ ఫిర్యాదు చేయడం జరిగింది. మంత్రిగారు అందుబాటులో లేకపోతే మంత్రిగారి పేషీలో ఒక కాపీ ఇవ్వడం జరిగింది. కానీ ఇంత వరకు ఆ డాక్టర్ మీద కానీ, ఆ హాస్పిటల్ మీద కానీ ఎలాంటి చర్యలు లేవు. వాళ్లు తప్పు చేయడమే గాకుండా, చనిపోయిన ఆ టీచర్ భర్తకు చెక్ బౌన్స్ క్రింద కోర్టు నోటీసులు ఇచ్చారు. నకిలీ డాక్టర్ల విషయం ప్రక్కన పెడితే, కార్పోరేటు హాస్పిటల్స్ కూడా అదే విధంగా చేస్తున్నాయి. ఆయనకు ఇహెచ్ఎస్ ఉన్నా కూడా, కార్పోరేటు హాస్పిటల్‌లో మంచి ట్రీటుమెంటు దొరుకుతుందనే ఉద్దేశ్యంతో, తర్వాత ఖర్చులు రీయింబర్స్‌మెంటు క్రింద క్లెయిమ్ చేయవచ్చని అక్కడ అడ్మిట్ చేస్తే, చివరకి ఆమె ప్రాణాలను బలిగొన్న హాస్పిటల్ అది. కానీ ఇప్పటి వరకు సర్జరీ చేసిన ఆ డాక్టర్ మీద, హాస్పిటల్ మీద చర్యలు తీసుకున్నట్లుగా నాకైతే రిప్లై రాలేదు. నకిలీ డాక్టర్లు కాదు, కార్పోరేటు హాస్పిటల్స్‌లో తప్పుడు ట్రీటుమెంటు చేసిన డాక్టర్లకు శిక్షలు లేవు. ఇప్పటికీ వాళ్ల మీద ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చనిపోయిన ఆమె తిరిగి రాదు. కానీ సంబంధిత హాస్పిటల్ మీద చర్యలు తీసుకుంటే మిగతా వారికి ఈ పరిస్థితి రాకుండా ఉంటుంది, కాబట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:–** ఈ మధ్యకాలంలో మళ్లీ మీరు మంత్రిగారిని కలవలేదా?

**శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి:–** నేను మళ్లీ కలవలేదు సార్. నేను ఆల్‌రెడీ స్పెషల్ సిఎస్‌కు రిటెన్‌గా కంప్లెయింట్ ఇచ్చాను. మంత్రిగారి పేషీలో కూడా ఇచ్చాను. ఒకసారి లెటర్ ఇచ్చినపుడు, దాని మీద కరస్పాండెన్స్ జరగాలి కదా!

**శ్రీ టి. భానుప్రసాద రావు (స్థానిక సంస్థలు – కరీంనగర్):–** అధ్యక్షా, ఈ మధ్య దేశంలో, రాష్ట్రంలో ఎపిలెప్సీ కేసులు బాగా పెరుగుతున్నాయని చెబుతున్నారు. దీనికి సంబంధించి గ్రామీణ ప్రాంతాలలో సరైన డయాగ్నోసిస్ జరగకపోవడం వల్ల ఏదో దెయ్యం పట్టిందని, భూతం పట్టిందని అనుకుంటూ ట్రీటుమెంటు కోసం భూత వైద్యుల వద్దకు పోతున్నారు. బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్స్ వల్ల కానీ, బ్రెయిన్‌లో అబ్‌నార్మల్ ఎలక్ట్రికల్ యాక్టివిటీ వల్ల ఇది వస్తుందని చాలా మందికి తెలియక అలా చేస్తున్నారు. సభ్యులు ప్రభాకర్ రావు గారు చెప్పినట్లు, భూతం పట్టిందనో, దెయ్యం పట్టిందనో ఆర్‌ఎంపి డాక్టర్స్ దగ్గరకు పోతున్నారు. ఎపిలెప్సీకి సంబంధించి రాష్ట్రంలో పూర్తి స్థాయిలో ఒక అవేర్‌నెస్ ప్రోగ్రామును కండక్ట్ చేసి, ప్రజల్లో అవగాహన కల్పించవలసిన అవసరం ఉంది. సింపుల్‌గా ఇఇజి టెస్టు చేస్తే దీన్ని తెలుసుకునే అవకాశం ఉంది. డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్‌లో ఈ ఇఇజి మిషన్లు ఏర్పాటు చేయాలి, వీటి ధర రూ.2 లక్షలు ఉంటుంది. వీటిని అందుబాటులోకి తేవడం వల్ల కొంత వరకు ఎపిలెప్సీని కంట్రోల్ చేసే అవకాశం ఉంటుంది.

**డా. సి.లక్ష్మారెడ్డిః–** అధ్యక్షా, ప్రాథమిక చికిత్స చేయడానికి ఆర్ఎంపిలకు, పిఎంపిలకు అనుమతి ఉంది. కొన్ని గైడ్‌లైన్స్ ఉన్నాయి, వారికి ప్రభుత్వపరంగా ట్రెయినింగ్ ఆల్‌రెడీ ప్రారంభించాం. కొంత వరకు వారిని నియంత్రించడం జరుగుతోంది. గతంతో పోల్చి చూస్తే సిస్టంలో సమూలమైన మార్పులు తీసుకునిరావడం జరిగింది. పూర్తిగా మానిటరింగ్ చేస్తున్నాం. గతంలోలాగా ఇప్పుడు జరగడం లేదని భావిస్తున్నాం. ఇప్పటికే చాలా మందిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవడం జరిగింది. ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వడం జరిగింది, రెగ్యులర్‌గా మానీటర్ చేస్తున్నాం. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌వాళ్లు రెగ్యులర్‌గా అబ్జర్వ్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమాలకు పాల్పడిన హాస్పిటల్స్, డాక్టర్స్, ఆర్ఎంపిలు, పిఎంపిల మీద కేసులు పెట్టడం జరిగింది. గతంలో అవసరం లేని ఆపరేషన్స్ రెగ్యులర్‌గా జరిగిన పరిస్థితిని చూశాం. అపెండిసైటిస్ ఆపరేషన్స్ ఎక్కువగా జరిగే ప్రాంతాలలో అనవసరంగా అవి చేస్తున్న డాక్టర్స్‌ని గుర్తించి, ఇద్దరిని సస్పెండ్ చేయడం జరిగింది. అనవసరంగా హిస్టరెక్టమీలు చేస్తున్న హాస్పిటల్స్‌ను గుర్తించి, కేసులు పెట్టి, వార్నింగ్ ఇచ్చి, కొంత మంది డాక్టర్లను సస్పెండ్ చేయడం కూడా జరిగింది. ఎత్తు పెంచడానికి లింబ్ ఆపరేషన్ చేసిన డాక్టర్‌ను రెండు సంవత్సరాల పాటు ప్రాక్టీస్ చేయకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. అదే విధంగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన డాక్టర్ మీద చర్యలు తీసుకోవడం జరిగింది. డాక్టర్స్‌కి కొన్ని బాధ్యతలు, ఎథిక్స్ ఉంటాయి. డాక్టర్లు వాటిని పాటించడానికి ప్రభుత్వపరంగా ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకున్నాం. పోయిన సంవత్సరం సభలో సెంట్రల్ గవర్నమెంటు యాక్ట్ అయిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్టును మనం అడాప్ట్ చేసుకోవడం జరిగింది. మన రాష్ట్రంలో దాన్ని అమలు చేస్తున్నాం, దాని ద్వారా కొంత కంట్రోలు కావడానికి అవకాశం ఉంది. ఈ విషయంలో మనతోబాటు ప్రజలు కూడా కొంత అవగాహనతో ఉండాలి.

ప్రభుత్వపరంగా హాస్పిటల్స్‌ను బలోపేతం చేసి సదుపాయాలు, వసతులు పెంచాం. మోసాలు, అక్రమాలకు పాల్పడే వారి దగ్గరికి పోకుండా ప్రజలు కొంత అవగాహన కలిగి ఉండాలి. ప్రభుత్వపరంగా ఆ దిశలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. జనార్ధన్‌రెడ్డి గారు చెప్పిన విషయంపై – క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్టు ప్రకారం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. భాను ప్రసాదరావు గారు చెప్పినట్లుగా, ఎపిలెప్సీపై ప్రజల్లో కొన్ని అపోహలున్నాయి, అది వాస్తవమే. వాటిని తొలగించడానికి ప్రభుత్వపరంగా ఎన్నో చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన, బాధ్యతతో ఉండవలసిన అవసరం ఉంది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. పదే పదే సభలో కూడా చెబుతున్నాం. ప్రజాప్రతినిధులు కూడా అవగాహన కలిగి ఉంటే, ప్రజాప్రతినిధులుగా మనం చెబితే ప్రజలు వింటారు కాబట్టి, ఆలోచన చేస్తారు కాబట్టి మనం కూడా ఆదిశలో ప్రయత్నం చేయాలి. ప్రివెంటివ్ మెజర్స్ క్రింద చాలా చర్యలు చేపడుతున్నాం. కొన్ని బుక్‌లెట్స్ తయారుచేసి గౌరవ సభ్యులందరికీ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నాం. అలాగే ప్రజల్లో అవగాహన కల్పించడానికి కార్యక్రమాలు ఎక్కువగా తీసుకుంటున్నాం. ముందు ముందు ఈ జబ్బుల పట్ల ప్రజలకు ఇంకా అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావుః–** చాలా కేసులు పెట్టామని మంత్రిగారు చెబుతున్నారు, మరి వాళ్ల మీద క్రిమినల్ కేసులు ఏమైనా పెట్టారా? పి.డి. యాక్టు క్రింద కేసులు పెట్టే అవకాశం ఉందా? మీ సమక్షంలో గత సమావేశంలో చెప్పాను. ఒక మాజీ ఎమ్మెల్యే సెంచరీ హాస్పిటల్‌కు మూడు గంటలకు అడ్మిట్ అయితే ఆరు గంటలకు చనిపోయారు. కుటుంబ సభ్యులు మూడు గంటల్లో మూడు లక్షలు ఖర్చు పెట్టారు. పాపం, హాస్పిటల్‌కు పోయేటపుడు మంచిగా పోయాడు, మూడు గంటల్లో శవమై బయటకు వచ్చాడు. మూడు గంటల్లో మూడు లక్షలు వసూలు చేశారు హాస్పిటల్ వాళ్లు. ఆ విషయం మీద నేను స్పెసిఫిక్‌గా ఒకసారి కాదు, రెండు సార్లు కాదు, మూడు సార్లు అడిగాను. మెడికల్ కౌన్సిల్ విచారణలో ఉందని చెబుతున్నారు. అసలు దీని మీద ఏదైనా ఎంక్వైరీ జరిగిందా? మూడు గంటల్లో మూడు లక్షలైతే వసూలు చేశారు కానీ ప్రాణమైతే పోయింది. ఏదో ఎమర్జన్సీ ఆపరేషన్ చేశామని హాస్పిటల్ వాళ్లు అంటున్నారు, ఏమి ఎమర్జన్సీ ఆపరేషన్ చేశారు? హాస్పిటల్‌కు పోగానే కుటుంబ సభ్యుల కాన్సెంట్ తీసుకుంటారు. ఆ పరిస్థితుల్లో ఎవరైనా సంతకం పెడతారు. అసలేమి జరిగింది? దయచేసి మంత్రిగారు దీని మీద ఒకసారి స్పందించాలని కోరుతున్నాను.

**మిస్టర్ ఛైర్మన్ః–** మన సభ్యులు మెడికల్ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేసే అవకాశం ఉందా?

**డా. సి. లక్ష్మారెడ్డిః–** తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అనే ఒక సంస్థ ఉంది. ఈ హాస్పిటల్స్ అన్నింటినీ మానిటర్ చేసే అధికారం ఆ సంస్థకు ఉంది. ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. గౌరవ సభ్యులు ప్రభాకర్ చెప్పిన అంశం మీద ఎంక్వైరీ నడుస్తోంది. తొందర్లోనే రిపోర్టు వస్తుంది.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు:–** ఇప్పటికే రెండు సంవత్సరాలైంది. ఎంక్వైరీ ముందుకు పోవడం లేదు. దానికి ఒక స్పెసిఫిక్ డేటు పెట్టి మెడికల్ కౌన్సిల్ నుండి రిపోర్టు తెప్పించుకొని సదరు ఆసుపత్రి మీద చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**డా. సి. లక్ష్మారెడ్డి:–** తప్పకుండా తొందర్లో దాని మీద చర్యలు చేపట్టి గౌరవ సభ్యులకు తెలియజేస్తాం.

**మిస్టర్ ఛైర్మన్:–** సభ్యుని కోరిక మేరకు ప్రశ్న నెం.2775(58) ను వాయిదా వేయడం జరిగింది.

### ఆహార భద్రత కార్డులు

ప్రశ్న నెం.2754(59)

శ్రీ ఎన్. రామచంద్రరావు,ఎమ్మెల్సీ:– గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, పౌర సరఫరాల శాఖామంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) గత ఆరు నెలలుగా హైదరాబాదులో ఆహార భద్రతా కార్డుల మంజూరును సస్పెండ్ చేసిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

ఇ) ప్రస్తుతమున్న అనేక అసలైన కార్డులను తొలగించిన విషయం వాస్తవమేనా;

ఈ) అయితే, ఎప్పటిలోగా వాటిని పునరుద్దరించడమవుతుంది, కొత్త కార్డులను ఎప్పటిలోగా జారీ చేయడమవుతుంది?

**ఆర్థిక, ప్రణాళి, పౌర సరఫరాల శాఖామంత్రి (శ్రీ ఈటల రాజేందర్):–** అ) అవునండీ. ఇపిఓఎస్ పూర్తి అయినందున మార్చి 1వ తేదీ నుండి నగరంలో రేషన్ కార్డులను తిరిగి ప్రారంభించడమయింది.

ఆ) జిహెచ్ఎంసి ప్రాంతాలలో ఇపిఓఎస్ ఏర్పాటు పూర్తయిన తర్వాత తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో ఇపిఓఎస్ అమలును చేపట్టడమయింది. ప్రజలు జిహెచ్ఎంసి ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు, గ్రామీణ ప్రాంతాల నుంచి జిహెచ్ఎంసి ప్రాంతాలకు వలసల వల్ల సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. నకిలీలను నివారించడానికి రాష్ట్రంలోని ఇపిఓఎస్ మిషన్ల అమలు పూర్తయ్యే వరకు, ఆహార భద్రతా కార్డుల జారీలో జాప్యం ఏర్పడింది.

ఇ) అవునండీ. కొన్ని సందర్భాలలో సాంకేతిక లోపాలు, నకిలీలు మరియు అనర్హతా ప్రమాణాల వల్ల కొన్ని కార్డులను తొలగించడమయింది.

ఈ) విచారణల తర్వాత 20,298 కార్డులను పునరుద్ధరించడమయింది.

**శ్రీ ఎన్. రామచంద్రరావు (పట్టభద్రుల నియోజక వర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్):–** అధ్యక్షా, తెలంగాణాలో సమగ్ర కుటుంబ సర్వే చేసిన తర్వాత దాదాపు 1.2 కోట్ల హౌస్‌హోల్డ్స్ ఉన్నాయని తేలింది. 50,22,145 కుటుంబాలు రేషన్ కార్డులు పొందడానికి అర్హత కలిగి ఉన్నాయని రిపోర్టులో తెలియజేయడం జరిగింది. ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో 31 జిల్లాలు ఏర్పడ్డాయి. ఈ జిల్లాలలో అర్హులైన పేద ప్రజలందరికి రేషన్ కార్డులు అందజేస్తున్నారా? ఇంకా ఎంత టైము పడుతుంది? రేషన్ కార్డులకు సంబంధించి మీరు వాట్సప్‌ను ఏర్పాటు చేశారు. అదెంత వరకు పబ్లిక్‌కి ఉపయోగపడుతుంది? వెల్ఫేర్ స్కీములలో other than Aadhaar Card, ఈ రేషన్ కార్డులను కూడా వాడుకోవచ్చా, దయచేసి చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్:–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన ప్రభుత్వం ఈ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. దీంట్లో అతి ప్రధానమైనది – ఎక్కడైనా లబ్ధిదారుడికి, నిజమైన పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టాలనే సంకల్పంలో భాగంగా, కేంద్ర ప్రభుత్వం 2013లో తెచ్చిన ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ తెచ్చినపుడు పది జిల్లాల తెలంగాణ ప్రాంతంలో బిపిఎల్ క్రింద కుటుంబాల సంఖ్య 50.13 లక్షలు, జనాభా ప్రకారంగా చూస్తే 1,91,69,600. కానీ అప్పటికే తెలంగాణ ప్రాంతంలో మూడు కోట్ల మందిలో ఆల్‌మోస్ట్ 90 లక్షల మందికి రేషన్ వస్తోంది కాబట్టి, ఈ యాక్ట్ ప్రకారం కేవలం ఈ 50 లక్షల కుటుంబాల వారికే రేషన్ ఇస్తే మిగిలిన 40 లక్షల కుటుంబాలకు రేషన్ డిలిట్ అవుతుంది, ఆగిపోయే ప్రమాదం ఉంది కాబట్టి, మన ముఖ్యమంత్రిగారు జోక్యం చేసుకొని, ఎందుకయ్యా ఆవిధంగా చేయడం, రాష్ట్రం కొత్తగా ఏర్పడింది, పాజిటివ్‌గా పోవాలని సూచించారు.

అప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలలోనైతే వార్షిక ఆదాయం రూ.50 వేల లోపల ఉండి, ఒకటిన్నర ఎకరాల తరి, రెండున్నర ఎకరాల మెట్ట భూమి ఉన్న వారికే రేషన్ కార్డులు ఇచ్చారు. అర్బన్ ఏరియాస్‌లోనైతే రూ.75 వేల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారికి కార్డులు ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత తరి పొలం పరిమితిని ఒకటిన్నర ఎకరాల పొలం నుంచి మూడున్నర ఎకరాలకు పెంచాం, రెండున్నర ఎకరాల మెట్ట పొలం పరిమితిని ఏడున్నర ఎకరాలకు పెంచాం. అందులో ఒక నోట్ కూడా పెట్టాం. ఈ కుటుంబానికి భూమి ఉన్నప్పటికీ వీళ్లు పేదవారిగా ఉన్నారు, వీళ్లకి బియ్యం అవసరమని

సంబంధిత ఎమ్మార్వో కనుక అభిప్రాయపడితే వాళ్లకు తప్పకుండా బియ్యం ఇవ్వమని చెప్పాం. దాని ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న దానికి అదనంగా 35.22 లక్షల కుటుంబాలకు, జనాభా ప్రకారం చూస్తే 82,64,700 మందికి బియ్యం ఇస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి అందరికీ కడుపు నిండా అన్నం పెట్టాలనే సంకల్పంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. వాస్తవానికి this card is meant only for rice and not for other purposes అని రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్లియర్‌గా జీ.ఓ. ఎందుకు ఇచ్చామంటే చాలా మంది ఫీజు రీయింబర్స్ మెంటుకు, ఆరోగ్యశ్రీ, సియం రిలీఫ్ ఫండ్ కోసం, ఇతరత్రా వాడుకునే ఆస్కారం ఉంది.

కార్డులు తీసుకున్నా బియ్యం తీసుకోవడం లేదు, కానీ ప్రతి నెలా వీళ్ల పేరు మీద డీలరు బియ్యం డ్రా చేస్తాడు. అందుకే మేము వచ్చిన తర్వాత జీ.ఓ. ఇచ్చాం. ఎందుకో గానీ మెడికల్ అండ్ హెల్త్ మరియు ఇతర శాఖల వాళ్లు మళ్లీ బిపిఎల్ కార్డు హోల్డర్స్ అని జీఓలు జారీ చేయడం వల్ల కొన్ని కార్డులను తీసివేయలేకపోయాం. ఈరోజు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే రేషన్ కార్డు ఏదైతే ఉందో అది అన్నింటికీ వర్తిస్తుందని తెలియజేస్తున్నాను. ఈ మధ్యన ఈపాస్ మిషన్లు పెట్టాం. వీటి వల్ల రూరల్ ఏరియాస్‌లో మరియు హైదరాబాదు నగరంలో అక్రమాలను అరికట్టగలిగాము. కొంత మంది ఉద్యోగులు, బ్రహ్మాండంగా కార్లున్న వారు, ఎక్కువ ఆదాయం ఉన్న వారికి కూడా కార్డులున్నాయి. డబుల్ కార్డులుంటున్నాయి, ఊర్లో ఒకటి, ఇక్కడ ఒకటి ఉంటుంది. వీటిని ఎలిమినేట్ చేసి స్థిరంగా 2.74కోట్ల మందికి రేషన్ ఇస్తున్నాం. హైదరాబాదు నగరంలో ఎక్కడైనా డిమాండు ఉంటే, కొత్త కార్డుల అవసరం ఉంటే ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు ఆ ప్రజల చేత దరఖాస్తు చేయించవచ్చు. మా డిపార్టుమెంటు 365 రోజులు పేదల కోసం కార్డులు జారీ చేయడానికి సిద్ధంగా ఉందని మనవి చేస్తున్నాను.

**11.20 ఉ.** మూడవది, కేంద్ర ప్రభుత్వం 5 కిలోల బియ్యం మాత్రమే ఇస్తున్నారు. అదికూడా ఒక కిలోకి రూ.3.00 ఇస్తున్నారు. దానికి అదనంగా ఇతరత్రా ఖర్చులకు రూ.1.04పైసలు మన రాష్ట్రం చెల్లిస్తోంది. అంటే, కేంద్ర ప్రభుత్వం ఇచ్చేటువంటి 5 కిలోల బియ్యానికి సంబంధించి ప్రతి కిలోకి రూ.4.04 ఖర్చవుతుంది. కానీ, మన ప్రభుత్వం ఆ 5 కిలోలకు సంబంధించి రూ.3.04 పైసలను భరించి, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 5 కిలోలకు అదనంగా మరొక కిలో బియ్యాన్ని కూడా సబ్సిడీ క్రింద ఇవ్వడం జరుగుతోంది. మొత్తం ఒక మనిషికి 6 కిలోల కోసం రూ.24.24 పైసలను ఖర్చు చేయడం జరుగుతోంది. మొత్తం 82 లక్షల మందికి ఇచ్చే బియ్యాన్ని కూడా ఒక్కో మనిషికి 6 కిలోల చొప్పున ఇవ్వడం జరుగుతోంది.

అధ్యక్షా, గతంలో ఒక కుటుంబంలో ఎంత మంది సభ్యులున్నప్పటికీ, క్యాప్ ఉండడం వల్ల ఆ కుటుంబానికి 20 కిలోలు మాత్రమే రేషన్ బియ్యం అందేది. కానీ, మన రాష్ట్రంలో మాత్రం 10 మంది కుటుంబ సభ్యులుంటే, ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఆ కుటుంబానికి 60 కిలోల బియ్యాన్ని ఇవ్వడం జరుగుతోంది. ఆ విధంగా రేషన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రం.

(బల్లలు చరచడం ద్వారా గౌరవ సభ్యులు తమ హర్షాన్ని వ్యక్త పరిచారు)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో బ్రాడ్‌గా, ఎంతో గొప్పగా పేదలను ఆదుకోవాలనే సంకల్ప బలంతో, కేంద్ర సబ్సిడీ పోను 3,000 కోట్ల రూపాయలను ఈ రాష్ట్రంలో ఖర్చు పెడుతోంది.

**మిస్టర్ ఛైర్మన్ః–** ప్రశ్న నెం. 2604

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జాతీయ గుర్తింపు గురించి

ప్రశ్న నెం. 2604(60)

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, డా.ఆర్.భూపతి రెడ్డి మరియు డా. ఎం. శ్రీనివాస రెడ్డి, ఎం.ఎల్.సి.లుః– గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జాతీయ గుర్తింపు పొందడం కోసం పాటించవలసిన ప్రమాణాలు, ప్రామాణికాల వివరాలు ఏమిటి;

ఆ) నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో జాతీయ గుర్తింపు పొందిన రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వివరాలు ఏమిటి;

ఇ) సదరు గుర్తింపు వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?

**గౌరవనీయులు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (డా. సి.లక్ష్మారెడ్డి)ః–** అ) ప్రజారోగ్య సదుపాయాలలో నాణ్యతా ప్రమాణాలను అమలు చేసేందుకు ఎన్.హెచ్.ఎస్.ఆర్.సి. మరియు ఎం.ఒ.హెచ్.ఎఫ్.డబ్ల్యు.లు జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు (ఎన్.క్యూ.ఎ.ఎస్.)ను అభివృద్ధి చేస్తున్నాయి. ఈ ధృవీకరణ పత్రం పొందడానికి సదుపాయాల ప్రతి స్థాయిలో నిర్దేశిత ప్రమాణాలన్నింటిలో కనీసం 70 శాతం స్కోర్‌ను పొందవలసి ఉంటుంది.

ప్రతి సదుపాయ స్థాయిలో ప్రమాణాలను ఈ క్రింద పట్టికలో చూపడమయింది.

| సదుపాయం | డిహెచ్/ ఎహెచ్ | సిహెచ్సి | పిహెచ్సి | యుపిహెచ్సి |
|---|---|---|---|---|
| ప్రమాణాలు | 74 | 65 | 50 | 35 |
| లెక్కించదగ్గ మూలకాలు / చెక్‌పాయింట్లు | 362 | 290 | 250 | 198 |
| డిపార్టుమెంట్లు | 18 | 12 | 6 | 12 |

జాతీయ క్యూఏ ధృవీకరణ పత్రం పొందడం కోసం ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 250 చెక్ పాయింట్లకు గాను 50 నాణ్యతా ప్రమాణాల కింద 6 డిపార్టుమెంట్లను మూల్యాంకనం చేయడమయింది.

ఆ)ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 2017లో జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు (ఎన్.క్యూ.ఎ.ఎస్.) ధృవీకరణ లభించింది.

22 పిహెచ్‌సిలు (ఎన్.క్యూ.ఎ.ఎస్.) ధృవీకరణ కోసం దరఖాస్తు చేసుకోగా పిహెచ్‌సిలు కేంద్ర ప్రభుత్వ బాహ్య మదింపు పొందాల్సి వుంది. అనుబంధ రూపంలో జాబితాను సభా సమక్షంలో ఉంచడమయింది.

**Annexure**

**(vide answer to clause (b) of Starred LCQ No.2604)**

| S.No | PHC . Name | District |
|---|---|---|
| ·1 | Ichoda ' . | Adilabad |
| 2 | Indravally | Adilabad |
| 3 | Danthanpally | Adilabad |
| 4 | Janampet . | Mahabubnagar |
| 5 | Vemulapally | Nalgonda |
| 6 | Shaligowraram | Nalqonda |
| 7 | Soan | Nirmal |
| 8 | Choutupally | Nizamabad |
| 9 | Kammapally | Nizamabad |
| 10 | Parnashala | Bhadradri Kothagudem |
| 11 | Sujatha Naqar | Bhadradri Kothaqudern |
| 12 | Chandruqonda | Bhadradri Kothagudem |
| 13 | Shakaranbanzara | Bhadradri Kothagudem |
| 14 | MP Banzara | Bhadradri Kothagudem |
| 15 | Mulkanoor | WaranQal Urban |
| 16 | Uppal | Vvaranqal Urban |
| 17 | Kondurq | Ranqareddv |
| 18 | Kukunoorpally | Siddipet |
| 19 | Reddypally | Medak . |
| 20 | Quthbulilapur | Medchal malkaiqiri - |
| 21 | Sri rangawaram | Medchal rnalkaiqiri |
| 22 | Chityal | Vikarabad |

ఇ) ధృవీకరణ పొందిన ప్రతి పిహెచ్‌సికి ఏడాదికి రూ.3.00 లక్షలు లభిస్తుంది. ఈ ప్రోత్సాహంలో 75 శాతం సదుపాయాల మెరుగుదలకు ఉపయోగించవలసి వుంటుంది. మిగిలిన 25 శాతాన్ని భాగస్వాములైన సిబ్బందికి ప్రోత్సాహకంగా ఇవ్వడమవుతుంది.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, వరా నియోజకవర్గం మీ నియోజకవర్గం ఒక్కటే. ఆదిలాబాద్ జిల్లాలో ప్రధానంగా మన నియోజకవర్గంలో, తెలంగాణ రాష్ట్రంలో అత్యాధునికమైన ప్రమాణాలతో మంచి ఆసుపత్రులుగా రూపకల్పన జరగాలనే ఉద్దేశంతో, ఈ నాణ్యతా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఇచ్చోడ, భీంపూర్ ప్రాంతాలు చాలా వెనకబడిన ప్రాంతాలు. ఆ ప్రాంతాల్లో ఉండేటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా నాణ్యతా ప్రమాణాలను అమలు పరస్తూ, వాటి నిర్వహణ సాగించడం గర్వకారణం.

70 పాయింట్లు వచ్చినట్లయితే, ఆ ఆసుపత్రికి గుర్తింపు వస్తుందని డాక్టరు గారు బ్రహ్మాండంగా చెప్పారు. కానీ, ఆ ప్రమాణాలు ఏమిటనే అనుమానం మాకు వచ్చింది. అక్కడున్న రోగుల సంఖ్యకు తగ్గట్లుగా వైద్యులున్నారా లేదా, సిబ్బందికి నిరంతర శిక్షణ ఇస్తున్నారా లేదా, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ చేస్తున్నారా, జీవ వ్యర్థాల నిర్వహణలో అనుసరిస్తున్నటువంటి విధానాలు, సాంకేతిక నైపుణ్యం పొందడం, అమలులో ప్రతి రోగులకు సంతృప్తికరమైన సేవలను అందించడం వంటివన్నీ ఆ ప్రమాణాలని నేను అనుకుంటున్నాను. ఆ ప్రమాణాలకు తగినట్లుగా ఆ ప్రాంతంలో సేవలందిస్తున్న ఆసుపత్రికి జాతీయ స్థాయి, ఒక ప్రత్యేక స్వచ్ఛంద సంస్థల ద్వారా గుర్తింపు లభిస్తుంది.

కానీ, మన రాష్ట్రంలో ఇన్ని ఆసుపత్రులున్నప్పటికీ, ఎన్ని ఆసుపత్రులను మనం ప్రతిపాదిస్తున్నాం. ఆసుపత్రుల్లో కూడా ఎన్నో రకాలున్నాయి. పెద్దాసుపత్రులుంటాయి, జిల్లా ఆసుపత్రులుంటాయి, ప్రాంతీయ ఆసుపత్రులుంటాయి, సామాజిక ఆరోగ్య కేంద్రాలుంటాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుంటాయి. కాబట్టి, ఎన్ని ఆసుపత్రులను జాతీయ స్థాయి గుర్తింపు కొరకు మనం ప్రతిపాదిస్తున్నాం? వాటిలో ప్రమాణాలకు అనుగుణంగా ఉండేటువంటి ఆసుపత్రులు ఎన్ని ఉన్నాయి? అనే వివరాలను తెలుపవలసిందిగా కోరుతున్నాను.

మరొక విషయం, నాకు తెలిసినంత వరకు, ఏ ఆసుపత్రి అయితే 70 శాతం మార్కులు సాధిస్తుందో, ఆ ఆసుపత్రి జిల్లా ఆసుపత్రి అయినట్లయితే, ఒక్కొక్క పడకకు 100

రూపాయల నగదు ప్రోత్సాహం లభిస్తుంది. కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో 100 పడకలున్నాయి. ఒక్క పడకకు రూ.100.00లు ప్రకారం ఎన్ని ఆసుపత్రులకు ప్రయోజనం కలిగిందో తెలుపుతూ, ఆ ప్రయోజనం పొందడంలో సిబ్బందికి ఎంత లాభం చేకూరింది అనే విషయాన్ని కూడా స్పష్టం చేయవలసిందిగా కోరుతున్నాను.

**డా. ఎం. శ్రీనివాస రెడ్డి:–** అధ్యక్షా, ఈ అంశం మీద మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. వైద్య రంగం అనేది 'prevention is better than cure' అనే నానుడిపై ఆధారపడి ఉంది. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో BP, Blood test, Urine test వంటి minimum basic tests చేయాలి. చాలా సింపుల్ టెస్ట్‌లు అయినప్పటికీ, వచ్చిన రోగులకు మాత్రం చాలా ముఖ్యమైన టెస్ట్‌లు. ఆ టెస్ట్‌ల ఆధారంగా రోగం ఏమిటనే దానిపై డాక్టరు ఒక నిర్ధారణకు రావడం జరిగి, తగిన చికిత్స చేసుకునేందుకు అవకాశముంటుంది.

పి.హెచ్.సి.లో ఉన్న డాక్టరు 24 గంటల పాటు అందు బాటులో ఉండాలి. సహజంగా ఒక పి.హెచ్.సి.లో ఒకరు లేదా ఇద్దరు డాక్టర్లు ఉంటారు. ఒక డాక్టరుకు గానీ, ఒక అడ్వకేట్‌కు గానీ వారి availability and reliability మీదనే వారికి మంచి పేరు వస్తుంది. కాబట్టి, 24 గంటల పాటూ డాక్టర్లు పి.హెచ్.సి.లలో అందుబాటులో ఉంటే, మనం వెళ్ళగానే మనకు వైద్యం అందుతుందనే నమ్మకం ప్రజలలో ఏర్పడుతుంది. సాధారణంగా పి.హెచ్.సి. ఉండే ప్రాంతాలలో క్వార్టర్లు లేవనీ, ఇతర సౌకర్యాలు లేవనే కారణాలతో డాక్టర్లు పట్టణాలలో నివాసముంటారు. గత ప్రభుత్వాలలో వారు ప్రైవేటు ప్రాక్టీసు కూడా చేసే వారు. ఆ కారణంగా కూడా వారు పి.హెచ్.సి.ల దగ్గర నివాసముండేవారు కాదు. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అటువంటి ప్రాక్టీసులు చాలా తగ్గాయనే మాట వినబడుతోంది.

Preventive measures లో ముఖ్యమైనది vaccination, like Polio vaccine, MMR vaccine. Epedemic diseases like Maleria, Filaria and other infections etc. ప్రబలకుండా preventive measures తీసుకుంటే తదుపరి treatment easy అవుతుంది. ఏదైనా దెబ్బ తగిలితే, వెంటనే first aid చేయాలి. అప్పుడే, వారిని పెద్ద ఆసుపత్రులకు తీసుకెళ్ళేందుకు అవకాశముంటుంది.

సాధారణంగా పి.హెచ్.సి.లలో గైనకాలజిస్టులు తక్కువగా ఉంటారు. ఒకవేళ గైనకాలజిస్టులుంటే, ఎమర్జెన్సీ కేసుల్లో డెలివరీ చేయగలిగితే, నియోనేటల్ కేసులు గానీ, మేటర్నల్ మోర్టాలిటీ రేట్ తగ్గేటువంటి అవకాశముంటుందని తెలియజేస్తున్నాను. ఒకవేళ అక్కడి డాక్టరుకు వీలు కాకుంటే, వేరే ఆసుపత్రికి పంపించే ఏర్పాట్లు చేయాలి.

ముఖ్యంగా పి.హెచ్.సి.లు కమ్యూనిటీ హెల్త్ ఎడ్యుకేషన్ చేయవలసి ఉంటుంది. 300 నుండి 400 మంది ఉన్న ఊర్లో హెల్త్ క్యాంప్ పెడితే, వారిలో కనీసం 10 మందైనా మనం చెప్పిన జాగ్రత్తలు, సూచనలను అనుసరించినా, ఆ హెల్త్ క్యాంప్ ప్రోగ్రామ్ గ్రేట్ సక్సెస్ అయ్యిందని మనం భావించవచ్చు. కాబట్టి, హెల్త్ క్యాంపులను నిర్వహించాలి.

అదే విధంగా, జాతీయ గుర్తింపు వచ్చిన ఆసుపత్రులకు రూ.3.00 లక్షల నగదు పురస్కారాన్ని ఇస్తారు. ఆ మొత్తంలో నుండి మూడు వంతులు ఆ ఆసుపత్రికి సంబంధించిన సదుపాయాల కల్పన మరియు అభివృద్ధి కోసం, మిగిలిన నాల్గవ వంతుని ఆ ఆసుపత్రిలోని సిబ్బందికి నగదు ప్రోత్సాహకంగా ఇచ్చేందుకు వినియోగిస్తారు. సిబ్బందికి నగదు రూపంలో కాకుండా సర్టిఫికేట్ రూపంలో గానీ, ప్రెజెంటేషన్ రూపంలో ఇచ్చినట్లయితే, అది వారికి జీవితాంతం ఎంతో తృప్తినిస్తుందని గౌరవ మంత్రి గారికి తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

**శ్రీ పూల రవీందర్ (ఉపాధ్యాయుల నియోజక వర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ):–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత, మంచి మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తున్నందుకు అభినందనలు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్.ఎం.పి.ల వద్దకు అక్కడి ప్రజలు వెళ్ళకుండా ఉండేందుకు అక్కడ సబ్–సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఆ సబ్–సెంటర్లను ప్రైమరీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉన్నదా తెలపాలని కోరుతున్నాను. మా స్వంత గ్రామంలో సుమారు 6 వేల జనాభా నివసిస్తోంది. అక్కడ ఒక సబ్–సెంటరును గౌరవ మంత్రి గారు కట్టించారు. ఆ సబ్–సెంటరును ప్రైమరీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయవలసిందిగా గౌరవ మంత్రి గారిని తమరి ద్వారా కోరుతున్నాను.

**శ్రీ సబావత్ రాములు నాయక్ (నామినేటెడ్):–** అధ్యక్షా, ఏజెన్సీ ప్రాంతాలలో ఆసుపత్రులు ఉంటాయి గానీ, అక్కడ డాక్టర్లు ఉండరు. నేను బోథ్ నియోజకవర్గంలో ఎనిమిది సంవత్సరాలున్నాను. ఇచ్చోడ, నేరేడుగొండ, బజారత్నూర్, థాంసీ, తలమడుగు, బోథ్ మరియు వాటి ప్రక్కనే ఉండే ఇంద్రవెల్లి, నార్నూర్ దగ్గర కూడా పి.హెచ్.సి.లు ఉన్నాయి. నేను సమైక్య రాష్ట్రంలో చూశాను. మన మంత్రిగారు వచ్చిన తరువాత పరిస్థితి కొద్దిగా మెరుగై ఉండవచ్చు. పి.హెచ్.సి.లలో

డాక్టర్లు ఉండరని ఆ ఊర్లలో ఉన్న ఆర్.ఎం.పి. డాక్టర్లను రోగులు సంప్రదిస్తారు. ఈ ఆర్.ఎం.పి. డాక్టర్లు గ్లూకోజ్ ఎక్కించడం, డబ్బులు తీసుకోవడం తప్ప ఇంకోటేమీ చేయరు. ఏజెన్సీ ప్రాంతాలలోని పి.హెచ్.సి.లలో వైద్యులు ఉండడం తప్పనిసరి. ఏజెన్సీ ప్రాంతంలో ఉండే పి.హెచ్.సి.లకు వెళ్తే, అక్కడేమీ ఉండదు, ఉండడానికి ఇళ్ళు కూడా ఉండవని డాక్టర్లు ఎవ్వరూ అక్కడికి పోరు. కాబట్టి, ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్ళే డాక్టర్లకు స్పెషల్ అలవెన్స్‌ను ఇవ్వడం ద్వారా వారిని ప్రోత్సహించాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి విన్నవిస్తున్నాను.

**శ్రీ ఉల్లోళ్ళ గంగాధర్ గౌడ్‌ః–** అధ్యక్షా, మన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుండి గత 4 సంవత్సరాలుగా జిల్లా ఆసుపత్రులతోపాటు, గ్రామీణ ప్రాంతాలలోని ఆరోగ్య కేంద్రాలలో కూడా మంచి సదుపాయాలు కల్పిస్తూ, మెరుగైన వైద్యాన్ని ప్రజల చేరువకు తీసుకురావడం జరిగింది.

అధ్యక్షా, క్రొత్త మండలాలు ఏర్పడిన తరువాత, విభజన కాబడ్డ పాత మండల పరిధిలో ఉన్న పి.హెచ్.సి., ఆ రెండు మండలాలలో ఏదో ఒక మండలానికే పరిమితమైపోయింది. మరొక మండల ప్రాంతానికి పి.హెచ్.సి.ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఏర్పడింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలో పి.హెచ్.సి. ఉండేది. మండలాల విభజన తరువాత ఆ పి.హెచ్.సి. ఇందల్వాయి మండలానికి వెళ్ళింది. ఈ విషయమై మేము గతంలో మంత్రి గారిని కోరడం జరిగింది. రాంపూర్ గ్రామంలో పి.హెచ్.సి. ఏర్పాటుకి అనుమతి ఇస్తే, అక్కడున్న మారుమూల ప్రాంత ప్రజలకి వైద్య సదుపాయాలు అందే అవకాశముంటుంది. మండలాల ఏర్పాటు వల్ల చాలా మండలాలలో ఉన్న పి.హెచ్.సి.లు వేరొక మండలానికి మారిపోయాయి కాబట్టి, పి.హెచ్.సి. లేనటువంటి మండలాలలకు పి.హెచ్.సి.ని మంజూరు చేయాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పురాణం సతీష్ కుమార్‌ః–** అధ్యక్షా, గ్రామాలలో గ్రామీణ ప్రజలకు ఏదైనా ప్రమాదకర పరిస్థితి ఉంటే, వారికి ప్రథమ చికిత్స చేసేదే ఆర్.ఎం.పి.లు/పి.ఎం.పి.లు. వాళ్ళ దగ్గరికి వచ్చిన వాళ్ళను అక్కడి నుండి పట్టణాలకు వాళ్ళే స్వయంగా తీసుకువచ్చి హాస్పిటల్‌లో అడ్మిట్ చేస్తారు. పట్టణాలలో గానీ, పి.హెచ్.సి.లలో గానీ, సి.హెచ్.సి.లలో గానీ ఎంబిబిఎస్ డాక్టర్లను, ఎండి డాక్టర్లను నియమించుకున్నా అభ్యంతరం లేదుగానీ, ఆర్.ఎం.పి.లు/పి.ఎం.పి.ల సేవ కూడా క్షేత్రస్థాయి ప్రజానీకానికి చాలా అవసరం. అత్యవసర పరిస్థితుల్లో వాళ్ళు అక్కడ ప్రథమ చికిత్స చేయకపోతే దారిలోనే చనిపోయే ప్రమాదం ఉంది. కనుక ఆర్.ఎం.పి.లు/పి.ఎం.పి.లను తక్కువ చేసి చూడవద్దని మనవి చేస్తున్నాను. వాళ్లకు ట్రైనింగ్ ఇచ్చి, సర్టిఫికేట్స్ కూడా ఇస్తున్నారు. వాళ్ళ వ్యవస్థ కూడా గ్రామీణులకు చాలా అవసరం. కాబట్టి, ఆ వ్యవస్థను కూడా కాపాడుకోవలసిన బాధ్యత తెలంగాణ రాష్ట్రం మీద ఉందని తెలియజేస్తున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్‌ః–** అధ్యక్షా, సభ్యుల భాష, వాళ్ళ వ్యవహారశైలిని చూస్తూంటే, గ్రాస్‌రూట్ లెవల్లో సమస్యలు వాళ్ల దృష్టికి రావచ్చు, వాళ్ల అనుభవంలోకి రావచ్చు, అవగాహన ఉండొచ్చు. కానీ, ఎప్పటికప్పుడు వివిధ అంశాలను అప్‌డేట్ చేసుకునే విషయాన్ని మాత్రం వారు మరువకూడదు.

ఈరోజు మంత్రులుగా ఉన్న మాకు వేరే వ్యాపకాలు లేవు. గతంలో మంత్రులు వారంలో మూడు రోజుల పాటు టూర్లలో, ఎక్కడెక్కడో ఉండేవాళ్ళు. ఈ ప్రభుత్వంలో ఆ ఆస్కారం లేదు. కాబట్టి, తెలంగాణ రాష్ట్రంలో మంత్రులు 365 రోజులు అందుబాటులో ఉంటారు. కాబట్టి, మంత్రులకు మీరు మీ ప్రాంతంలోని సమస్యలను రిప్రజెంట్ చేయాలి. గౌరవ ఎమ్మెల్సీలు, గౌరవ ఎమ్మెల్యేలకు వారి ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలనే భావన ఉండాలని మనవి చేస్తున్నాను.

కొత్త రాష్ట్రం, అతి తక్కువ కాలంలోనే అనేక రకాల స్కీములకు రచన చేసి, అమలు చేస్తున్న రాష్ట్రంగా దేశమంతా కూడా పేరు ప్రతిష్టలు పొందుతూ ఉంటే, అదే ఆఫీసర్లు, అదే సిస్టమ్, అదే పద్ధతుల్లో కూడా ఇవాళ ఇంత గొప్ప మార్పులు సంతరించుకుంటూ ఉంటే,

(బల్లలు చరచడం ద్వారా సభ్యులు హర్షం వ్యక్తం చేశారు)

మన రాష్ట్రానికి ఎన్నో అవార్డులు వస్తున్నాయి. వైద్యం అంటే అంత ఈజీ కాదు. 40 మంది విద్యార్థులను పంపడం, టీచర్ల క్వాలిటీని ఇంప్రూవ్ చేసుకోండి అంటే స్కూల్ ఎడ్యుకేషన్ ఇంప్రూవ్ అవుతుంది. కానీ, వైద్య రంగానికి ప్రతి వ్యక్తితో సంబంధం ఉంటుందనే విషయం మరచిపోకండి. 57 ఏళ్ళుగా భ్రష్టు పట్టినటువంటి వ్యవస్థను మూడేళ్లలో, నాలుగేళ్ళలో మొత్తానికి మొత్తం, ఓవర్ నైట్‌లో ఛేంజ్ చేస్తామనేటువంటి భావన గానీ, ఆ ఆలోచన గానీ, ఆ కోరిక గానీ ఉండడం తప్పు అని నేను మనవి చేస్తున్నాను.

దయచేసి, వేరే విధంగా అనుకోవద్దు. మీకు ఆవేదన ఉన్నది. మీకు ఆర్తి ఉన్నది. మీకు తపన ఉన్నది. దానికి మీ కార్యాచరణను తోడుగా పెట్టండి. మేమందరం మీకు ఉద్యమ సహచరులం. మీకు అందరు మంత్రులతో సాన్నిహిత్యం ఉంది. కాబట్టి,

మీరు మా దగ్గరికి రండి. మీ ప్రాంత సమస్యలుంటే, వాటిని పరిష్కరించుకునే ప్రయత్నాలు చేయండని గౌరవ సభ్యులకు నేను మనవి చేస్తున్నాను. దయచేసి, ఇంకొక మాట కూడా చెప్తున్నాను. ముఖ్యమంత్రి గారు ఒక మాట పదే పదే చెప్తూ ఉంటారు. మనం నెగటివ్ కోణంలో చూడకూడదు. Be positive. Everything is possible through commitment and through conviction. తపన ఉంటే తప్పకుండా సార్థకమయ్యే ఆస్కారముంటుంది.

మిషన్ భగీరథను మూడు సంవత్సరాల కాలంలో అమలు చేయకపోతే, మేము ఓట్లు అడగం అని ప్రకటించిన నాడు, మేమందరం కూడా ఇది సాధ్యమైతదా అని లోపల బాధ పడ్డాం. 35 ఏళ్లు గడిచినా కూడా ఎస్సారెస్పీ నుంచి నీళ్ళు ఇవ్వలేకపోయిన పరిస్థితి గతంలో ఉండేది. అదే ఇంజనీర్లతో, ఈ మూడు సంవత్సరాలలో మానవ అద్భుతానికి, ఆవిష్కరణకి కేంద్రబిందువైన తెలంగాణలో మనలాంటి వాళ్ళం పాల్గొన్నాం. మన పాత్ర కూడా ఉన్నందుకు మనం గర్వపడాలి. అంతేతప్ప, నెగటివ్ ఓరియంటేషన్‌లో, అట్లాంటి యాటిట్యూడ్‌తో మాట్లాడే భాషను దయచేసి మార్చుకోమని సవినయంగా విన్నవిస్తున్నాను.

**శ్రీ కర్నె ప్రభాకర్‌ః–** అధ్యక్షా, ధన్యవాదాలు. సభలో అత్యంత ముఖ్యమైన సమస్యలనే మేము ప్రస్తావిస్తాం. ఆషామాషీ అంశాలను ప్రస్తావించే ప్రశ్నే లేదు. మేము ప్రజల్లో ఉన్నందుకు, సహచర గౌరవ సభ్యులు వేసిన ప్రశ్న వూకు సంబంధించినటువంటిదైతే, ఛైర్‌ను రిక్వెస్ట్ చేసుకొని ఆ ప్రశ్నలోకి ఇంటర్వీన్ అవుతున్నాం. దానిలో భాగంగానే గౌరవ మంత్రి గారికి నాలుగైదు సందర్భాలలో గుర్తు చేసినటువంటి అంశాన్ని, మరొక్కసారి ఈ సందర్భంగా గుర్తు చేస్తాను. సంబంధిత అధికారులుంటే వారు దయచేసి నోట్ చేసుకోవాలి, ఎందుకంటే గౌరవ మంత్రిగారి దృష్టికి ఈ విషయాన్ని చాలాసార్లు తీసుకురావడం జరిగింది.

నా నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి నా స్వంత మండలమైన సంస్థానారాయణపురంలో ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ఒకటిన్నర సంవత్సరం క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపాను. అది తిరిగి వచ్చింది. జి.ఓ. వచ్చింది. ప్రొసీడింగ్స్ వచ్చింది. విచిత్రమేమంటే, సంవత్సరమున్నర కాలం అవుతోంది. ఈ నిమిషానికి కూడా నేను అంబులెన్స్‌ను ఇవ్వలేకపోయాను.

11.40 ఉ. ఎందుకు ఇవ్వలేకపోయానంటే, అక్కడ ఉన్నటువంటి డిఎంహెచ్ఓ గారితో దాదాపు నేనే 15 సార్లు మాట్లాడడం జరిగింది. మాట్లాడుతున్న సందర్భాలలో చివరికి, ఒకానొక సందర్భంలో అసహనానికి గురై ఎందుకు ఇంత గందరగోళం చేస్తున్నారు, మీకు తెలియకపోతే, మీ పై అధికారులతో మాట్లాడి తెలుసుకోండని చెప్పడం జరిగింది. జాతీయ ప్రమాణాల ప్రకారం తప్పకుండా ఒక అంబులెన్స్ అందుబాటులో ఉండాలి. కాబట్టి, మా నిధుల నుండి అంబులెన్స్ ఇస్తామన్నా కూడా ఉపయోగించుకోలేనటువంటి సందర్భం. ఏదేమైనప్పటికీ, చివరికి వారం, పది రోజుల్లో అంబులెన్స్ వచ్చేటటువంటి పరిస్థితి ఉంది. కాబట్టి, దానికి ఒక డ్రైవర్‌ని ఏర్పాటు చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ సి.లక్ష్మారెడ్డిః–** అధ్యక్షా, ఇంచుమించు సభలోని సభ్యులంతా ఈ అంశంపై మాట్లాడడం జరిగింది. ఆదిలాబాద్ జిల్లాలోని ఒక ప్రాథమిక ఆసుపత్రికి జాతీయస్థాయి అవార్డు రావడం జరిగింది. కానీ, ఇంచు మించు రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని ప్రాథమిక కేంద్రాలను కూడా ఆ స్థాయికి దీటుగానే ఇంప్రూవ్ చేయడం జరిగింది. వచ్చే ఆరు మాసాల్లో మరో 100 ఆసుపత్రులను జాతీయ స్థాయి అవార్డు కొరకు పంపడం జరుగుతుంది. అట్లాగే రాష్ట్రంలో ఉన్నటువంటి 18 జిల్లా ఆసుపత్రులను కూడా ఈ కార్యక్రమానికి పంపించడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ప్రభుత్వ పరంగా తీసుకున్న చర్యల వల్ల అన్ని ఆసుపత్రులను చాలా వరకు మెరుగుపరచడం జరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనేటివి బేస్ ఆసుపత్రులు. కాబట్టి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైనటువంటి అన్ని సౌకర్యాలు ఇప్పటికే కల్పించడం జరిగింది. గతంలో, ఇప్పటికీ పరిశీలిస్తే చాలా మార్పులు వచ్చాయి. బేసిక్‌గా కలర్స్ వేయడంలో గానీ, పరిసరాల పరిశుభ్రతలో గానీ, మౌలిక సౌకర్యాలు కల్పించడంలో గానీ, చివరికి కర్టెన్స్‌తో సహా ఆసుపత్రులను చాలా బ్రహ్మాండంగా తీర్చిదిద్దడం జరిగింది.

అట్లాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గానీ, సిహెచ్‌సీలు గానీ, ఏరియా ఆసుపత్రులు గానీ, జిల్లా ఆసుపత్రులు గానీ అన్నింటినీ కూడా గతానికీ ఇప్పటికీ పోల్చి చూస్తే బ్రహ్మాండంగా అభివృద్ధి చేయడంతోపాటు, సౌకర్యాలు కూడా కల్పించడం జరిగింది. భవిష్యత్తులో దేశంలో ఏ రాష్ట్రానికి రాని విధంగా జాతీయ అవార్డులు మన రాష్ట్రంలో ఉన్నటువంటి ఆసుపత్రులకు వచ్చే అవకాశం ఉందని గర్వంగా తెలియజేయడం జరుగుతోంది.

బహుశా గౌరవ సభ్యులు శ్రీ రాములు నాయక్ గారు ఈమధ్యన ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లినట్లు లేరు. గత నాలుగు

సంవత్సరాలకి, ఇప్పటికీ పోల్చితే ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆసుపత్రులు బ్రహ్మాండంగా ఇంప్రూవ్ అయ్యాయి. సిబ్బందిని రిక్రూట్‌మెంట్ చేయడం జరిగింది. జిల్లా ఆసుపత్రుల్లోని సిబ్బంది రిక్రూట్‌మెంట్ కొరకు జిల్లా కలెక్టర్లకే అధికారాలివ్వడం జరిగింది. కలెక్టర్లంతా సిబ్బందిని రిక్రూట్‌మెంట్ చేయడం జరిగింది. ఆసుపత్రులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాకాలంలో విష జ్వరాలు ఏవైతే నమోదు అవుతుండేనో, అటువంటి విషజ్వరాలు ఈసారి ఒక్కటి కూడా నమోదు కాలేదు. విష జ్వరాలు నమోదు కాకపోవడమనేది చరిత్రలో మొట్టమొదటిసారి. ప్రభుత్వం, డిపార్టుమెంట్ పరంగా తీసుకున్న చర్యల వల్ల పరిస్థితులలో చాలా ఇంప్రూవ్‌మెంట్ రావడం జరిగింది.

గౌరవ సభ్యులు శ్రీ పూల రవీందర్ మాట్లాడుతూ, సబ్ సెంటర్లను ఇంప్రూవ్ చేయాలని కోరడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కంటే క్రింది స్థాయిలో ఉండే ఆసుపత్రులు ఏవైతే ఉన్నాయో వాటిని గ్రామీణ ప్రాంతాల్లో ఎలా చేస్తే బాగుంటుందనే విషయంలో ఇప్పటికే ప్రణాళికలు తయారు చేయడం జరిగింది. వాటికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం జరిగింది. అన్ని సబ్ సెంటర్లను ఇంప్రూవ్ చేసి త్వరలోనే తగిన సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది.

గౌరవ సభ్యులు శ్రీ కర్నె ప్రభాకర్ గారు అంబులెన్స్ గురించి అడిగారు. దాని విషయంలో ఆలస్యం జరిగిందని అంటున్నారు. భవిష్యత్తులో అలా జరగకుండా చూస్తాము. వాస్తవానికి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ అవసరం ఉండదు. అది సాధ్యం కూడా కాదు. అతను తన ఫండ్స్‌నుండి నిధులు కేటాయించారు. కాబట్టి, దానికి కావాల్సిన అరేంజ్‌మెంట్ చేస్తాం. ఎందుకంటే, ఇప్పటికే 108 సర్వీసెస్‌ని బాగా ఇంప్రూవ్ చేయడం జరిగింది. ఎమెర్జెన్సీ సేవలు అందించడానికి 108 సర్వీసెస్ ఉన్నాయి. ఎప్పుడు ఫోన్ చేసినా అవి రావడానికి అవకాశం ఉంది. ఈమధ్యనే 102 సర్వీసెస్‌ని ప్రారంభించాం. గర్భిణీ స్త్రీలకు సంబంధించిన సౌకర్యాలు అన్నీ అంబులెన్స్‌లోనే ఉన్నాయి. ఎప్పుడు ఫోన్ చేసినా 108, 102 అంబులెన్స్ సర్వీసెస్ ఎక్కడైనా అందుబాటులో ఉంటాయి. కాబట్టి, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ అవసరముండదు. అయినాసరే గౌరవ సభ్యులు అంబులెన్స్ ఇచ్చారు కాబట్టి, దానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాము.

**మిస్టర్ ఛైర్మన్ః-** ఇప్పుడు ప్రత్యేక ప్రస్తావనలు.

## ప్రత్యేక ప్రస్తావనలు

**శ్రీ ఎస్. రామచంద్ర రావుః-** అధ్యక్షా, ఈరోజు సభలో పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖ మంత్రివర్యులు మాట్లాడుతూ, Rural Live Stockకి సంబంధించి మొబైల్ యూనిట్స్ నడుస్తున్నాయని చెప్పడం జరిగింది. 1104 Rural Live Stock Unitsని అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది. ఇక్కడ క్వాలిఫైడ్ వెటర్నరీ డాక్టర్స్ అవసరం. Para Veterinary Staff తో Rural Live Stock Units నడుపుతున్నారు. వెటర్నరీ సైన్స్ స్టూడెంట్స్ అంతా కూడా ఇందులో ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగా అందులో పని చేస్తున్నారు. కానీ, శాశ్వత నియామకాలు చేపట్టాలని కోరుతున్నారు.

పి.వి. నర్సింహా రావు వెటర్నరీ యూనివర్సిటీకి ఇంతవరకు Indian Council of Agriculture Research నుండి అక్రిడిటేషన్ రాలేదు. ఆ అక్రిడిటేషన్ గనుక వస్తే యూనివర్సిటీకి 25శాతం అదనంగా అభివృద్ధి నిధులు వస్తాయి. ఈ రెండు విషయాలపై చర్యలు తీసుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ నాయిని నర్సింహారెడ్డిః-** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. వీలైనంత త్వరలో పరిష్కరిస్తాం.

**శ్రీ పూల రవీందర్ః-** అధ్యక్షా, ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని చేపడుతున్నందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి మరియు గౌరవ మంత్రివర్యులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

2016 మే మాసంలో కేంద్ర ప్రభుత్వం యొక్క మిడ్ డే మీల్స్ ప్రోగ్రాం ఒకటి వచ్చింది. దాంతో వేసవి కాలం సెలవుల్లో మిడ్ డె మీల్స్ పెట్టాలని మన ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వేసవి కాలం సెలవుల్లో ప్రధానోపాధ్యాయులంతా ఎండలకు అన్నీ వదులుకొని పాఠశాలలకు వెళ్లి పూర్తిగా 50రోజులు పని చేసి విద్యార్థులకు భోజనాలు పెట్టించారు. కానీ, ఉపాధ్యాయులకు ఉన్నటువంటి ఫండమెంటల్ రూల్ 82-బి ప్రకారంగా వేసవి కాలంలో పని చేసినప్పుడు, వారు పని చేసిన దినాలు 15 రోజులు కనుక దాటినట్లయితే, తప్పకుండా వారు ఎన్ని రోజులు పని చేస్తే అన్ని రోజుల ఎర్న్‌డ్ లీవ్స్ వారికి మంజూరు చేయాలి. వేసవి సెలవులలో పని చేసినందుకు ఉపాధ్యాయులకు 24రోజులు ఎర్న్‌డ్ లీవ్స్ ప్రభుత్వం మంజూరు చేయవలసి ఉంది. కానీ, దీనికి బదులుగా ఎస్‌జిటిలకైతే రూ.225/-లు, ప్రధానోపాధ్యాయులకైతే రూ.300/-లుగా డెయిలీ అలవెన్స్ అని చెల్లించడం జరిగింది.

FR 82-B ప్రకారంగా వేసవి కాలం సెలవుల్లో పని చేసినందుకు ఉపాధ్యాయులకు 24రోజులు ఎర్న్డ్ లీవ్స్ మంజూరు చేయాల్సిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. వీలైనంత త్వరలో పరిష్కరిస్తాము.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో Special Grants, School Grants and Maintenance Grants అని ఇస్తారు. ఈ గ్రాంట్స్ పాఠశాలల ప్రాతిపదికనే ఇస్తున్నారు తప్ప, పాఠశాలల్లో ఉన్నటువంటి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రాతిపదిక మీద ఇవ్వడం లేదు.

ఐదు మంది విద్యార్థులున్న పాఠశాలకు ఎంతైతే గ్రాంట్ ఇస్తున్నారో, 300 మంది విద్యార్థులున్న పాఠశాలకు కూడా అంతే గ్రాంటు ఇస్తున్నారు. కాబట్టి, అలాకాకుండా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రాతిపదికన ఆ గ్రాంట్‌ను మంజూరు చేయాల్సిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ నాయిని నర్సింహారెడ్డి :** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. తప్పకుండా పరిష్కరిస్తాము.

## పిటిషన్స్

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, గత 20 సంవత్సరాల నుండి ఉర్దూ అకాడమీలో కంప్యూటర్ ఆపరేటర్లుగా కొంతమంది పని చేస్తున్నారు. 20 సంవత్సరాల క్రితం వారిని నియామకం చేసి, వారిని రెగ్యులరైజ్ చేస్తామనే మాట గత పాలకులు చెప్పారు. కానీ, ఇంతవరకు కూడా వారి సర్వీసులు రెగ్యులరైజ్ కాలేదు. తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ వారు పిటిషన్ సమర్పించడం జరిగింది. మీద్వారా సంబంధిత మంత్రివర్యులకు ఈ పిటిషన్‌ను పంపించ వలసిందిగా కోరుతున్నాను.

(పిటిషన్‌ను గౌరవ ఛైర్మన్‌కు సమర్పించారు)

**మిస్టర్ ఛైర్మన్ :** గౌడ కులాల సంక్షేమం కొరకు మద్యపాన నిషేధం మరియు అబ్కారీ శాఖామాత్యులు ప్రకటన చేయవలసిందిగా కోరుతున్నాను.

## గౌడ కులాల సంక్షేమం గురించి ప్రభుత్వ ప్రకటన

**శ్రీ టి.పద్మారావు:–** (ముఖ్యమంత్రి గారి తరఫున) అధ్యక్షా, తమరి అనుమతితో గౌడ కులస్థుల సంక్షేమానికి సంబంధించి ప్రకటన చేస్తున్నాను.

తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు ప్రభుత్వం బహుముఖాలుగా కృషి చేస్తున్నది. ప్రధానంగా వ్యవసాయ అభివృద్ధి, నీటి వనరుల అభివృద్ధి, కులవృత్తులకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నది. గ్రామీణ వనరులను ఆశ్రయించి ఎన్నో కులాలకు బ్రతుకు తెరువు లభిస్తున్నది. వారి బ్రతుకు తెరువులను కాపాడటం, మెరుగుపరచడం కోసం ప్రభుత్వం అనేక రకాల పథకాలను అమలుచేస్తున్నది. కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారిలో గౌడ సామాజికవర్గం ప్రధానమైనది. కల్లుగీత వృత్తిగా జీవించే గౌడ కులస్తులు సమైక్య రాష్ట్రంలో తీవ్ర నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురయ్యారు.

తెలంగాణ గ్రామీణ జీవితంపై అవగాహన, పట్టింపు లేని సమైక్య పాలకుల చర్యల మూలంగా కల్లుగీత వృత్తి మనుగడనే ప్రశ్నార్థకంగా మారింది. సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వం నుండి గీత కార్మికులకు ఎలాంటి అండదండ లభించలేదు. కనీసం వారి మానాన వారు బతికే అవకాశాన్ని కూడా లేకుండా చేశారు. లిక్కర్ లాబీల ప్రలోభాలకు, ఒత్తిడికి తలొగ్గి, హైదరాబాద్‌లో కల్లు దుకాణాలను నిర్దాక్షిణ్యంగా మూసేశారు. సమైక్య పాలకులు చేసిన ఈ దుర్మార్గాన్ని తెలంగాణ నాయకులు అడ్డుకోకపోగా, వంత పాడడం దౌర్భాగ్యం. మరోవైపు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుడుంబా మహమ్మారి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే వీళ్లే కళ్ళప్పగించి వేడుక చూశారు. సమైక్య పాలకులు సృష్టించిన ఈ సామాజిక విధ్వంసం వల్ల అటు ప్రజల ఆరోగ్యం పాడైపోయింది. ఇటు కల్లుగీత వృత్తి కల్లోలంలో పడింది.

తెలంగాణ ఉద్యమ సందర్భంలో గౌడ కులస్తులకు జరుగుతున్న అన్యాయం గురించి పదే పదే ప్రస్తావించాం. తెలంగాణ ఏర్పడి, మేము అధికారంలోకి వస్తే మూసేసిన కల్లు దుకాణాలను తెరిపిస్తామని ఉద్యమ నేతగా ఆనాడు నాకుగా నేను ప్రకటించాను. ప్రజా ఉద్యమం ఫలించి తెలంగాణ ఏర్పడింది. ప్రకటించిన విధంగానే హైదరాబాద్‌లో కల్లు దుకాణాలను తిరిగి తెరిపించాం. గౌడ కులస్తులకు జరిగిన అన్యాయాన్ని పరిష్కించాం. గౌడుల సంక్షేమం కోసం మరెన్నో చర్యలు తీసుకున్నాం.

కల్లు గీసే సమయంలో చెట్టుపై నుంచి పడి మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం పొందిన గీత కార్మికులకు పరిహారం చెల్లించడంలో గత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది. తెలంగాణ

ఏర్పడే నాటికున్న మూడేళ్ల బకాయిలు మొత్తం 6.38 కోట్ల రూపాయలను మేము అధికారంలోకి రాగానే వెంటనే ఏకకాలంలో చెల్లించాము.

అంతే కాకుండా అప్పటిదాకా అరకొరగా ఇస్తున్న పరిహారాన్ని మానవీయ దృక్పథంతో పెంచినాము. గతంలో చెట్టుపై నుంచి పడి మరణించిన వారికి రెండు లక్షలు, అంగవైకల్యం పాలైన వారికి 50వేలు మాత్రమే ఇచ్చేవారు. తెలంగాణ ప్రభుత్వం ప్రమాదవశాత్తు మరణించిన శాశ్వత అంగవైకల్యం పొందిన గీత కార్మికులకు ఇచ్చే పరిహారాన్ని 5 లక్షలకు పెంచింది.

ఈరోజు మీ అందరి సమక్షంలో గౌడ కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న మరికొన్ని మానవీయ నిర్ణయాలను ప్రకటిస్తున్నాను.

గీత కార్మికులకిచ్చే పెన్షన్‌ను 200 నుంచి 1000 రూపాయలకు పెంచాం. ఇప్పటి వరకూ కల్లు గీత సొసైటీ సభ్యులకు మాత్రమే పెన్షన్ లభిస్తున్నది. ఇక నుంచి టి.ఎఫ్.టి. కార్మికులకు కూడా పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 30వేల కుటుంబాలకు ఆసరా లభిస్తుంది.

టి.ఎఫ్.టి. నుంచి టి.సి.ఎస్.లోకి మారాలని దరఖాస్తు చేసుకున్న వారికి పది రోజుల్లో బదలాయింపు జరపాలని అధికారులను ఆదేశించాం. లైసెన్సుల రెన్యూవల్ గడువును ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతున్నాం. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈత, ఖర్జూర మొక్కలను పెద్ద ఎత్తున నాటే కార్యక్రమం చేపట్టాం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కోటి 70 లక్షల మొక్కలు నాటాం. ఎక్సైజ్, అటవీ శాఖల సమన్వయంతో రాబోయే రోజుల్లో చెరువు కట్టల మీద, చెరువు శిఖం వెంబడి, వాగుల వెంట, వర్రెల వెంట, నదీ ప్రవాహానికి ఇరువైపులా ఈత, ఖర్జూర మొక్కలను విరివిగా నాటే కార్యక్రమం కొనసాగుతోంది.

వీటన్నింటితో పాటు గౌడ కులస్తులకు మరొక తీపి కబురును ఈరోజు ప్రభుత్వం ప్రకటిస్తున్నది. ఇప్పటి వరకూ గీత కార్మికులకు ఉన్న చెట్ల పన్ను బకాయిలను పూర్తిగా మాఫీ చేస్తున్నాము. అంతేకాకుండా ఈనాటి నుంచి తెలంగాణ రాష్ట్రంలో చెట్లపైన పన్ను వేసే విధానాన్నే రద్దు చేస్తున్నాం. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా 16 కోట్ల రూపాయల భారం పడుతున్నా గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చెట్ల పన్నును పూర్తిగా రద్దు చేస్తున్నాం.

హైదరాబాద్ నగరంలో గౌడ కులస్తుల అస్థిత్వాన్ని సమున్నతంగా చాటే విధంగా రాష్ట్రస్థాయి గౌడ భవనం నిర్మాణం కోసం 5 ఎకరాల భూమిని, 5 కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నాం. ఈ భవనం గౌడ కులస్తుల సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాస కేంద్రంగా వెలుగొందాలని ఆశిస్తున్నాను.

## PAPERS LAID ON THE TABLE

MR. CHAIRMAN:- All the papers are deemed to have been laid on the Table of the House:

"A copy of the First Annual Report of the Telangana Beverages Corporation Limited for the year 2014-15, as required under Section 395 (1) of Companies Act, 2013".

**మిస్టర్ ఛైర్మన్:–** టీ విరామం కొరకు సభను 15 నిమిషాల పాటు వాయిదా వేస్తున్నాను.

( తేనీటి విరామం కొరకు గం.11.55ని. లకు సభను వాయిదా వేయడమైనది)

12.00 మ. (తేనేటి విరామం అనంతరం సభ మధ్యాహ్నం 12.15 గంటలకు పునః ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

**మిస్టర్ ఛైర్మన్:–** కెసిఆర్ కిట్స్ పై లఘు చర్చను ప్రారంభించవలసిందిగా గౌరవ సభ్యులు శ్రీ రామచంద్ర రావు గారిని కోరుతున్నాను.

## లఘు చర్చ – కె.సి.ఆర్. కిట్స్

**శ్రీ ఎన్. రామచంద్ర రావు:–** అధ్యక్షా, ముందుగా ఈ చర్చలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు తమరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కెసిఆర్ కిట్స్ అనేది చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నటువంటి పథకం. ఈ పథకంలో ఇప్పటికే చాలా మంది మహిళలు లబ్ధి పొందారని నిన్న మొన్న జరిగిన బడ్జెట్ సమావేశాల చర్చలలో చెప్పడం జరిగింది.

మనదేశంలో పిల్లలు పుట్టగానే చనిపోయే పరిస్థితులు కనపడుతున్నాయని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారు 2016 జనవరి నెలలో ఒక ప్రకటన చేయడం జరిగింది. గర్భిణీ స్త్రీల కోసం రూ.6,000/– ఆర్థిక సహాయం ఇవ్వాలని ఒక పథకాన్ని ప్రవేశ పెట్టారు. దేశంలోని 650 జిల్లాలలో ఈ పథకాన్ని అమలు చేయడం వలన పిల్లలు పుట్టగానే చనిపోయే పరిస్థితులు తగ్గే అవకాశాలు ఉంటాయని వారు చెప్పడం జరిగింది.

వాస్తవానికి మన దేశంలో పిల్లలు పుట్టి చనిపోయే సంఘటనలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా వెనకబడిన

రాష్ట్రాలలో సరైన వైద్య సదుపాయం లేక మెటర్నరీ ఆసుపత్రులు అందుబాటులో లేక పుట్టిన పిల్లలు వెంటనే చనిపోవడం జరుగుతున్నది. ఆ రోజు ప్రధానమంత్రి గారు స్పందించి, ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవడం జరిగింది. ఈ పథకం వల్ల దాదాపు దేశంలోని 53 జిల్లాలు లబ్ధి పొందాయి.

2017 సంవత్సరంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్ గారు 'కెసిఆర్ కిట్స్' ప్రారంభించి తద్వారా రూ.12,000/– ఆర్థిక సహాయం ఇవ్వడం జరుగుతోంది. ఆడబిడ్డ పుడితే రూ.12,000/– ఇస్తూ, అదనంగా రూ.1,000/– పెంచడం జరిగింది. ఇది ఒక మంచి పథకం. ఈ పథకం వలన అనేక మంది మహిళలు లబ్ధిపొందారు. ఈ కెసిఆర్ కిట్స్‌లో నాణ్యమైన వస్తువులు ఇస్తున్నారు. ఈ పథకం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీల సంఖ్య పెరుగుతున్నది.

ఈ సందర్భంగా నా ఆలోచన ఏమిటంటే, మన ప్రభుత్వ ఆసుపత్రులలో మెటర్నరీ వార్డులు ఎన్ని ఉన్నాయి? మెటర్నరీ వార్డులలో ఎన్ని బెడ్స్ ఉన్నాయి? లేబర్ వార్డులు ఎన్ని ఉన్నాయి? అలాగే ఈ సౌకర్యాలతోపాటు డాక్టర్లు, నర్సులను కూడా పెంచవలసిన అవసరం ఉన్నది. గతంతో పోలిస్తే ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీస్ ఎక్కువగా పెరుగుతున్నాయని నాకు తెలిసింది. నా నియోజక వర్గంలోని మహబూబ్‌నగర జిల్లాలో కూడా ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీస్ పెరుగుతున్నాయి.

12.20 మ. కాబట్టి, ప్రభుత్వ ఆసుపత్రులలో మంచి సౌకర్యాలు ఉన్నాయా? లేవా అనే విషయాలను కూడా చూడాలి. This kit alone will not save the girl child or a child. ఆ ఆసుపత్రులలో లేబర్ వార్డు పరిశుభ్రంగా ఉండడం, నార్మల్ డెలివరీ కానప్పుడు రెడీగా సిజేరియన్‌కు ఏర్పాట్లు ఉండేటట్లుగా చూడాలి. అన్ని జిల్లాలలో మహిళలు ప్రసవాలకు 102 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి, అవి ఎంత వేగంగా అందుబాటులోకి వస్తున్నాయి అనే విషయాలను కూడా పరిశీలించాలి.

ఇప్పుడే ప్రభుత్వం తరపున ఒక నోట్ కూడా రావడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య సెప్టెంబర్ 2017 నుండి జనవరి 2018 వరకు 47.2 శాతంగా నమోదైనాయి. చాలా మంది ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రుల వైపు మొగ్గు చూపుతారు. కాని ప్రభుత్వ ఆసుపత్రులలో ఇది హై డెలివరీస్ రేటుగా చెప్పవచ్చు. దీనిని కంటిన్యూ చేయడానికి అన్ని జిల్లాలలో ఆసుపత్రుల సంఖ్యను పెంచవలసిన అవసరం ఉంది. అదే విధంగా బ్రాండెడ్ వస్తువులైన టవల్, న్యాప్‌కిన్స్, పౌడర్స్ మొదలగు వస్తువులతో కూడిన కెసిఆర్ కిట్స్‌ను ఇవ్వడం మంచి ఒరవడిగానే చెప్పవచ్చు. ప్రసవాల కోసం కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందలేదని చెప్పడం జరిగింది. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు వస్తే వాటిని రూ.12,000లకు కలిపి ఇస్తారా? లేదా అదనంగా ఇస్తారా? అదే విధంగా ట్రైబల్ ఏరియాల లోని స్త్రీలు కూడా ఆసుపత్రులకు వెళ్లే విధంగా అంబులెన్స్ సౌకర్యం, మరియు నార్మల్ డెలివరీ లేదా సిజేరియన్లు చేయడానికి అనువుగా అన్ని సౌకర్యాలతో కూడిన ఆసుపత్రులకు వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఆదిలాబాద్ జిల్లా, భద్రాద్రి, జయశంకర్ భూపాల్ పల్లి జిల్లాల్లో tribalsలో శిశు మరణాల రేటు ఎక్కువగా ఉంది. అటువంటి ప్రాంతాలను గుర్తించి ప్రసవ మరణాలను తగ్గించాలని కోరుతున్నాను. కెసిఆర్ కిట్లను ఆ ప్రాంతాలలో ఎక్కువ సంఖ్యలో ఇచ్చే విధంగా చూడాలి. నిన్ననే గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పారు. constructive, positive ప్రతిపక్షాలు కావాలని చెప్పారు. ఖచ్చితంగా ఈ పథకాన్ని ఎవరూ కూడా వ్యతిరేకించేది లేదు. కాకపోతే కేంద్ర ప్రభుత్వం యొక్క ఆలోచనా సరళి కూడా ఇదే విధంగా ఉంది కాబట్టి, వారు దేశంలోని 657 జిల్లాలలో ఈ ప్రసవాలకు సంబంధించి రూ.6000లను ఇస్తామని ప్రకటించారు. వారు ప్రకటించిన ఆ 657 జిల్లాలలో మన తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలేవైనా ఉన్నాయా అని అడుగుతున్నాను. వెనకబడిన జిల్లాలలో కెసిఆర్ కిట్లు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి? ట్రైబల్ ఏరియాలలో, దళిత వాడలలో ఎక్కువగా ప్రసవ మరణాలు కనపడతాయి కాబట్టి, వారిని ఎంత వరకు రక్షించగలిగారు?

ఏది ఏమైనా ఇది ఒక మంచి పథకమనే చెప్పాలి. అందులో భాగంగా, 102 అంబులెన్స్ వాహనాలు సంఖ్యను పెంచితే ఇంకా ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరుగుతుందనేది నా అభిప్రాయం. కెసిఆర్ కిట్స్ తెలంగాణ రాష్ట్రంలో పుట్టిన పిల్లలకు బాగా ఉపయోగపడుతుందని భావిస్తూ కెసిఆర్ కిట్లు అనే అంశం మీద నాకు మాట్లాడే అవకాశాన్ని ఇచ్చినందుకు మరొక్కసారి ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి:–** అధ్యక్షా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక అద్భుతమైన పథకం ఈ కెసిఆర్ కిట్స్. దాని మీద మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు తమరికి ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. కెసిఆర్ కిట్స్‌లో చాలా మంచి వస్తువులు ఉన్నాయి. అవి ఇంతకు ముందు ఎప్పుడూ చూడని వస్తువులు ఉన్నాయనే అభిప్రాయం కూడా చాలా మందిలో వస్తున్నది. కెసిఆర్ పేరు మీద నడుస్తున్న ఈ పథకం భారతదేశంలోని

ప్రతి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో సహా మొత్తం సమాజం కూడా దీనిని తెలుసుకోవడానికి, దానిని అనుకరించడానికి ముందుకు వస్తున్నారు, ప్రశంసిస్తున్నారు.

గౌరవ ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు మరియు ఇతర అధికారులు ఈ పథకం గురించి చర్చిస్తున్నప్పుడు నాకు కూడా ఆ సమావేశంలో పాల్గొనే అవకాశం కలిగింది. అనేక గంటల పాటు చర్చించడం జరిగింది. దానిలో ఎంత మంది గర్భిణీ స్త్రీలు ప్రతి సంవత్సరం ప్రసవిస్తుంటారు? వారికి మనం ఏం చేయాలి? ఇప్పటి వరకు ఉన్న పరిస్థితి ఏమిటనే విషయాలను కూడా చర్చించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం దాదాపు 6 నుండి 6.5 లక్షల మంది గర్భిణి స్త్రీలు ప్రసవిస్తారని వారిలో 30 శాతం మాత్రమే ఆసుపత్రులకు వెళ్లడం జరుగుతుందని మిగిలిన 70 శాతం మంది ఇప్పటికీ పురాతన పద్ధతుల్లో, దైవం మీద ఆధారపడి ఆసుపత్రులకు రాకుండా నాటు పద్ధతుల్లో ప్రసవం జరుగుతున్న పరిస్థితులు జూన్, 2014 వరకు ఉన్నాయి. 30 శాతం అన్నా పెంచాలనే ఉద్దేశ్యంతో ముందుగా ప్రసవాలకు సంబంధించిన వ్యవస్థలో ఉన్న వారిలో అవేర్‌నెస్ తీసుకురావడానికి అంగన్‌వాడీలను, ANMలను, ఆక్సిలరీ మిడ్‌వైఫ్స్‌ను, కేంద్ర ప్రభుత్వ పథకంలో ఆశా వర్కర్లను నియమించి గర్భిణీ స్త్రీలను ఆసుపత్రులకు తీసుకొస్తే వారికి కొంత డబ్బులు ఇచ్చేటట్లుగా దాదాపు 45,000 మంది ఆశా వర్కర్లను నియమించారు.

గర్భిణీలకు ప్రసవానికి ముందు, ప్రసవం అప్పుడు, ప్రసవం తరువాత సంబంధిత కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమం మొత్తాన్ని కలిపి నేను కేసిఆర్ కిట్స్‌గా భావిస్తున్నాను. ఈ పథకం ప్రవేశపెట్టిన తరువాత దాదాపు 3 నుండి 4 లక్షల మంది వస్తారని చర్చలో అనుకోవడం జరిగింది. అప్పుడు గౌరవ ముఖ్యమంత్రిగారు దీనికి కావలసిన ఏర్పాట్లను చేసినట్లైతే ఈ రాష్ట్రంలో ప్రసవించే ప్రతి తల్లి కూడా ఆసుపత్రులకు రావడానికి ఆస్కారం ఉంటుంది, మీరు 2 లక్షలు అనుకుంటే 3 లక్షల మంది లేదా 30 శాతం ఉంటే 40 శాతం వరకు పెరుగుతుందని అనుకుంటున్నారు. అలా కాదు ఖచ్చితంగా ప్రతివారు - సంపన్నుల నుండి పేదవారి వరకు అర్బన్, రూరల్ అనే తేడా లేకుండా ఎక్కడ ఉన్నా కూడా ఆసుపత్రులకు వచ్చి రిజిస్ట్రేషన్ అయితే చేసుకుంటారని చెప్పడం జరిగింది. దానికి అనుగుణంగానే ఈనాడు 95 శాతం మంది రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగింది. దానిని బట్టి తెలంగాణాలోని ప్రతి తల్లికి నమ్మకం ఉందన్న విషయాన్ని ఈ రిజిస్ట్రేషన్ తెలియజేస్తున్నది. జూన్ 3, 2017న ప్రారంభించిన 9 నెలల కాలంలోనే దాదాపు 2 లక్షల మంది ప్రసవించడం జరిగింది.

ఎక్కడ డెలివరీ అవ్వాలి, టీకాలను ఎప్పుడెప్పుడు వేయించాలి వంటి విషయాల మీద గతంలో ప్లానింగ్ ఉండేది కాదు. కానీ ఇప్పుడు డెలివరీకి ఎక్కడికి వెళ్లాలి, ఏ టీకాలు వేయించుకోవాలి వంటి అన్ని విషయాలకు సంబంధించిన కార్డులను ప్రతి తల్లికి అందజేయడం జరుగుతోంది. ఆ కార్డు ఇవ్వడమే కాకుండా రిజిస్ట్రేషన్ మూడు నెలలప్పుడు చేయించుకున్నవారికి తల్లికి పరీక్ష చేసి హిమోగ్లోబిన్ 12 శాతం ఉండాలని, అంత కంటే తక్కువగా ఉంటే ఆ తల్లికి క్యాల్షియమ్ మరియు ఐరన్ మాత్రలను ఇచ్చి ఆ తల్లిని కాపాడే చర్యలను ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. గతంలో తల్లి, పిల్లల మరణాలు ఎక్కువగా జరిగేవి. ఈ చర్య వలన ఇద్దరూ రక్షించబడుతున్నారు. ఈ పరీక్ష చేయించకోవడానికి కూడా 102 అంబులెన్స్ సేవలను గర్భిణీ స్త్రీలు ఉపయోగించు కుంటున్నారు.

గతంలో కెసిఆర్ కిట్స్ ప్రవేశ పెట్టకముందు ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులలో సిజేరియన్లు జరిగేవి. కానీ నేడు అవి 55:45 ఉన్నట్లుగా నివేదికలు వచ్చాయి. నేను గమనించింది ఏమంటే 55 శాతం నార్మల్ డెలివరీలు అయితే 45 శాతం సిజేరియన్లు అవుతున్నాయి. అవి కూడా ఎందుకు అవుతున్నాయంటే మొదటి సారి సిజేరియన్ అయితే రెండవ సారి కూడా సిజేరియన్ కావలసిందే. సిజేరియన్లను తగ్గించడానికి అంటే స్త్రీల ఆరోగ్యాన్ని 40, 50 సంవత్సరాలు కాపాడటానికి ఈ కేసిఆర్ కిట్స్ పథకం అద్భుతంగా ఉపయోగపడుతుంది. అదే విధంగా టీకాలు వేయించుకోవాలంటే అశ్రద్ధతో వేయించుకోరు. కాని, మొదటిసారి రిజిస్ట్రేషన్ చేయించు కున్నప్పుడు ఎనీమియా పరీక్ష చేసి డబ్బులు ఇచ్చి, మరో మూడు నెలల తరువాత రెండవసారి రూ.4,000లు, 9వ నెలలో డెలివరీ అయిన తరువాత మరొక రూ. 4,000లతో పాటు ఆ కిట్ కూడా ఇవ్వడం ద్వారా ఒక ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పరుస్తున్నారు. టీకాలు వేయించుకోకపోతే అనేక జబ్బులు వస్తాయి. భారతదేశంలో 60 శాతం మాత్రమే టీకాలు వేయించుకుంటున్నారు. మిగతా 40 శాతం మంది వేయించుకోవడం లేదు. మిషన్ ఇంద్ర ధనుస్సు అనే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీని ద్వారా 29 రాష్ట్రాలలో 60 శాతం నుండి 100 శాతానికి తీసుకుపోవాలని ప్రధానమంత్రి మోదీగారు భావిస్తే బిజెపి పాలిత రాష్ట్రాలలో కంటే ఎక్కువగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

100 శాతం సాధించిందని గౌరవ మోదీగారు మన్‌కీబాత్ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ ఆ మోడల్‌ను కేంద్రం కూడా అనుసరించాలని చెప్పారు. ఈ విషయంలో మనం భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచాము.

భారతదేశంలో ప్రతి వెయ్యిమందిలో 34 మంది పిల్లలు చనిపోతున్నారు. దానిని Infant mortality rate అంటారు. అది National Average 34 % గా ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పుడు 39 శాతంగా ఉన్న Infant mortality rate, కేసిఆర్ కిట్స్ ప్రవేశపెట్టిన తరువాత 30 శాతానికి వచ్చింది. భారతదేశ వ్యాప్తంగా ఇది తగ్గినప్పటికీ, తెలంగాణా వచ్చిన తరువాత ఈ కేసిఆర్ కిట్స్ ప్రవేశ పెట్టడం వలన మన రాష్ట్రంలో ఇది మరింత తగ్గింది.

Maternal Mortality Rateను ప్రతి లక్ష మందికి లెక్క కడతారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రతి లక్ష మంది స్త్రీలు ప్రసవ సమయంలో 92 మంది తల్లులు చనిపోయేవారు. దానిని భారతదేశ వ్యాప్తంగా తీసుకుంటే 96 మంది చనిపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసిఆర్ కిట్స్ పథకం ప్రవేశపెట్టిన తరువాత MMR కూడా 70 శాతానికి తగ్గింది. ఇవన్నీ తగ్గించడంలో తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో మొదటి స్థానంలో ఉందని తెలియజేస్తున్నాను.

అదే విధంగా IP, OP సేవలలో భారతదేశంలో తమిళనాడు తరువాత మనం రెండవ స్థానంలో ఉన్నాము. ఆ విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం వారు మన అధికారులకు, ప్రభుత్వానికి అవార్డ్ ఇచ్చారు. అధికారులు, గౌరవ ఆరోగ్య శాఖా మంత్రిగారు అభినందనీయులు. ఎందుకంటే ఒకదాని తరువాత ఒకటి అద్భుతమైన రికార్డులను నెలకొల్పుతున్నారు. ఇవన్నీ భారతదేశంలో ఉండే ఒక రాష్ట్రానికి వచ్చిన విజయాలు కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యం ఎట్లా ఉంది, అభివృద్ధికరమైన రాష్ట్రం ఎట్లా ఉందని చెప్పినప్పుడు అనేక parametersను చూడడం జరుగుతుంది. అందులో IMR కాని, MMR కాని, లేదా Female literacy rate వంటి అంశాలలో, ప్రపంచవ్యాప్తంగానే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణను చెప్పవచ్చు. ఈ jet speed తో పోవడానికి కారణం ఈ కేసిఆర్ కిట్స్ చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నదని చెప్పవచ్చు.

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 6,50,000 మంది రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. సంపన్న వర్గాలు లేదా అవసరం లేని వారు కూడా ఈనాడు రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రసవం వేరే చోట జరిగినా టీకాల కోసం మాత్రం ప్రభుత్వ ఆసుపత్రులకే వస్తున్నారు. ఎందుకంటే 9, 10 జిల్లాలలో అద్భుతమైన mother and child hospitals ఏర్పాటు చేశారు. చాలా ఆసుపత్రులలో బెడ్స్ జనరల్ వార్డ్‌లోనే ఎక్కువగా ఉంటాయి కాబట్టి, కొంత మంది రిజిస్ట్రేషన్ చేయించుకొని ఇక్కడికి రావడం లేదు. డెలివరీ వేరే చోట చేయించుకొని 3వ మరియు 6వ నెలలో ఇక్కడికి వస్తున్నారు. అంటే ఏదో విధంగా ఇక్కడ ఉన్నవారందరూ కూడా కేసిఆర్ కిట్స్ పథకంలో భాగం అవుతున్నారు.

12.40 మ. డెలివరికి గాని, టెస్టులకు గాని, ఏదో విధంగా ఖచ్చితంగా ప్రభుత్వ ఆసుపత్రికి రావడం జరుగుతున్నది. అంటే తెలంగాణలో ఉండే ప్రతి తల్లి కూడా కేసిఆర్ కిట్స్ పథకాన్ని టచ్ చేయకుండా ఉండడం లేదు. ఇవి కేసిఆర్‌గారి కిట్స్‌లో ఉన్న అనేక అద్భుత లక్షణాలలో కొన్ని అంశాలు.

ఇప్పటికే ఈ పథకం క్రింద కేవలం తొమ్మిది నెలల కాలంలోనే ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి నాదొక విజ్ఞప్తి. అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండుసార్లు జీతాలు పెంచడం జరిగింది. అదే విధంగా మహిళల్లో అవేర్‌నెస్ కల్పించి, ఆసుపత్రులకు తీసుకువచ్చే ఆశా వర్కర్లకు కూడా ఒకసారి జీతాలు పెంచారు. వారికి రెండవ సారి కూడా జీతాలు పెంచుతామని ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు విన్నాం. అలాగే ANMలు ఉన్నారు. వారిలో రెగ్యులర్ ANMలతో పాటు, సెకండ్ ANMలు కూడా ఉంటారు. యూరోపియన్ ANMలు కూడా ఉన్నారు. వారు యూరోపియన్ కమీషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నియామకం చేసి, తరువాత వారిని పట్టించుకోకుండా, వదిలివేయడం జరిగింది. సెకండ్ ANMలు కూడా మేము కూడా వారితో సమానంగా పని చేస్తున్నాము, ఎందుకు మాకు తక్కువ జీతాలు ఇస్తున్నారని అడుగుతున్నారు. అది ఒక అంశం పెండింగ్‌లో ఉంది. ఈ విషయంలో మంత్రిగారు, అధికారులు సానుకూలంగా ఉన్నారు. రాబోయే ఏప్రిల్ నుండి వారి జీతాలు పెంచినట్లయితే ఈ పథకం మరింత విజయవంతం కావడానికి ఆస్కారం ఉంది. ఇప్పటికే ఈ పథకం విజయవంతం అయినప్పటికీ, వాళ్లను కూడా తృప్తి పరచవలసిన అవసరం ఉంది. కాబట్టి, ఈ ఫస్ట్ ఏప్రిల్ నుండి వారి జీతాలు పెంచవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రిగారికి తమరి ద్వారా నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

అదే విధంగా వారికి ఈ మధ్య రెండు అవార్డ్స్ వచ్చినట్లు

చూశాను. కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా, కోల్‌కతా వారు మన శిశు సంక్షేమ శాఖకు ఇటీవల ఒక అవార్డును ప్రదానం చేయడం జరిగింది. ఎందుకంటే మా విద్యా సంస్థలకు కూడా Best HoD and Best Student అవార్డు వచ్చిన సందర్భంగా అక్కడికి వెళ్లినప్పుడు వాళ్లు మన రాష్ట్ర ప్రభుత్వం తరపు నుండి అవార్డు అందుకోవడానికి వచ్చినట్లు చెప్పారు. అదే విధంగా స్కాచ్ అఛీవర్ అవార్డు కూడా వచ్చినట్లు తెలిసింది. ఈ విధంగా అనేక అవార్డులతో పాటు ప్రధాన మంత్రిగారు తమ మన్‌కీ బాత్ కార్యక్రమంలో చెప్పడం ద్వారా మనకు వచ్చిన ప్రశంసలతో పాటు, రెండు రోజుల క్రితం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు కూడా తమ రాష్ట్రంలో ఇటువంటి కార్యక్రమాన్ని అమలు చేస్తామని, అందుకు వారు కూడా రూ.12,000 ఖర్చుతో ఈ కిట్స్‌ల పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

ఇలా అనేక రాష్ట్రాలు ఇది చాలా అద్భుత కార్యక్రమం అని ప్రకటించడం, వాళ్లంతా ఇక్కడకు రావడం, మన టెక్నాలజీని అడిగి తెలుసుకోవడం జరుగుతున్నదని పేపర్లలో చూశాను. అంతే కాకుండా కేంద్ర బడ్జెట్‌లో ఒక అద్భుతమైన పథకాన్ని ప్రవేశపెడుతున్నామని చెప్పారు. దానికి ఇంకా విధి విధానాలు రూపొందించలేదు. అవి ఏ విధంగా ఉండాలని ఆలోచిస్తూ, 29 రాష్ట్రాలను పరిశీలిస్తున్న క్రమంలో వారికి మన తెలంగాణ రాష్ట్రంలో అమలుచేస్తున్న పథకం బాగుందని తెలుసుకుని, వారంతా ఇక్కడకు రావడం జరిగింది. ఈ సందర్భంగా వాళ్లు తెలంగాణ మోడల్‌ని, తెలంగాణ సాఫ్ట్‌వేర్‌ని, తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పద్ధతులను అనుసరిస్తామని, అందుకు మన ప్రభుత్వం యొక్క సహకారం కోరడం జరిగిందని మంత్రిగారు నిన్న ఇక్కడ చెప్పారు. అది మనకు గర్వ కారణం. మనం ఉపయోగించే విధానాలు మిగతా రాష్ట్రాలు, ప్రభుత్వాలు, అధికారులు అనుసరిస్తున్నారంటే చాలా అభినందనీయం. ఇన్ని కోణాలు కలిగిన ఈ అద్భుతమైన పథకాన్ని నిజంగా అభినందించాల్సిందే.

ఈ పథకం ఆరోగ్యవంతమైనది, అందరికీ లాభం కలిగించేది అయినప్పటికీ, ఇందులో సామాజిక కోణానికి సంబంధించిన అంశాలు కూడా ఇమిడి ఉన్నాయి. ఒకటి – మొదటి కాన్పు అంటే సాధారణంగా తల్లి దగ్గర, స్వంత ఊరిలో జరుగుతుంది. తల్లి తన కూతురు ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకుంటుందనే ఒక నమ్మకం. రెండవది– ఆర్థిక కోణం. ప్రస్తుత పరిస్థితుల్లో దీని ప్రభావం తగ్గిపోయింది. ఎందుకంటే ఈ రోజుల్లో ఎవరూ ఖర్చు పెట్టవలసిన అవసరం లేదు. ప్రభుత్వమే వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్నది కాబట్టి. అత్తగారు కూడా నువ్వు ఇక్కడే హాయిగా ఉండు బిడ్డా అని కోడలితో చెబుతుంది. ఇంతకుముందు లేని మంచి రిలేషన్, ప్రేమ అనేది ఇప్పుడు పెరగడానికి కారణమవుతుంది.

కాబట్టి ఈ కెసిఆర్ కిట్స్ పథకం వల్ల అత్తా, కోడళ్ల మధ్య ఉండే వైరుధ్యాలు తగ్గిపోయి, ప్రేమ భావం పెరగడానికి దోహదపడుతున్నదని నా భావన. ఈ రోజు తొడుగుతున్న చిగురు రాబోయే రోజుల్లో ఖచ్చితంగా పెరుగుతుంది. డెలివరీ సమయంలో గ్రామీణ మహిళలు తమ కూలి ద్వారా వచ్చే ఆదాయాన్ని పోగొట్టుకుంటున్నామని బాధపడేవాళ్లు. తొమ్మిదవ నెలలో కూడా కూలికి వెళితే ఎందుకు వచ్చావని చాలామంది సానుభూతిగా చూసేవాళ్లు. కూలికి వెళ్లకపోతే ఇంట్లో పోరు. దానిని గమనించి మన ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. వారికి డెలివరీకి ముందు మూడు నెలలు, తరువాత మూడు నెలలు పని చేయవలసిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వారికి ఆ మేరకు ఆర్థిక సాయం అందజేస్తున్నదంటే, సమాజం ఒక ప్రభుత్వం నుండి ఇంతకంటే ఏమి కోరుకుంటుంది?

మూడవ అంశం– ఈ రోజు సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య బాగా తగ్గిపోయింది. దాని వలన మహిళల ఆరోగ్యం మెరుగవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రులలో సిజేరియన్ ఆపరేషన్లు అంత త్వరగా చెయ్యరు. నొప్పులు వస్తుంటే, కొంచెం ఓపిక పట్టమని కొంచెం కోపగించుకుంటారు. కాని ఆ కోపం వల్ల లాభం జరుగుతుంది. మహిళలు ఆరోగ్యంగా ఉండడానికి అది ఉపయోగపడుతుంది.

కాబట్టి ఈ మూడు కోణాలు– ఐఎంఆర్ కావచ్చు, ఎంఎంఆర్ కావచ్చు ఇవన్నీ తగ్గిపోతాయి, అనేక మంది కెసిఆర్ కిట్స్ పరిధిలోకి రావడం వలన మహిళల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ పథకం ప్రతి స్త్రీని తడిమింది, వారి ప్రేమను చూరగొన్నదని కాబట్టి దీనిని ప్రవేశపెట్టిన గౌరవ ముఖ్యమంత్రిగారికి నా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, మాట్లాడటానికి అవకాశం ఇచ్చిన మీకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను. జై తెలంగాణ.

**శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి:–** అధ్యక్షా, మన గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రతి తెలంగాణ ఆడపడుచు ఆరోగ్యవంతంగా ఉండాలనే మంచి ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేయడం జరిగింది. అందుకు వారిని నేను అభినందిస్తున్నాను. అదే విధంగా ఈ కార్యక్రమాన్ని

సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు వైద్య, ఆరోగ్య శాఖామాత్యులను అభినందిస్తున్నాను. ఈ కెసిఆర్ కిట్స్ అనే పథకం ప్రారంభించిన రోజున నేను కూడా అందులో పాల్గొన్నాను. ఆ రోజు మన వైద్య, ఆరోగ్య శాఖామాత్యులు కూడా మాతో ఉన్నారు. గతంలో మనం ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే జేబులోంచి కర్చీఫ్ తీసి, ముక్కుకి అడ్డుపెట్టుకుని వెళ్లవలసిన పరిస్థితి. అటువంటి దుర్భర పరిస్థితులు ఆనాడు ఉండేవి. కాని నేడు తెలంగాణలో ఆ పరిస్థితి లేదు.

ఈ పథకం ప్రారంభోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆశ్చర్యానికి గురయ్యాను. ఇది కార్పొరేట్ ఆసుపత్రి కాదు కదా అనిపించింది. అంత పరిశుభ్రంగా దానిని తీర్చిదిద్దారు. అదే విధంగా ప్రభుత్వ వైద్య వ్యవస్థను కూడా తీర్చిదిద్దుతున్నందుకు ఈ ప్రభుత్వాన్ని నేను అభినందిస్తున్నాను. క్రిటికల్ కేసులను కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో చాలా చక్కగా చేస్తున్నారు. దాని వలన ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రులకు ఆదరణ పెరిగింది. గతానికి ఇప్పటికీ తేడా చాలా స్పష్టంగా కనబడుతున్నది. ముఖ్యంగా ఈ కెసిఆర్ కిట్స్‌లను ప్రవేశపెట్టినప్పటి నుండి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య 51 శాతం పెరగడం ఒక శుభసూచకం.

నా తెలంగాణ బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉండాలి, ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఎదగాలి అనే ఒక మంచి సంకల్పంతో ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్‌గారు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేయడం జరిగింది. ఇందాక సభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డిగారు చెప్పినట్లు గతంలో పేద గర్భిణీ స్త్రీలు ప్రసవానికి ఒకటి, రెండు రోజుల ముందు వరకు కూలి పనులకు వెళ్లేవారు. అలాంటి కష్టం నా తెలంగాణ ఆడపడుచులకు రాకూడదని, వారి సంరక్షణ బాధ్యత ప్రభుత్వం స్వీకరించి, పేరు నమోదు చేసుకున్నప్పటి నుండి వారికి విడతల వారీగా నాలుగు వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నది. ఆడపిల్ల పుడితే మరొక వెయ్యి రూపాయల అదనపు సాయం ఇవ్వడం జరుగుతుంది. నిజంగా ఇదొక బృహత్తర కార్యక్రమం. ఇప్పటివరకు రెండు లక్షల ప్రసవాలు మరియు 3263 క్రిటికల్ డెలివరీలను ప్రభుత్వ ఆసుపత్రులలో చేసిన విషయం గురించి కూడా ఈ రోజు మనం గమనించాలి.

ఈ కెసిఆర్ కిట్స్ ద్వారా అందించే మొత్తం 16 వస్తువులు మధ్యతరగతి వారు కూడా కొనలేనివి. కాని బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కెసిఆర్‌గారు ఒక కిట్స్‌ను ఆవిష్కరించి అందులో- బేబీ సోప్స్, ఆయిల్, పౌడర్, న్యాప్‌కిన్, ఆటబొమ్మలు, దోమ తెర వంటి వస్తువులతో జాన్సన్ అండ్ జాన్సన్ వంటి పేరున్న బ్రాండెడ్ కంపెనీ ఉత్పత్తులను వారికి ఈ కెసిఆర్ కిట్స్ ద్వారా ఇవ్వడం జరుగుతున్నది అంటే భావి తరాల మీద కెసిఆర్‌గారికి ఉన్న మక్కువ ఏమిటో మనకు తెలుస్తున్నది. అందుకే మన రాష్ట్రంలో శిశు మరణాల రేటు జాతీయ స్థాయి కంటే కూడా తక్కువగా ఉన్న విషయాన్ని మనం ఆలోచన చెయ్యవలసిన అవసరం ఉంది. గతంలో మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వెయ్యికి ముప్పై తొమ్మిది శిశు మరణాలు జరిగేవి. కాని నేడు ఆ శిశు మరణాల సంఖ్య ముప్పైకి తగ్గింది అంటే మన ప్రభుత్వం చేసే కార్యక్రమాల ఫలితమే అని మనవి చేసుకుంటున్నాను.

అదే విధంగా అమ్మ ఒడి అనే కార్యక్రమం. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా 102 నెంబర్‌కి ఫోన్ చేస్తే, వెంటనే తీసుకువెళ్లి, ఆసుపత్రిలో అడ్మిట్ చేయించి, డెలివరీ తరువాత ఇంటికి చేర్చే విధంగా ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 241 మల్టీ యుటిలిటీ వెహికిల్స్‌ని జిపిఎస్‌తో అనుసంధానం చేయడం అలాగే ప్రతి జిల్లాకు కూడా 6 నుండి 8 వాహనాలు అందుబాటులో ఉంచి, ఎవరూ సమయానికి వైద్యం అందకుండా మరణించే సందర్భాలు ఈ తెలంగాణ రాష్ట్రంలో కనిపించవద్దనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినందుకు ముఖ్యమంత్రిగారిని అభినందిస్తున్నాను.

ఇప్పటికే మొత్తం 1,86,000 కెసిఆర్‌గారి కిట్లను పంపిణీ చేసిన సందర్భాన్ని మనం గుర్తు చేసుకోవలసిన అవసరం మరియు ఆవశ్యకత ఉంది. ఇదొక మంచి పథకం. ఎందుకంటే ఏ బీదవాళ్లు గాని ప్రసూతి సమయంలో ఇబ్బంది పడవద్దు, ఏ తెలంగాణ బిడ్డ అనారోగ్యం పాలు కాకూడదనే ఉద్దేశంతో శిశువు పుట్టినప్పుడు వేసే టీకాలు గాని, బిడ్డ కడుపులో పడినప్పటి నుండి పుట్టే వరకు ఒక కేర్ టేకర్‌గా పనిచేస్తున్న ఈ ప్రభుత్వాన్ని మరియు మంత్రిగారిని, వారి సిబ్బందిని నేను అభినందిస్తున్నాను. ఇదొక మంచి కార్యక్రమం. ఇతర రాష్ట్రాల నుండి కూడా అధికారులు మన దగ్గరకు వచ్చి, ఈ కెసిఆర్ కిట్స్ ఏమిటి, ఇందులో ఉండే వస్తువులు ఏమిటి అని పరిశీలించి పోతున్నారు. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రం మొత్తం దేశానికి ఆదర్శవంతంగా నిలిచే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రభుత్వానికి నా అభినందనలు తెలియజేసుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ సభావత్ రాములు నాయక్:-** అధ్యక్షా, ఈ కెసిఆర్

కిట్స్ అనే అంశం పై మాట్లాడేందుకు అవకాశమిచ్చినందుకు ముందుగా తమకు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అదే విధంగా సభలో ఉన్న ఆర్థిక శాఖామాత్యులు, వైద్య శాఖామాత్యులు మరియు హోం మినిస్టర్‌గారికి కూడా నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

ఈ కెసిఆర్ కిట్స్ అనే పథకం భారతదేశంలో ఎక్కడా, ఏ రాష్ట్రంలోనూ, ఏ ముఖ్యమంత్రి అమలుచెయ్యనటువంటి గొప్ప పథకం. చిన్న రాష్ట్రమైనా, 29వ రాష్ట్రమైనా సంక్షేమ పథకాల అమలులో నెంబర్ వన్‌గా ఉండాలనే ఉద్దేశంతోటి ఈ పథకం అమలు చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అవుతున్నా అనేక ప్రభుత్వాలు మారినాయి తప్ప, ఏమీ జరగలేదు. ప్రస్తుతం ఈ కెసిఆర్‌గారి కిట్స్ పథకం తరువాత అనేక రాష్ట్రాలు ఆలోచనలో పడ్డాయి.

గిరిజన ప్రాంతాలలో పరిస్థితులు నాకు బాగా తెలుసు. డెలివరీ కొరకు తల్లిని ఎడ్లబండి మీద ఆసుపత్రికి తీసుకుపోతుంటే, గుంతల మార్గంలో వెళ్లడం వలన నొప్పులు ఎక్కువయ్యేవి. ఆ రకంగా త్వరగా డెలివరీ జరిగేది. కొంతమంది తల్లులు చనిపోయే సందర్భాలు కూడా ఉండేవి. కాని ఈ కెసిఆర్ కిట్స్ జూన్ 2, 2017 నుండి అమలులోకి వచ్చినప్పటి నుండి బడుగు, బలహీన వర్గాలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉండే కుటుంబాలలో ఆ రోజు నుండి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లయింది. కెసిఆర్ కిట్స్ అంటే మొదట నాకు అర్థం కాలేదు. తొలుత రెండు లక్షలో, లక్షా యాభై వేల మందో అనుకున్నాము. కాని ఇందాక మంత్రిగారు అందుకు సంబంధించిన గణాంకాలు చెప్పిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రులలో ఎంత బ్రహ్మాండంగా డెలివరీలు జరుగుతున్నాయో బోధపడింది. అంతకుముందు ఎవరూ సర్కారీ దవాఖానాకు వెళ్లేవారు కాదు. గిరిజన ప్రాంతాలలో అయితే, మంత్రసాని వచ్చి, పురుడు పోసి, వెళ్లేది. ఆ మారుమూల గిరిజన గ్రామానికి మంత్రసాని రావడం ఆలస్యమయితే తల్లి చనిపోవడం కూడా జరిగేది.

1.00 మ. కెసిఆర్ కిట్స్ వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ ఒక అవేర్‌నెస్ వచ్చింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆసుపత్రికి వెళ్లి చెక్ చేయించుకుంటే ఆరోగ్య పరిస్థితి, రేపు డెలివరీ ఏవిధంగా ఉంటుందో తెలుస్తుందనే అవగాహనతో గర్భిణీలున్నారు. ఇంతకు ముందు గిరిజన గూడేలు, తండాల వాళ్లు అసలు దవాఖానాకి వెళ్లే వారు కాదు. నాటు వైద్యం, నాటు మందుతో సరిపెట్టుకునే వారు. ప్రభుత్వం ఇచ్చే రూ.12 వేలు, రూ.15 వేల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు పోవడం లేదు, వాళ్లకు ఒక అవేర్‌నెస్ వచ్చింది. ఇంతకు ముందు నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు అనే వాళ్లు. కెసిఆర్ కిట్స్ వచ్చిన తర్వాత – నేను వస్త బిడ్డో కెసిఆర్ కిట్స్‌కు అనే గర్భిణీ మహిళలు మన ముందు కనిపిస్తున్నారు.

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో, మిగతా పొరుగు రాష్ట్రాలలో కూడా స్కీములు అమలవుతున్నాయి కానీ ఇటువంటి బ్రహ్మాండమైన కిట్స్ ఎక్కడా ఇవ్వడం లేదు. 15, 16 వస్తువులతో కూడిన కిట్‌లో జాన్సన్ అండ్ జాన్సన్ పౌడరు, మచ్చర్‌దాన్ తదితర నాణ్యమైన వస్తువులుంటాయి. నాకు 20 సంవత్సరాల క్రితం మచ్చర్‌దాన్ దొరక లేదు. కానీ నేడు పుట్టిన బిడ్డకు కూడా మచ్చర్‌దాన్ ఇస్తున్నారు. తండాలలో కరెంటు లేక, చీకట్లో దోమలు కుడుతుంటే వాటిని తోలుకుంటూ పడుకునే వాళ్లం. తండాలలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో, దోమలు కుట్టితే ఏవిధంగా అనారోగ్యానికి గురయ్యే వాళ్లమో మాకు తెలుసు.

ఈరోజు కొంత మంది ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతూ, దవాఖానాలలో బెడ్స్ సరిపోవడం లేదు, గర్భిణీలను నేల మీద పడుకోబెట్టి కాన్పులు చేస్తున్నారని అన్నారు. కానీ ఈరోజు ఏవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయో, ఏవిధంగా సిజేరియన్లు తగ్గాయో కూడా ఒకసారి ఆలోచించవలసిందిగా కోరుతున్నాను. ఏదో పేపర్లో వచ్చినంత మాత్రాన, రాష్ట్రంలో లేదా జిల్లాలలో ఆవిధంగా ఉంటోందని చెబుతున్నారు. అధ్యక్షా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండే డాక్టర్లకు దండం పెట్టాలి. ఎందుకంటే కెసిఆర్ కిట్స్ వచ్చిన తర్వాత నేను నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గంలో ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి పర్యటించి అక్కడ హాస్పిటల్స్ ఏవిధంగా పని చేస్తున్నాయో పరిశీలిస్తాను. ఎన్ని డెలివరీస్ జరిగాయి, అందులో నార్మల్ ఎన్ని, సిజేరియన్ ఎన్ని అని పరిశీలిస్తే 95 శాతం నుంచి 98 శాతం వరకు నార్మల్ డెలివరీస్ జరిగినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ డాక్టర్లకు ఈ సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను, చేతులెత్తి దండం పెడుతున్నాను. అంతకు ముందు ఏమయ్యేదంటే, బాలింత రోగం వచ్చి చనిపోయారని చెప్పేవారు. డెలివరీ అయిన తర్వాత సరిగా ట్రీట్‌మెంటు లేక, బాలింతకు సరైన పౌష్టికాహారం లేక, నెత్తురు తక్కువై, సరైన సౌకర్యాలు లేక చనిపోయేవారు. కానీ 2017, జూన్ 3 న ఈ కెసిఆర్ కిట్స్ వచ్చిన తర్వాత, మంత్రివర్యులు శాఖ మీద పట్టు

సాధించిన తర్వాత, వేరే రాష్ట్రాల ప్రభుత్వాలు ఆలోచనలో పడ్డాయి. తెలంగాణాలో ఏవిధంగానైతే కిట్లు, గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తున్నారో ఆవిధంగా మేము కూడా స్కీమును అమలు చేయడానికి ప్రయత్నిస్తామని అంటున్నారు. నేను మొన్న కర్ణాటకకు వెళ్లాను. అక్కడ నాకు చాలా మంది మిత్రులున్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, కౌన్సిల్‌లో ఎమ్మెల్సీలు పది, పన్నెండు మంది తెలిసిన వాళ్లున్నారు. వాళ్లు మన పథకం గురించి ఆరా తీశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చిన్న రాష్ట్రమైనా మీ ముఖ్యమంత్రి గారు బ్రహ్మాండంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని ప్రశంసించారు.

ఇంతకు ముందు డెలివరీ అంటే జచ్చఖానా దావఖానాకు లేదా నీలోఫర్ హాస్పిటల్‌కి వెళ్లేది. కానీ ఈరోజు హెల్త్ సెంటర్లలోనే పేర్లు నమోదు చేసుకొని అవసరమైన సేవలు పొందుతున్నారు. ఇంతకు ముందు ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఎక్కడికి పోయినా సిజేరియన్ తప్ప నార్మల్ డెలివరీ జరిగే పరిస్థితి లేదు. రాష్ట్రం ఏర్పడక ముందు ఒక డెలివరీ జరిగితే రూ.30 వేల నుంచి రూ. 80 వేల వరకు ప్రైవేటు హాస్పిటల్స్ ఫీజు వసూలు చేసిన రోజులు చూశాం. ఇంతకు ముందు మిత్రులు రాజేశ్వర్ రెడ్డిగారు చెప్పినట్లు, ఒకవేళ ప్రైవేటు హాస్పిటల్‌లో డెలివరీ అయినా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పిల్లలకు టీకాలు తీసుకునే విధంగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రతి గర్భిణీ స్త్రీ ఎక్కడ ఉందో, ఏ గ్రామంలో ఉందో, ఏ తండాలో ఉందో, ఏ గిరిజన గూడెంలో ఉందో, ఏ బిసి వాడలో ఉందో, ఏ ఎస్సీ వాడలో ఉందో ఆశా వర్కర్లు సమాచారం తీసుకొని, వారిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లే విధంగా ఒక అవేర్‌నెస్ ఈ కెసిఆర్ కిట్స్ వల్ల ఏర్పడింది. అంతకు ముందు ప్రభుత్వాలు చేసి ఉండొచ్చు. కానీ ఇటువంటి మంచి కార్యక్రమం హెల్త్ సెక్టారులో టేకప్ చేసి ఉంటే బాగుండేది.

మొన్న నేను బస్సులో వస్తుంటే ఒక విషయం విన్నాను. ఆర్టీసి, సింగరేణి కార్మికులకు కూడా ఈ కెసిఆర్ కిట్స్ పథకాన్ని వర్తింపజేస్తున్నారని ఒక మహిళ అన్నది. మాకు కూడా ఈ కెసిఆర్ కిట్స్ వస్తోంది అంటే, కిట్స్ గురించే చూస్తున్నావా అని నేనంటే, లేదు మాబిడ్డ హాస్పిటల్‌లో ఉంది, మాకు కూడా వస్తుందంటే చాలా సంతోషం కదా అన్నది. కాబట్టి ఈరోజు కెసిఆర్ కిట్స్ గురించి కార్మిక వర్గం కూడా ఎదురుచూస్తోంది.

డబ్బులు ఖర్చు పెట్టుకోలేని బడుగు బలహీన వర్గాలు వారు ఎవరైతే ఉన్నారో, అడ్డాల మీద ఉండి కూలీ నాలీ చేసుకునే వాళ్లు ఎవరైతే ఉంటారో వాళ్లకి కెసిఆర్ కిట్స్ మీద నమ్మకం ఏర్పడింది. కూలీ కోసం ఉదయం 8 గంటలకు అడ్డా మీదకు పోయే మహిళ, తాను గర్భవతి అయిన తర్వాత నేను ప్రభుత్వాసుపత్రికి పోవాలి, ట్రీటుమెంటు తీసుకోవాలి అని లేబర్ పని చేస్తున్న వారు కూడా ఈరోజు కెసిఆర్ కిట్ల గురించి మాట్లాడడం చాలా సంతోషకరమైన విషయం. కెసిఆర్ కిట్లే గాకుండా కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రెసిడెన్షియల్ స్కూల్స్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు కాబట్టే ఒక్క తెలంగాణ ప్రజలే కాదు, మొత్తం భారతదేశ ప్రజానీకంచే గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రశంసలు పొందుతున్నారు. చిన్న రాష్ట్రమైనా, కొత్తగా ఏర్పడిన 29 రాష్ట్రమైనా ఏవిధంగా అభివృద్ధి దిశలో పోతున్నామో మీకు తెలిసిన విషయమే. కెసిఆర్ కిట్స్ పథకాన్ని తెలంగాణాలో అమలు చేసిన తర్వాత, భారతదేశంలో కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాంచల్, జార్కండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆలోచనలో పడ్డారు.

అధ్యక్షా, గతంలో రక్షిత తాగునీరు దొరికేది కాదు. గిరిజన ప్రాంతాలలో మహిళలు ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లి తాగునీరు తెచ్చుకునే పరిస్థితి ఉండేది. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత గిరిజన తండాలు, గూడాలలో, బిసి వాడలలో బ్రహ్మాండంగా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం. ఆదిలాబాదులో సీజన్లో ఆగస్టు, సెప్టెంబర్లో వర్షాలు పడితే, సరైన తాగునీరు దొరకక, కురిసిన వాన నీటినే తాగడం మూలంగా ప్రజలు పిట్టలు రాలినట్లు రాలిపోయేవారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎటువంటి తాగునీరు అందిస్తోందో, గర్భిణీ స్త్రీలకు ఎటువంటి పౌష్టికాహారం అందిస్తోందో మనం చూస్తున్నాం. కెసిఆర్ కిట్స్ మీద మాట్లాడడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ, సభలో ఉన్న హెల్త్ మినిస్టర్‌గారు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ, అదే విధంగా ఫైనాన్స్ మినిస్టర్ గారు మా అభివృద్ధికి బాగా నిధులు ఇవ్వాలని కోరుతూ, హోం మినిస్టర్ గారు కూడా సభలో ఉన్నారు కాబట్టి ఈ ముగ్గురు మంత్రులు ఈరోజు సభలో ఉన్నందుకు సభాపక్షాన వారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ ఎలిమినేటి కృష్ణారెడ్డి (శాసనసభ నియోజక వర్గం):-** అధ్యక్షా, మన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గారు కెసిఆర్ కిట్స్ పథకాన్ని ప్రారంభించి 9 నెలల 20 రోజులు కావస్తోంది. పేద ప్రజలకు భారం పడకుండా

ఉండాలనే ఒక సదుద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. అయితే ఈ పథకం పూర్తి స్థాయిలో విజయవంతం కావాలంటే మనం కూడా గ్రామాల్లోకి వెళ్లి ప్రచారం చేసి, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా మనం పూనుకోవలసిన అవసరం ఉంది. ఏ తల్లికైనా మొదటి కానుపు పునర్జన్మగా భావిస్తారు. సామాన్యంగా మొదటి కానుపుకి ప్రభుత్వాసుపత్రికి వెళ్లమంటే ఎంత పేద వాళ్లయినా ఒప్పుకోరు. నాకు ఎప్పుడూ చాలా దగ్గరగా ఉండే వాళ్లకు సంబంధించి ఒక నెల క్రిందట జరిగిన విషయం చెబుతాను. వాళ్లది ఫస్ట్ డెలివరీ. నేను చెప్పాను, కెసిఆర్ కిట్స్ పథకం ఉంది కదా, ప్రభుత్వాసుపత్రికి వెళ్లమన్నాను. వాళ్లు నమ్మలేదు. ప్రైవేటు హాస్పిటల్‌కి వెళ్లి డెలివరీ చేయించుకోవడం జరిగింది. అంటే దీనికి కారణం – ప్రజలకు ప్రభుత్వాసుపత్రుల పైన సరైన విశ్వాసం, నమ్మకం లేదని నేను అనుకుంటున్నాను. 1979 లోనే నా కూతురిని ప్రభుత్వాసుపత్రిలో డెలివరీ కోసం చేర్చడం జరిగింది. కానీ దురదృష్టవశాత్తు ఆమె చనిపోయింది. కారణమేమని తెలిసిందంటే – అంతకు ముందు అయిన ఒక డెలివరీ కేసుకు వాడిన పరికరాలను శుభ్రం చేయకుండా, రెండో కాన్పుకి కూడా అవే ఉపయోగించారు కాబట్టి ధనుర్వాతం వచ్చి, 20 రోజులు హాస్పిటల్‌లో ఉండి చనిపోవడం జరిగింది. అందుకే ఫస్ట్ డెలివరీకి గర్భిణీని ఏ అమ్మ కానీ, ఏ అత్త కానీ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లడానికి చాలా వెనుకంజ వేస్తారు, భయపడతారు. డబ్బులు లేక నాబిడ్డను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ఆగం చేసిందని ఆ గర్భిణీ తల్లి అంటుందని అత్తకు ఒక భయం. ఆ అపవాదు నాకెందుకని ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లడం లేదు.

మా భువనగిరిలో ఏరియా హాస్పిటల్ ఉంది, కానీ డాక్టర్స్ లీవులో వుంటారు, హైదరాబాదులో ఉంటారు. వైద్యులు కానీ, ముఖ్యంగా శాంతిభద్రతలకు సంబంధించిన సిబ్బంది గానీ ఖచ్చితంగా హెడ్ క్వార్టర్స్‌లో ఉండవలసిన అవసరం ఉంది. అనుకోకుండా డెలివరీ కేసులు వచ్చినపుడు అక్కడ డాక్టర్ ఉండడు. ఎవరో నర్సులుంటారు, ఏదో చేస్తారు. దాని వల్ల ప్రభుత్వాసుపత్రుల పట్ల నమ్మకం పోయి ప్రైవేటు హాస్పిటల్స్ వైపు మొగ్గు చూపడం జరుగుతోంది. ఎలాగూ డబ్బులు వస్తాయి కాబట్టి, ప్రైవేటు హాస్పిటల్స్ వాళ్లు నిమిషాల మీద, గంటల మీద చేస్తారు, అవసరమైతే హైదరాబాదుకు ఫోను చేసి డాక్టర్లను రప్పించి డెలివరీలు చేసే అవకాశాలున్నాయి. భగవంతుడు మనల్ని సృష్టించాడు. మరి రెండో భగవంతుడు ఎవరంటే – వైద్యుడే. అటువంటి వైద్యులు అందుబాటులో లేకుండా ఈవిధంగా చేస్తున్నారు కాబట్టి, జనం ఎక్కువగా ప్రైవేటు దవాఖానాలకు పోవడం జరుగుతోంది.

పేద ప్రజలకు మేలు చేకూర్చాలనే ఏ సదుద్దేశ్యంతో కెసిఆర్ గారు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారో దానిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లవలసిన అవసరం ఉంది. ఇప్పుడు ప్రారంభ దశ, దీన్ని క్రమ క్రమంగా ముందుకు తీసుకెళితే పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆరోగ్యశాఖ మంత్రిగారు సభలోనే ఉన్నారు. ప్రభుత్వ డాక్టర్ల పైన పర్యవేక్షణ, అజమాయిషీ కలిగి ఉండాలి. ఇది చేస్తే మన ముఖ్యమంత్రిగారు తలపెట్టిన కెసిఆర్ కిట్స్ పథకం సంపూర్ణంగా విజయవంతం అవుతుందని భావిస్తూ, నాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చిన మీకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ ఫారూక్ హుస్సేన్ (నామినేటెడ్):–** అధ్యక్షా, కెసిఆర్ కిట్స్ మీద మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదలు తెలియజేస్తున్నాను. నేను కొన్ని విషయాలు సభలో చెప్పాలి. ఇప్పుడు నేను 30 సంవత్సరాల క్రితం విషయం చెబుతున్నాను. నాకు సిద్ధిపేటలో కట్టెల మండి ఉండేది. నేను కట్టెల వ్యాపారం చేసే వాణ్ణి. మా కట్టెల మండి ఎదురుగా ఒక హాస్పిటల్ ఉండేది, అందులో వెంకటేశ్వరరావు అనే డాక్టర్ ఉండేవారు. దానికి పబ్లిక్ క్లినిక్ అని పేరు పెట్టుకున్నారు. అప్పుడు మాకు వైద్యం గురించి అంత అవగాహన ఉండేది కాదు. ఆ డాక్టర్ తెస్తడు, కోస్తడు, పైసలు తీసుకుంటాడు. మేము అదే నిజమని అనుకునే వాళ్లం. ఏమయ్యా, డాక్టర్ సాబ్, నార్మల్ డెలివరీ అవుతుందా అంటే, లేదు లేదు, కడుపులో పిల్ల అడ్డం తిరిగిందని చెప్పేవాడు.

అధ్యక్షా, నేను గ్రామాలలో బాగా తిరిగాను. నేను దుబ్బాక ఎమ్మెల్యేగా కూడా పోటీ చేశాను. సిద్ధిపేట, దుబ్బాక నియోజకవర్గాలలో 146 గ్రామాలలో ఎన్నోసార్లు తిరిగాను. గ్రామాలలో తిరిగే రాజకీయ నాయకులకు వాస్తవాలు తెలుస్తాయి. నిజంగా పేదవాళ్లు ఎలా వున్నారు, వాళ్లకి ఎంత కష్టమవుతోందో నాయకులకు తెలుస్తుంది. ఆ పేద ప్రజలకు నాలెడ్జ్ ఉండదు, ఎడ్యుకేషన్ ఉండదు. కాబట్టి మధ్యలో ఈ ఆర్ఎంపిలు మోపయ్యారు. కడుపు నొప్పి అని ఆర్ఎంపి దగ్గరకు పోతే – చెయ్యి చూసి, అమ్మా నీకు గర్భంలో ఏదో సమస్య వచ్చినట్లుంది, స్పెషలిస్టుకి చూపించాలంటాడు. సిద్ధిపేటలో కానీ, మెదక్‌లో కానీ, సంగారెడ్డిలో కానీ, కరీంనగర్ లేదా హైదరాబాదులో అతనికి పరిచయం ఉన్న డాక్టర్లుంటారు.

ఆ డాక్టర్‌కి ఫోను చేసి, ఈరోజు ఒకరిని పంపిస్తున్నాను, చూసుకోండని చెబుతాడు. ఆ డాక్టర్ ఏమంటాడంటే – మీకు గర్భంలో పుండు ఉంది, దాన్ని తొలగించాలి, లేకపోతే కేన్సర్ వచ్చే అవకాశం ఉందనే భావన కల్పిస్తాడు. ఒకరు, ఇద్దరు పిల్లలు పుట్టిన వారు, పరిస్థితి ఆ విధంగా ఉందని చెప్పిన తర్వాత రిస్కు ఎందుకని వెంటనే గర్భసంచి తీసేయమంటారు. ఆ విధంగా ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని సర్జరీలు చేసి గర్భ సంచులు తొలగిస్తూ రూ.70 వేలు, రూ.80 వేలు వసూలు చేస్తున్నారు. మొత్తం లుటాయిస్తున్నారు.

కొంత మంది ప్రతిపక్షనాయలు మాట్లాడుతున్నారు, ఏమీ జరగడం లేదని. అధ్యక్షా, 60, 70 సంవత్సరాలలో, వారి హయాములో హాస్పిటల్స్ పెరిగాయి కానీ నార్మల్ డెలివరీస్ పెరగలేదు. వాస్తవానికి కెసిఆర్ కిట్స్ వచ్చిన తర్వాత అందరూ అభినందిస్తున్నారు. హరీష్‌రావు గారు సభలో లేరు కానీ, ఏ జిల్లాకు పోయినా, ఏ సభకు పోయినా కెసిఆర్ కిట్స్ గురించే మాట్లాడుతున్నారు. టీవిలు, పత్రికలలో చూసి కొంత మంది ఈ కిట్ గురించి తెలుసుకుంటున్నారు. కానీ రాములు నాయక్‌గారు చెప్పినట్లు అడవులు, మారుమూల ప్రాంతాలలో ఉండే సామాన్య ప్రజానీకానికి ఈ కెసిఆర్ కిట్స్ గురించి తెలియజేయవలసిన అవసరం ఉంది. ఈరోజు బ్రోకర్లు మోపయ్యారు. డాక్టర్లు ఊర్లల్లో బ్రోకర్లను పెడుతున్నారు. మా దగ్గరకు పేషంట్లను పంపిస్తే మీకు చారానా కమిషన్ ఇస్తామని చెబుతున్నారు. మినిస్టర్‌గారు కూడా డాక్టరే కాబట్టి దీని మీద పకడ్బందీగా చర్యలు తీసుకుంటే కొంత వరకు బ్రోకర్లను కట్టడి చేయవచ్చు. ఆర్.ఎం.పి.లు అందరూ తప్పు చేస్తున్నారని నేను చెప్పడం లేదు. గ్రామాలలో ఎప్పుడు ఏమి అవుతుందో తెలియదు కాబట్టి ఆర్.ఎం.పి.లు అవసరం. అందరు ఆర్.ఎం.పి.లు అలా ఉంటారని చెప్పను.

1.20 మ. ఆర్.ఎం.పి.లపై నిఘా ఉంచి, ఇటువంటి పని చేస్తున్న వాళ్ళకు కఠినమైన శిక్ష విధిస్తే, తప్పకుండా పరిస్థితుల్లో మార్పు వస్తుంది.

అధ్యక్షా, సిద్ధిపేటలో 50, 60 హాస్పిటల్స్ ఉన్నాయి. కెసిఆర్ కిట్స్ వచ్చిన తరువాత వాటిని మూసేసే పరిస్థితి వచ్చింది. ప్రైవేటు డాక్టర్లు కలిసినప్పుడు, ఎక్కడికి పోయినా మీ రాజకీయ నాయకులు కెసిఆర్ కిట్స్ అని చెప్తారు, మా హాస్పిటల్స్ మూతపడే పరిస్థితిలో ఉన్నాయని అడుగుతుంటారు. అయ్యా, నిన్నటి దాకా చిన్న రూమ్‌లో ఉంటివి, ఇవాళ 5 అంతస్తుల బిల్డింగ్ వచ్చింది, ఎలా వచ్చిందిదంతా, ఎలా సంపాదించావ్, వ్యవసాయం చేశావా, బంగారం చెట్లు పెట్టావా, ఎక్కడి నుండి సంపాదించావు, ఇది ప్రజల డబ్బు కాదా, ప్రజలను మోసం చేసి సంపాదించింది కాదా అని మేము వాళ్ళని అడుగుతున్నాం. క్రొత్తగా పెళ్ళయిన వాళ్ళు వెళ్ళగానే, వెంటనే పిల్ల అడ్డం తిరిగింది, పెద్ద ప్రాణానికి ప్రమాదమున్నది లేకపోతే చిన్న ప్రాణానికి ప్రమాదమున్నది అని వాళ్ళని బెదిరించే పరిస్థితికి ప్రైవేటు హాస్పిటల్స్ వస్తున్నాయి. కాబట్టి, ప్రభుత్వంతోపాటు, అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా కెసిఆర్ కిట్స్ గురించి అవగాహన ప్రజలలో తీసుకురావలసిన అవసరమున్నది.

గౌరవ ముఖ్యమంత్రి గారి దగ్గర మానవత్వం ఎంత ఉన్నదో మనం గుర్తించాలి.

మానవతా దృక్పథంతో ఆలోచించి కెసిఆర్ కిట్స్ కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. వాస్తవంగా ఈ కార్యక్రమం ప్రజలకు చాలా అవసరమైనటువంటిది. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే, రాష్ట్రం ఆరోగ్యంగా ఉంటుంది. రాష్ట్రం ఆరోగ్యంగా ఉంటేనే, దేశం ఆరోగ్యంగా ఉంటుంది.

ఒక రోజు, దుబ్బాక నియోజకవర్గం నుండి రెడ్డి కుటుంబం హైదరాబాద్‌లోని ఫెర్నాండెజ్ హాస్పిటల్‌కు వచ్చింది. ఎవరో ఆర్.ఎం.పి. పంపారట, డెలివరీ కోసం నేరుగా అక్కడికే వచ్చారు. లక్షా ఇరవై ఐదు వేల రూపాయలు కట్టేదాకా వాళ్ళని విడిచి పెట్టలేదు. ఒక్క రూపాయి కూడా తక్కువ చేయలేదు. ఎం.డి. ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాలేదు. నేను స్వయంగా పోయి కూర్చున్నా గానీ, ఒక్క రూపాయి కూడా తక్కువ చేయలేదు. అటువంటి పరిస్థితి ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో ఉంది, దాని మీద నిఘా ఉంచాలని గౌరవ మంత్రి గారికి కూడా చెప్పాను. అటువంటి హాస్పిటల్స్ ప్రజలను దోచుకుంటున్నాయి. వారికి వేరే ఆలోచనే లేదు. కాబట్టి, ఇటువంటి బ్రోకర్ల గురించి ఆలోచించవలసిన అవసరమున్నది. కెసిఆర్ కిట్స్ మూలాన డెలివరీలు మా చేతిలో నుండి వెళ్ళిపోయాయి, ఇక మిగిలింది ఒక్కటే, గర్భసంచి తీసేయడం ఒక్కటే మిగిలిందని ప్రైవేటు డాక్టర్లు గర్భసంచి మీద పడ్డారు. కాబట్టి, ఆ విషయంలో తప్పకుండా తగు నిఘా ఉంచవలసిందిగా గౌరవ మంత్రి గారిని కోరుతూ, ఈ అవకాశం ఇచ్చినందుకు తమరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నమస్కారం.

**మిస్టర్ ఛైర్మన్ః–** నేను ఐదు నిమిషాలు మాట్లాడమన్నాను. లేదు, రెండే నిమిషాలు మాట్లాడతానన్నారు. 10 నిమిషాలు మాట్లాడారు.

(సభలో నవ్వులు)

ఇంకెవరైనా ఈ అంశంపై మాట్లాడేవాళ్ళు ఉన్నారా?

సభ్యులు మాట్లాడిన విషయాలపై సమాధానం ఇవ్వవలసిందిగా ఆరోగ్య శాఖామాత్యులు, డా. లక్ష్మారెడ్డి గారిని కోరుతున్నాను.

**డా. సి. లక్ష్మారెడ్డి:–** అధ్యక్షా, కెసిఆర్ కిట్స్ స్వల్ప వ్యవధి చర్చపైన గౌరవ సభ్యులు రామచంద్ర రావు గారు, డా.పల్లా రాజేశ్వర రెడ్డి గారు, జనార్ధన్ రెడ్డి గారు, రాములు నాయక్ గారు, కృష్ణా రెడ్డి గారు మరియు ఫారూక్ హుస్సేన్ గారు చాలా వివరంగా మాట్లాడడం జరిగింది. వాస్తవంగా, మాట్లాడిన వారిలో మెజారిటీ సభ్యులు, రామచంద్ర రావు గారితో సహా నేను మాట్లాడాలనుకున్న విషయాలన్నింటినీ వారే మాట్లాడడం జరిగింది.

కెసిఆర్ కిట్స్ కార్యక్రమం ఎంతో మంది ప్రశంసలను అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. వాస్తవానికి కెసిఆర్ కిట్స్ అనేది ముఖ్యమంత్రి గారి ముందు చూపుకు, వారి గొప్ప ఆలోచనకు, వారి విజన్‌కు ఒక నిదర్శనం.

మన దేశంలో, రాష్ట్ర ప్రభుత్వాలు కావచ్చు, కేంద్ర ప్రభుత్వాలు కావచ్చు, ఒక పథకాన్ని ప్రవేశ పెట్టాలని ఆలోచన చేసినప్పుడు, దానివల్ల ఎన్ని ఓట్లు వస్తాయని ఆలోచన చేసి ఆ పథకాన్ని రూపకల్పన చేసేవారు తప్ప, ఒక పథకం ద్వారా, ప్రజలకు గానీ, దేశానికి గానీ, రాష్ట్రానికి గానీ ఏ విధంగా లాభం కలుగుతుందనే దిశగా ఆ ఆలోచనలు సాగలేదు. ఆ దిశగా ఆలోచన జరిగివుంటే, ఈనాడు మన రాష్ట్రాలు గానీ, మన దేశం గానే ఎంతో ముందంజలో ఉండేవి.

మన ముఖ్యమంత్రి కెసిఆర్ గారు, రాష్ట్రాన్ని ఒక విజన్‌తో ముందుకు తీసుకెళ్తూ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతోపాటు, విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాముఖ్యతనివ్వడం జరిగింది. వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి, రాష్ట్రం అభివృద్ధితోపాటు ఆరోగ్యంగా ఉండాలి, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడాలి, ఆరోగ్యవంతమైన తెలంగాణ ఏర్పడాలి అనే దిశగా గౌరవ ముఖ్యమంత్రి గారు ఆలోచనలు చేయడం జరిగింది.

ఎంత అభివృద్ధి జరిగినా, మనుష్యుల దగ్గర ఎంత డబ్బులున్నా, వారికి ఆరోగ్యం లేకపోతే అది వృధా అనే ఆలోచనతో, అందరికీ ఆరోగ్యం అందించడమే ముఖ్యమని భావించిన ప్రభుత్వం, ఆ దిశగా ప్రయత్నం చేసి, బ్రహ్మాండమైన కార్యక్రమాలను గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచనలతో చేపట్టడం జరిగింది.

కెసిఆర్ కిట్స్ అనేది ఒక విజన్‌తో కూడుకున్న కార్యక్రమం. అంటే, కెసిఆర్ కిట్స్ అనేది కొన్ని వస్తువులున్నాయి, వారికి కొంత డబ్బులిస్తున్నాం అనే అంశం వరకే పరిమితం కాదు. వాటితో పాటు ఈ కార్యక్రమంలో ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒక తల్లి కడుపులో బిడ్డ పడ్డప్పటి నుండి, బిడ్డకు జన్మనిచ్చి, ఆ బిడ్డకు ఇమ్యునైజేషన్ పూర్తి అయ్యే వరకు కూడా ఈ కార్యక్రమం వారికి ఉపయోగపడుతుంది.

గ్రామీణ ప్రాంతాలలో కావచ్చు, పట్టణ ప్రాంతాలలో కావచ్చు, మహిళలు గర్భం దాల్చిన తరువాత వాళ్ళకు అవగాహన లేక కొంత, ఆర్థిక స్థోమత లేక కొంత, సౌకర్యాలు లేనటువంటి కారణాలతో కొంత, సరైన చెకప్‌లు చేయించుకోలేక, సరైన ఆహార పదార్థాలు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. డెలివరీ సమయంలో కూడా వాళ్ళు ఇబ్బందులకు లోనై కొన్ని సందర్భాలలో తల్లి లేదా బిడ్డ చనిపోయినటువంటి సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి.

ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైన అభివృద్ధి చెందిందని చెప్పడానికి కొన్ని సూచికలుంటాయి. దానిలో హెల్త్ ఇండికేటర్ కూడా ప్రధానమైనది. ఐ.ఎమ్.ఆర్. మరియు ఎమ్.ఎమ్.ఆర్.లు చాలా ముఖ్యం. కెసిఆర్ కిట్స్ కార్యక్రమాన్ని అమలు పరచడం ద్వారా ఈ రెండింటినీ గణనీయంగా తగ్గించడానికి అవకాశమేర్పడింది.

కెసిఆర్ కిట్స్ కార్యక్రమంలో భాగంగా, ఒక స్త్రీ గర్భం దాల్చినప్పటి నుండి వైద్య ఆరోగ్య శాఖకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది అయిన ఆశా వర్కర్లు లేదా ఏ.ఎన్.ఎమ్.లు మొదటి స్టేజ్‌లో చెకప్ చేసి, వాళ్ళకు ఏమైనా ఇబ్బందులున్నాయా, లేదా వాళ్ళకు ఏవైనా లోపాలున్నాయా, లేదా ఏవైనా సమస్యలున్నాయా అని గుర్తించి వారికి వెంటనే ట్రీట్‌మెంట్ ఇవ్వడం జరుగుతుంది. తరువాత రెగ్యులర్‌గా చెకప్‌లు చేయించడం జరుగుతుంది. డెలివరీ సమయం వరకు ఆ గర్భిణీ స్త్రీ ఆరోగ్య పరిస్థితిని ట్రాకింగ్ చేయడం జరుగుతుంది. వారికేమైనా ఇబ్బందులుంటే ముందుగానే గుర్తించడం జరుగుతుంది కాబట్టి, గర్భిణీ స్త్రీలకు డెలివరీ సమయానికి ఏమైనా ఇబ్బందులు కలుగుతాయనుకుంటే, వారిని ఎక్కువ సౌకర్యాలున్న ఆరోగ్య కేంద్రాలకు లేదా ఆసుపత్రులకు పంపడం జరుగుతుంది. దానివల్ల గర్భిణీ స్త్రీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రసవం అయ్యేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

కెసిఆర్ కిట్స్ కార్యక్రమాన్ని రూపొందించే క్రమంలోనే, అన్ని రకాలుగా ఆలోచించిన ప్రభుత్వం రాష్ట్రంలోని

ఆసుపత్రులను బలోపేతం చేయడం జరిగింది. ఎం.సి.హెచ్ సెంటర్లను ఇప్పటికే పెంచడం జరిగింది. ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలను సమకూర్చడం, సౌకర్యాలను మెరుగుపరచడం, పడకల సంఖ్యను పెంచడం, లేబర్ రూములను, లేబర్ వార్డులను అభివృద్ధి చేయడం జరిగింది.

'102 వాహన సర్వీసు'లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరిగింది. ముందుగా ఏజెన్సీ ప్రాంతాల్లో 41 '102 వాహనాలను' ప్రారంభించిన తరువాత, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలలో మరో 200 వాహనాలను ప్రారంభించడం జరుగుతుంది. మొత్తం 241 '102 వాహనాలను' రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుంది.

ఈ కార్యక్రమం యొక్క ముఖ్యోద్దేశం మేరకు రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులను అభివృద్ధి పరచడం జరుగుతోంది. ఇప్పటికే 12 ఎం.సి.హెచ్ సెంటర్లను మంజూరు చేయగా, అదనంగా మరో 15 ఎం.సి.హెచ్ సెంటర్లను త్వరలో మంజూరు చేయడం జరుగుతుంది. 140 అల్ట్రాసౌండ్ మిషన్లను కూడా క్రొత్తగా ఏర్పాటు చేస్తున్నాం.

కెసిఆర్ కిట్స్ కార్యక్రమం ప్రారంభించిన నాటి నుండి 9 నెలల కాలంలో 2 లక్షల డెలివరీలను చేయడం జరిగిందని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. 2 లక్షల డెలివరీలను కేవలం 9 నెలల కాలంలో చేయడమనేది మామూలు విషయం కాదు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఒక స్త్రీ గర్భం దాల్చిన దగ్గర నుండి అన్ని రకాల చెకప్‌లతోపాటు, డెలివరీ, ఇమ్యునైజేషన్ వంటి కార్యక్రమాలన్నింటినీ కలుపుకొని మొత్తం 4 లక్షల 60 వేల మందిని కెసిఆర్ కిట్స్ కార్యక్రమం క్రింద ఇప్పటిదాకా నమోదు చేయడం జరిగింది.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లోని లేబర్ రూములను ఎల్.డి.ఆర్. కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా పెద్ద ఆసుపత్రుల్లో మెటర్నల్ ఐ.సి.యు.లను ఏర్పాటు చేయడం జరిగింది. కాబట్టి, ఇటువంటి కార్యక్రమాన్ని మంచి ఆరోగ్యవంతమైన సమాజం కొరకు చేపట్టి, బ్రహ్మాండంగా ముందుకు వెళ్తున్నాం. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో మాతోపాటు, గౌరవ శాసనసభ సభ్యులు, గౌరవ శాసన పరిషత్తు సభ్యుల సహకారం కూడా ఉన్నందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, మా అధికారులు, మా సిబ్బంది, డాక్టర్లు అందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

కెసిఆర్ కిట్స్ కార్యక్రమంపై పలువురు గౌరవ సభ్యులు మాట్లాడుతూ, పలు అంశాలను ప్రస్తావించడం జరిగింది. సభ్యులు శ్రీ ఫారూక్ హుస్సేన్ గారు మాట్లాడుతూ ఆర్.ఎం.పి. మరియు పి.ఎం.పి.ల విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. ఈ విషయంలో ఆశా వర్కర్లు, ఏ.ఎన్.ఎమ్.ల పని విధానాన్ని గమనించాలి. గ్రామీణ ప్రాంతాలలో గానీ, పట్టణ ప్రాంతాలలో గానీ ఒక స్త్రీ గర్భం దాల్చినప్పుడు, ఆశా వర్కర్లు గానీ, ఏ.ఎన్.ఎమ్.లు గానీ ముందుండి, ఆ గర్భిణీ పేరును కెసిఆర్ కిట్స్ కార్యక్రమంలో నమోదు చేయించి, డెలివరీ పూర్తయ్యేంత వరకు ఆ స్త్రీని వారు జాగ్రత్తగా చూసుకుంటూ, బిడ్డ జన్మించిన తరువాత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కూడా వారే దగ్గరుండి చూసుకోవడం జరుగుతోంది.

అదే విధంగా, హిస్టరెక్టమీ గురించి గౌరవ సభ్యులు మాట్లాడారు. కెసిఆర్ కిట్స్ కార్యక్రమం కొరకు ప్రభుత్వం తీసుకున్న చర్యలలో భాగంగా, అనుక్షణం మానిటరింగ్ చేస్తుండడంతో, హిస్టరెక్టమీ రేటు కూడా గణనీయంగా తగ్గింది. ఈ విధంగా ప్రభుత్వ పరంగా హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు ముఖ్యమంత్రి గారు ఇచ్చిన ప్రోత్సాహాన్ని మేము అందిపుచ్చుకొని, రాష్ట్ర ప్రభుత్వ పరంగా, రాష్ట్ర హెల్త్ డిపార్ట్‌మెంట్ పరంగా ఎన్నో చర్యలు చేపట్టడం ద్వారా వైద్య రంగంలో ఎంతో అభివృద్ధిని సాధించడం జరిగింది.

ముఖ్యంగా మన రాష్ట్రంలో కెసిఆర్ కిట్స్ కార్యక్రమం విజయవంతం కావడంతో, వివిధ రాష్ట్రాల నుండి, వివిధ ప్రాంతాల నుండి వచ్చి కెసిఆర్ కిట్స్ కార్యక్రమాన్ని చూసి, వాళ్ళు కూడా ఈ పథకాన్ని అనుకరించడం జరుగుతోంది. ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని, ముఖ్యమంత్రి గారి మంచి ఉద్దేశాన్ని అమలు పరిచే బాధ్యత నాకు లభించినందుకు, ఈ కార్యక్రమంలో పాల్గొనే అదృష్టం నాకు లభించినందుకు మనస్ఫూర్తిగా ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

గతంతో పోలిస్తే, ఇప్పుడున్న కార్యక్రమాలకు తగినంత సిబ్బంది లేకపోయినా, ఉన్నంత వరకు శ్రమించి పనిచేస్తున్న వారికి ముఖ్యమంత్రి గారు ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ప్రభుత్వ పరంగా తీసుకున్న కార్యక్రమాన్ని మా డాక్టర్లు, మా సిబ్బంది విజయవంతం చేయాలని కోరుతున్నాను.

ప్రతిరోజు అసెంబ్లీలోగానీ, కౌన్సిల్‌లో గానీ గౌరవ సభ్యులు మా హెల్త్ సెక్టార్ పట్ల అత్యంత శ్రద్ధ చూపిస్తూ, రెగ్యులర్‌గా హెల్త్ సెక్టార్ గురించి ప్రశ్నలు వేస్తూ, ఈ గొప్ప కార్యక్రమాలను

ముందుకు తీసుకెళ్ళేందుకు నాకు సహకరించడం జరుగుతోంది. వారందరికీ మరొక్కసారి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ప్రభుత్వ పరంగా చేపట్టిన కెసిఆర్ కిట్స్ కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం విజయవంతం చేసేందుకు అహర్నిశలూ చేస్తున్న కృషిని గమనించి సహకరించవలసిందిగా సభ ద్వారా అందరిని కోరుతున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:–** సభ ముగిసే వరకు కూడా ముగ్గురు మంత్రులూ సభలోనే ఉండి, ఆత్మస్థైర్యాన్ని, మనోధైర్యాన్ని కలిగించినందుకు సభాపక్షాన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, తిరిగి 23 మార్చి, 2018 శుక్రవారం ఉదయం 10.00 గంటలకు సమావేశమయ్యేందుకు సభను వాయిదా వేయడమయింది.

(23 మార్చి, శుక్రవారం ఉదయం గం.10.00లకు తిరిగి సమావేశమయ్యేందుకు గాను మధ్యాహ్నం గం.1.36 ని.లకు సభ వాయిదా పడింది)

* * *

**"Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad."**